అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 26-03-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 84

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు వెల : 6.50

మళ్లీ పారిన రక్తపుటేరు

దంతేవాడ, బీజాపూర్ సరిహద్దు దండకారణ్యంలో ఎన్‌కౌంటర్



- ముగ్గురు మావోయిస్టులు మృతి
- ఈ ఏడాది ఇప్పటివరకు 130 మంది హతం
- మృతుల్లో తెలంగాణకు చెందిన సుధీర్

నవతెలంగాణ-చర్ల

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతెవాడ సరిహద్దు దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు హతమైనట్టు దంతేవాడ ఎస్పీ గౌరవరాయ్ తెలిపారు. మంగళవారం ఉదయం 8:00 గంటల నుంచి భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య తీవ్ర కాల్పులు జరిగినట్టు చెప్పారు. మృతిచెందిన వారిలో ఒకరు రూ.25 లక్షల బహుమతి గల మావోయిస్టు నాయకుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ ...13లో

అప్పుల పరిమితిని పెంచిన కేంద్ర ప్రభుత్వం

ప్రమాదంలో దేశ ఆర్థిక భద్రత

- ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి దాటి అప్పులు : సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ప్రశ్నకు ఇచ్చిన గణాంకాల్లో స్పష్టం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తన అప్పులను అన్ని పరిమితులకు మించి పెంచి, దేశ ఆర్థిక భద్రతను ప్రమాదంలో పడేసింది. 2024-2025 సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మొత్తం అప్పు రూ.185.11 లక్షల కోట్లు. ఈ మొత్తం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 57.1 శాతంగా ఉంది. ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బీఎం) చట్టం జీడీపీలో 40 శాతం వరకు రుణం తీసుకునే పరిమితిని విధించింది. అయితే, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎంపీ జాన్ బ్రిట్టాస్‌కు అందించిన గణాంకాలు మాత్రం ఈ పరిమితిని మించి కేంద్ర ప్రభుత్వం భారీగా అప్పులు చేస్తోందని చూపిస్తున్నాయి. 2020-2021 నుంచి ప్రభుత్వం పరిమితులను మించి భారీ రుణాలు తీసుకుంటోంది. 2020-2021లో కేంద్ర ప్రభుత్వం మొత్తం ...13లో

అన్నీ కుదిరితే 3 న ప్రమాణం..

అధిష్టానం గ్రీన్ సిగ్నల్లే తరువాయి

- 15 నెలల తర్వాత కొలిక్కొచ్చిన కూర్పు
- మంత్రివర్గ విస్తరణపై వీడనున్న ఉత్కంఠ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇన్నాళ్లూ ఊరిస్తూ వచ్చిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ ఓ కొలిక్కొచ్చింది. అనుకున్నది అనుకున్నట్టుగా జరిగితే.. అన్నీ కుదిరితే వచ్చే నెల మూడో తేదీనే కొత్త మంత్రులు ప్రమాణం చేస్తారని విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ అధిష్టానం విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో అక్కడి నుంచి ఆదేశాలు రాగానే...సంబంధిత జాబితాను విడుదల చేయనున్నారు. ఈ మేరకు సిద్ధంగా ఉండాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆ పార్టీ హైకమాండ్ సూచించింది. కాగా ఇటీవల నిర్వహించిన ఏఐసీసీ భేటీలో క్యాబినెట్ విస్తరణకు సంబంధించి పెద్ద కసరత్తే జరిగినట్టు సమాచారం. ప్రస్తుతమున్న ఆరు బెర్తులను నింపాలా? లేక నాలుగే నింపాలా అనే అంశంపై తర్జన భర్జనలు జరిగినట్టు వినికిడి. మరోవైపు ప్రస్తుతమున్న మంత్రుల్లో ఇద్దరిని తొలగించి, వారి స్థానంలో కొత్త వారికి అవకాశమిస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా జరిగింది. అయితే ఇప్పటికిప్పుడు ఉన్న మంత్రుల్లోంచి ఇద్దరిని తొలగిస్తే, లేనిపోని సమస్యలు ఎదురయ్యే అవకాశముందని అధిష్టానం అంచనా వేసింది. మనస్పర్థలు, గ్రూపు రాజకీయాలు కొనసాగితే అది అంతిమంగా పార్టీకే నష్టం చేకూరుస్తుందనే అంచనాకు హైకమాండ్ వచ్చినట్టు హస్తం పార్టీ నేతలు తెలిపారు. మరోవైపు ఆశావహులు, సీనియర్ నేతల అనుయాయులను ఇబ్బంది పెట్టకుండా ఆరింటిలో నాలుగు ఖాళీలను భర్తీ చేసి, మిగతా రెండింటిని వదిలేస్తే...నాయకులందర్నీ సంతృప్తి పరచొచ్చనే అభిప్రాయానికి ఏఐసీసీ వచ్చిందని వారు తెలిపారు. అందులో భాగంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్‌తోపాటు హైదరాబాద్‌కు చెందిన ఓ మైనార్టీ నేతకు క్యాబినెట్‌లో చోటు కల్పించేందుకు నిర్ణయించినట్టు సమాచారం. ఇలా చేస్తే ఏమైనా ఇబ్బందులొస్తాయని భావిస్తే... రెడ్డి సామాజిక వర్గానికి రెండు (కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి, నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేత సుదర్శన్‌రెడ్డి లేదా మల్‌రెడ్డి రంగారెడ్డి) బీసీలకు మరో రెండు (వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్ లేదా బీర్ల ఐలయ్య) మంత్రి పదవులను కేటాయించేందుకు నేతలు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఎక్కువ మంది మొదటి ప్రతిపాదనకే అంగీకరించారు. ఈ క్రమంలో ఏప్రిల్ మూడున లేదా అదే నెల మొదటి వారంలో జరిగే మంత్రివర్గ విస్తరణ సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. మొత్తం మీద క్యాబినెట్‌కు సంబంధించి 15 నెలల సుదీర్ఘ ఉత్కంఠతకు తెరపడే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి.

జస్టిస్ వర్మను అభిశంసించాలి

నోట్ల కట్టల వ్యవహారంపై విచారణ జరపాల్సిందే : రాజ్యసభలో ప్రతిపక్షాల డిమాండ్



అఖిలపక్ష భేటీకి చైర్మెన్ పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై విచారణకు ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీ స్థాయిలో నగదు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా స్పందించారు. మంగళవారం రాజ్యసభలో ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు చర్చ లేవనెత్తాయి. నోట్ల కట్టల వ్యవహారంపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని కొందరు డిమాండు చేయగా... జస్టిస్ వర్మను అభిశం సించాలని మరికొందరు సూచించారు. ఇది చాలా పెద్ద విషయమని, న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బ తిన్నదని ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వర్మ ఇంట్లో నగదు రికవరీ అంశంపై చర్చిం చేందుకు రాజ్య సభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ అఖిలపక్ష సమావేశానికి పిలుపు నిచ్చారు. ఈ వ్యవహారం తీవ్రమైనదిగా చైర్మెన్ అభివర్ణించారు. ఈ అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష నాయకులతో చర్చలు జరిపినట్టు చెప్పారు. దీనిపై కార్యాచరణకు సంబంధించి ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని ఖర్గే సూచించగా, జేపీ నడ్డా అంగీకరించినట్టు తెలిపారు. వారి సూచనల మేరకు అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. 'జస్టిస్ వర్మ విషయంపై చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశాను' అని మంగళవారం రాజ్యసభలో చైర్మెన్ అన్నారు. ఈ సమస్య చాలా తీవ్రమైనదని, ఈ అంశంపై ఫ్లోర్ లీడర్లతో చర్చించాల్సిన అవసరం ఉంద న్నారు. జస్టిస్ వర్మ వ్యవహారంలో జరుగు తున్న పరిణామాలు, తొలిసారి ఇందుకు సంబంధించిన సమాచారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఉంచడం అసాధారణ విషయంగా తాము ముగ్గురం భావించి నట్టు చెప్పారు. రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ అధ్యక్షతన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అంశంపై పార్ల మెంటులో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభా నాయకుడు జెపి నడ్డా, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, డీఎంకే, బీజేడీ, బీఆర్ఎస్, సీపీఐ(ఎం), యూబీటీ, ఏజీపీ, టీఎంసీ, కాంగ్రెస్, బీజేపీల ఫ్లోర్ లీడర్లు పాల్గొన్నారు.

రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్

గతంలో కాంగ్రెస్ రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌కు మాత్రమే మద్దతు ఇచ్చిందని, అయితేబీజేపీ ప్రభుత్వం మాత్రం మహమ్మారి సమయంలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందని రాజ్యసభలో హోం మంత్రి అమిత్ షా అన్నారు. కాంగ్రెస్, దాని మోసాలతో విసిగి పోయిన ప్రజలు పార్టీని ప్రతిపక్షానికి అప్పగించారని ఆయన వ్యాఖ్యానించారు. అమిత్ షా వ్యాఖ్యలు సభలో ఉద్రిక్తతలను పెంచాయి. దీంతో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. అనంతరం ప్రతిపక్షసభ్యులు వాకౌట్ చేశారు.

ఆ చెత్త మాకొద్దు

అలహాబాద్ న్యాయవాదుల నిరవధిక సమ్మె

జస్టిస్ వర్మ బదిలీని నిరసిస్తూ ఆందోళన 13లో



బయటపడిన

మరో ఇంజినీర్ మృతదేహం

ఇంకా కానరాని ఆరుగురి ఆచూకీ

- సొరంగం ఘటన తీరని వ్యధ 13లో
- బాధిత కుటుంబానికి భరోసా: కలెక్టర్



ఫిరాయింపుల వ్యవహారంలో

స్పీకర్‌కు ఆదేశాలివ్వొచ్చా?

ఈ అంశంపై మాత్రమే వాదనలు వింటున్నాం : మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని సుప్రీం వ్యాఖ్య

సుమారు గంటన్నర పాటు సాగిన సుదీర్ఘ వాదనలు 5లో

పోరాటమే మార్గం

బలహీనవర్గాల పక్షాన నిలిచేది ఎర్రజెండానే..

- ఎన్నికవుతున్న ప్రభుత్వాలన్నీ ధనికవర్గాలు, కార్పొరేట్ల కోసమే!
- ఇండ్ల స్థలాల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం
- కేంద్రబడ్జెట్‌లో కూలీలు, కార్మికవర్గానికి 2శాతం నిధులే..
- ప్రత్యేకంగా హోంశాఖకు మంత్రిని నియమించాలి : రామగుండం మహాధర్నాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



నవతెలంగాణ-కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/ గోదావరిఖని

'ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా పోరాటం ఆగదు. ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయి. ధనికులకు మాత్రమే ప్రయోజనం కలిగించే విధంగా పాలన సాగిస్తున్నాయి. మన ఓట్లతో అధికారం పొందిన ...6లో



విద్యాశాఖలో సంస్కరణలు తెస్తాం

పనితీరును మెరుగుపరుస్తాం

మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్య

టీచర్లు పనిచేయట్లేదు : ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ విమర్శ

నవిద్యాశాఖలో సంస్కరణలు తెస్తామని రాష్ట్ర శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు చెప్పారు. ఇందుకోసం శాసనమండలిలో విస్తృతంగా చర్చిస్తామని అన్నారు. విద్య, ఆరోగ్య రంగాలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టిందని గుర్తు చేశారు. గతంలో విద్యాహక్కు చట్టాన్ని తెచ్చిందే తమ ప్రభుత్వమని వివరించారు. వచ్చే కొన్ని సంవత్సరాల్లో పాతబస్తీ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. గత పదేండ్లుగా ఓల్డ్‌సిటీ నిర్లక్ష్యానికి గురైందనీ, నిజానికి అది ఓల్డ్‌సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ అని అభిప్రాయపడ్డారు. తాము ఇచ్చిన హామీలను తప్పకుండా అమలుచేస్తామని ప్రకటించారు. మంగళవారం అసెంబ్లీలో విద్యాశాఖపై చర్చలో పలువురు సభ్యులు పాల్గొన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం తగ్గుతున్నదన్నారు. దీనికి టీచర్లే కారణమని వ్యాఖ్యానించారు. వారి పనితీరు బాగాలేదని చెప్పారు. ఓల్డ్‌సిటీలో సెలవులు ఉన్నప్పుడు పిల్లలు చిన్న చిన్న షాపుల్లో పనిచేస్తున్నారంటూ ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయా షాపులపై కార్మిక శాఖ దాడులు చేసి కేసులు పెట్టాలని చెప్పారు. పిల్లలను పాఠశాలలకు తప్పకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉర్దూ భాషను కాపాడాలనీ, సంబంధిత రంగాల్లో పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పాఠశాలల్లో ఫర్నీచర్ కొన్నారనీ, బెంచీల కొనుగోళ్లల్లో పెద్ద స్కామ్ జరిగిందని ఆరోపించారు. ఒక్కో బెంచీకి రూ. 3000 నుంచి రూ. 4000 అవుతుందన్నారు. కానీ రూ. 18 వేలకు ఖరీదు చేయడాన్ని తప్పుబట్టారు. దీనిపై విచారణ చేయాలని కోరారు. పాఠశాలలతోపాటు ...5లో

బీఆర్ఎస్ ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు : మంత్రి శ్రీధర్ బాబు

26వేల టీచర్ పోస్టులు భర్తీచేశాం : మాజీమంత్రి హరీశ్‌రావు 5లో..

గాజాలో కొనసాగుతున్న మారణ హోమం



తాజా దాడుల్లో ఏడుగురు చిన్నారులతో సహా 27 మంది మృతి

9మంది సహాయ కార్యకర్తల గల్లంతు

ఆస్కార్ అవార్డు గ్రహీత నిర్మాతపై దాడి 13లో

జమిలీపై జేపీసీ గడువు పొడిగింపు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఒకే దేశం-ఒకే ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించేందుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ కమిటీ పదవీకాలం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారం ...5లో



సామ్‌సంగ్ రూ.5,150 కోట్ల పన్ను ఎగవేత..?

ఐటీ శాఖ నోటీసులు జారీ

జియోకు పరికరాల సరఫరాలో మాయజాలం

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్‌కు భారత ఆదాయపు పన్ను శాఖ భారీ షాక్ ఇచ్చింది. ఆ కంపెనీతో పాటు ఎగ్జిక్యూటివ్‌లకు 601 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.5,150 కోట్లు) పన్ను డిమాండ్ ...13లో

ఊ అంటావా? ఊహూ అంటావా?

సుంకాలు తగ్గించేలా భారత్‌పై ఒత్తిడి | **ట్రంప్ ప్రభుత్వాన్ని కోరిన అమెరికా పారిశ్రామిక సంఘాలు, కంపెనీలు**

అమెరికా వస్తువులపై సుంకాలు, సుంకేతర పన్నులు, నిబంధనలకు సంబంధించిన ఇతర అవరోధాలను తగ్గించేలా భారత్‌పై ఒత్తిడి తేవాలని అమెరికాలోని పలు ప్రముఖ పారిశ్రామిక సంఘాలు, కంపెనీలు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వాన్ని కోరాయి. ఏప్రిల్ 2వ తేదీ నుండి వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ప్రతీకార సుంకాలు విధించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అమెరికా వాణిజ్య మండలి (యూఎస్‌సీసీ), కొయలిషన్ ఆఫ్ సర్వీసెస్ ఇండస్ట్రీస్ (సీఎస్ఐ), మోటార్‌బైక్ కంపెనీ హార్లే డేవిడ్‌సన్ సహా పలు సంస్థలు, కంపెనీలు ఈ విజ్ఞాపన చేశాయి. అమెరికా వాణిజ్య మండలి ఆ దేశంలో అత్యంత ప్రభావవంతమైన లాబీయింగ్ గ్రూప్. 'మేక్ ఇన్ ఇండియా' నిబంధనలను సవరించి, ప్రభుత్వ సేకరణ ప్రక్రియలో అమెరికా సరఫరాదారులను చేర్చాలని ఈ గ్రూప్ భారత్‌ను కోరుతోంది.

వాషింగ్టన్ : భారత్, అమెరికా మధ్య చర్చలు ప్రారంభమైనప్పటి నుండి వాణిజ్య సంబంధాలను విజయవంతమైన ఒప్పందం దిశగా తీసుకుపోవాలని ఇరు దేశాలను యూఎస్‌సీసీ కోరుతోంది. ముఖ్యంగా ఔషధాలపై భారత్ విధిస్తున్న దిగుమతి సుంకాలను తగ్గించాలని అడుగుతోంది. దీనివల్ల అమెరికాలో ఉంటున్న భారతీయ వినియోగదారులకు అందుబాటు ధరలో మందులు దొరకడంతో



పాటు ఆరోగ్య రంగంలో వాణిజ్యం, పెట్టుబడులు పెరుగుతాయని అంటోంది. పేటెంట్ హక్కులు కలిగిన మందులు, వైద్య పరికరాల ధరలపై నియంత్రణ విధించడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ పునరుద్ధరించిన వైద్య పరికరాల దిగుమతులను అనుమతించాలని భారత్‌ను కోరింది.

గ్యాస్‌తో కూడిన ఆల్కహాల్ లేని పానీయాలపై భారత్ 28 శాతం జీఎస్టీ విధిస్తోందని, ఇది అమెరికా కంపెనీలకు నష్టదాయకంగా ఉన్నదని, దీనిని తగ్గించాలని యూఎస్‌సీసీ సూచించింది. గ్యాస్‌తో కూడిన ఆల్కహాల్ లేని పానీయాలకు సంబంధించి పన్ను వర్గీకరణలను సమీక్షించాలని అంటూ దీనివల్ల పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించవచ్చునని, ఆదాయాన్ని పెంచవచ్చునని, ప్రజారోగ్య లక్ష్యాలను సాధించవచ్చునని తెలిపింది. కాగా అమెజాన్, గూగుల్ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎస్ఐ కూడా ట్రంప్ నిర్ణయాన్ని సమర్థిస్తోంది. భారత డిజిటల్ విధానాలను అది వ్యతిరేకించింది. యూపీఐ, రూపే కార్డ్ వంటి దేశీయ చెల్లింపుల వ్యవస్థను కూడా తప్పుపట్టింది.

మోడీ సర్కార్‌కు ముందు నుయ్యి వెనుక గొయ్యి

ఇదిలావుండగా భారత్ నిబంధనలపై అమెరికా అప్పరల్ అండ్ ఫుట్‌వేర్ అసోసియేషన్ (ఏఏఎఫ్ఏ) కూడా విమర్శలు సంధించింది. ఈ నిబంధనల కారణంగా మార్కెట్ నుండి అమెరికా కంపెనీలు తరలిపోవాల్సి వస్తోందని విమర్శించింది. డెయిరీ, గోధుమలు, సోయాబీన్, బాదంపప్పులపై సుంకాలు తగ్గించాలని అమెరికా వ్యవసాయ లాబీయింగ్ గ్రూపులు కూడా కోరుతున్నాయి. కాగా సుంకాలు తగ్గించాలన్న ట్రంప్ ప్రభుత్వ డిమాండ్‌ను హార్లే-డేవిడ్‌సన్ సమర్థించింది. అమెరికా, యూరప్, బ్రెజిల్, థాయ్‌లాండ్‌లో సుంకాలు తక్కువగా ఉన్నాయని, కానీ అమెరికా



మోటారు సైకిళ్లపై భారత్ 100 శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తోందని ఆక్షేపించింది. అయితే దిగుమతి చేసుకుంటున్న మోటారు సైకిళ్లపై కేంద్ర ప్రభుత్వం ఇటీవలే దిగుమతి సుంకాన్ని తగ్గించింది. 1,600 సీసీ వరకూ ఇంజిన్ సామర్థ్యం ఉన్న బైక్స్‌పై సుంకాన్ని 50 శాతం నుండి 40 శాతానికి, 1,600 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న బైక్స్‌పై సుంకాన్ని 50 శాతం నుండి 30 శాతానికి తగ్గించింది.

'సౌగత్-ఎ-మోడీ' కిట్లు రెడీ

రంజాన్ పండుగను ఓట్లుగా మలుచుకునే యత్నం

32 లక్షలమందికి

తోఫా పంపిణీకి ఏర్పాట్లు



న్యూఢిల్లీ : ముస్లింలంటేనే గిట్టనట్టుగా ఉండే మన ప్రధాని మోడీకి వారిపై అమాంతం ప్రేమ పుట్టుకొచ్చింది. వాళ్లకు రిజర్వేషన్లు ఇస్తేనో.. మరో ప్రయోజనం చేకూరుతుందంటేనో బీజేపీ.. ఆర్ఎస్ఎస్ బృందానికి సుతరామూ ఇష్టం ఉండదు. అలాంటిది బీజేపీ ఈ రంజాన్ మాసంలో ముస్లింలకు గిఫ్ట్‌లు ఇవ్వాలని, అది కూడా రంజాన్ పండుగకు తోఫా అందివ్వాలని 'సౌగత్-ఎ-మోడీ' కిట్లు రెడీ చేస్తోంది. బీజేపీ మైనార్టీ సెల్ ద్వారా వీటిని పంపిణీ చేసేందుకు సిద్ధం చేసింది.

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కౌంట్‌డౌన్ షురూ అయింది. అక్కడ నితీశ్ సర్కార్‌పై ముస్లిం ఓటర్లు గుర్రుమంటున్నారు. ఇటీవల ఇఫ్తార్ విందును సైతం బహిష్కరించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు నితీశ్ సర్కార్ మద్దతు పలకటం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది.



ఈ తోఫా ఎవరెవరికీ...

ఈద్‌కు ముందు ఆర్థికంగా బలహీనంగా ఉన్న ముస్లిం కుటుంబాల కోసం బీజేపీ దేశవ్యాప్తంగా ఒక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది చివర్లో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ సమాజం నుంచి మద్దతు కూడగట్టే ప్రయత్నంగా ఈ చర్యను భావిస్తున్నారు.

బీజేపీ మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్దిఖీ మాట్లాడుతూ, "ప్రధాని మోడీ ప్రతి పండుగ వేడుకల్లోనూ, అందరి ఆనందంలోనూ పాల్గొంటు న్నారని వివరించారు. 'సౌగత్-ఎ-మోడీ' కిట్లతో దేశవ్యాప్తంగా 32 లక్షల మంది నిరుపేద ముస్లింలకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. బీజేపీ చీఫ్ జేపీ నడ్డా మార్గదర్శకత్వంలో ఆగ్నేయ ఢిల్లీలోని నిజాముద్దీన్ నుంచి ఈ పంపిణీ ప్రారంభమైంది. కిట్‌లో ఏమేమున్నాయి..? ఆహార పదార్థాలతో పాటు, కిట్లలో బట్టలు, సేమియా, ఖర్జూరం, డ్రై ఫ్రూట్స్ , చక్కెర ఉన్నాయి. మహిళల కిట్లలో సూట్లకు ఫాబ్రిక్ ఉంటుంది, పురుషుల కిట్లలో కుర్తా-పైజామాలు ఉంటాయి. నివేదిక ప్రకారం.. ప్రతి కిట్ ధర దాదాపు రూ.500 నుంచి రూ.600 వరకు ఉంటుంది.

భారతీయులకు సంరక్షకుడినంటూ...

"ప్రధాని మోడీ ఎప్పుడూ తాను 140 కోట్ల మంది భారతీయులకు సంరక్షకుడినని చెబుతుంటారు. వాస్తవానికి అలా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారా..? అన్న దానిపై పలు అనుమానాలు లేకపోలేదు. దేశంలో హిందూత్వ అరాచకాలు పేట్రేగిపోతున్నా..అమాయకుల ప్రాణాలు పోతున్నా..వారికి రక్షణ అనేది లేకుండా పోయిందని పౌర హక్కుల సమాజం నుంచి ఐక్యరాజ్యసమితి మానవహక్కుల వేదికలూ గళమెత్తుతూనే ఉన్నాయి. అయితే అవన్నీ బూటకమంటూ కేంద్రం ప్రకటనలిస్తూ..వాస్తవాలను మరుగున పెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నది.

పండుగ వేడుకల్లో మోడీ..

అన్ని పండుగల్లో మోడీ పాల్గొంటారనీ, నిజాముద్దీన్ దర్గా, అజ్మీర్ షరీఫ్‌లకు సమర్పించడానికి ' చాదర్ ' పంపుతారు" అని బీజేపీ మైనార్టీ నేత అంటున్నారు. అయితే గుజరాత్ ముస్లింలలో ఓ గ్రూపు పిలిస్తే.. కనీసం తలపై టోపీ పెట్టడానికి కూడా మోడీ నిరాకరించిన విషయం విదితమే. అలాంటి కమలం పార్టీకి హఠాత్తుగా ముస్లింలపై ప్రేమపుట్టుకురావడం వెనుక బీహార్‌లోని ఓటర్లను మచ్చిక చేసుకోకపోతే.. కొంప మునగడం ఖాయమన్న భయం కనబడుతోంది. బీహార్‌లో జరిగిన గత ఎన్నికల్లో బీజేపీ బీ టీమ్..మజ్లిస్ రంగంలో దిగటంతో..తేజస్వీ యాదవ్‌కు సీఎం కుర్చీ చేజారింది. బీజేపీ, ముస్లింల మధ్య ఉన్న ఈ గ్యాప్‌ను ముఖ్యంగా.. బలహీనవర్గాలకు చెందిన వారిపై తోఫా వల వేయటానికి మోడీ సర్కార్ సిద్ధమైంది.

32 వేలమంది కార్యకర్తలు

32 వేల మసీదులను సంప్రదించి...

దేశంలోని పలు కీలక మసీదులపై బీజేపీ రాజకీయం చేస్తున్నది. జ్ఞానవాపీ, సంభాల్ ఇలా పలు మసీదుల వద్ద హిందూత్వశక్తులు మత హింసకు పాల్పడుతున్నాయి. కనీసం రంజాన్ మాసంలో ప్రభుత్వ ఉద్యోగులు ఇఫ్తారీ చేసుకునేందుకు ఇండ్లకు వెళ్లటానికి గంట ముందు అనుమతికి కూడా బీజేపీ నేతలు, కేంద్రమంత్రులు అభ్యంతరం తెలుపుతున్నారు. అలాంటిది 32,000 మంది మైనారిటీ మోర్చా కార్యకర్తలు 32,000 మసీదులను సంప్రదించి, ఈ ప్రత్యేక కిట్‌లను లబ్దిదారులకు అందజేయనున్నారు.

ప్రజలు జరుపుకునే గుడ్ ఫ్రైడే, ఈస్టర్ , నౌరూజ్ వంటి ఇతర పండుగలను కూడా ఈ ప్రచారం కవర్ చేస్తుందని సిద్దిఖీ కొత్త పల్లవి తెలిపారు. "ఈ కార్యక్రమాన్ని ఢిల్లీ, దేశంలోని ఇతర రాష్ట్రాలలో ప్రారంభించారు. ప్రధానమంత్రి తరపున ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ కార్యక్రమం కింద మా ప్రతి కార్యకర్త (కార్మికులు) కనీసం 100 మందికి సౌగత్-ఎ-మోడీ కిట్‌లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఆయన అన్నారు.

ఈ ఏడాది అక్టోబర్-నవంబర్ నెలల్లో జరిగే 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ చొరవ ప్రారంభం కావడం గమనార్హం. అక్కడ బీజేపీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ (యునైటెడ్) , ఇతర ప్రాంతీయ పార్టీలతో కూడిన ఎన్డీఏ పాలక కూటమి పాలన సాగుతోంది.

2020 ఎన్నికల్లో, ఎన్డీఏ 125 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్, ఆర్జేడీ , ఇతర పార్టీలతో కూడిన మహాఘట్‌బంధన్ 110 సీట్లు గెలుచుకుంది. ఇపుడు నితీశ్ సర్కార్ పై ముస్లిం ఓటర్ల గుస్సాను దూరం చేయటానికి తోఫా పథకానికి శ్రీకారం చుట్టినట్టుగా ఉన్నదని పరిశీలకులు అంటున్నారు. అయితే ఈ తోఫాతో ముస్లిం సమస్యలు తీరుతాయా..? హిందూత్వ శక్తుల అరాచకాలు ఆగుతాయా..? కుల, మతం, ప్రాంతం అనే బేధం లేకుండా పాలన సాగించాల్సిన దేశ ప్రధాని మోడీ కేవలం హిందువులకే తాను ప్రధాని అన్నట్టుగా వ్యవహరించటం మానేస్తారా అని వారు ప్రశ్నిస్తున్నారు.



రాజకీయ పార్టీలతో ఈసీ సమావేశం

ఓటర్ల ప్రక్షాళన, కొత్త ఓటర్లు నమోదుపై చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఓటర్ల జాబితా ప్రక్షాళన, కొత్త ఓటర్ల నమోదు, తదితర అంశాలపై చర్చించడానికి ఎన్నిక సంఘం రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలతో మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమైంది. తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు డీజీ.నర్సింహరావుతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, ఆప్ తదితర పార్టీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఓటర్ జాబితాలో పొరపాట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో పోలింగ్ బూతుల ఏర్పాటు, ఆధార్‌లింక్, మరణించిన వారిని ఓటరు జాబితానుంచి తొలగించడంపై ఆయా పార్టీల అభిప్రాయాలను తీసుకుంది. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందనీ, అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు అన్ని పార్టీలు కృషి చేయాలని ఆయా పార్టీలకు సుదర్శన్‌రెడ్డి సూచించారు.



ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం రాష్ట్ర కమిటీ ఎన్నిక

- కన్వీనర్‌గా సి సాయమ్మ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం రాష్ట్ర కమిటీ కన్వీనర్‌గా సి సాయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సదస్సులో 27మంది రాష్ట్ర కమిటీ సభ్యులతోపాటు కన్వీనర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కో కన్వీనర్లుగా... నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, కవిత, జయలక్ష్మి, సావిత్రి, షాయిన్ బేగం, కమిటీ సభ్యులుగా చంద్రమ్మ, మేరీ, నీరజ రెడ్డి, విజయలక్ష్మి, సంతోష, నిర్మల, సత్యమ్మ లక్ష్మి, మంగమ్మ, భాను, ప్రియాంక, అనసూజా, ఎ లక్ష్మి, శారదా, మౌనిక, మనోహర, పద్మ, ఉషా, దీపిక ఎన్నికయ్యారు. సదస్సుకు 15 జిల్లాల నుంచి 100 మంది మహిళా వికలాంగులు హాజరయ్యారు. రాష్ట్రంలోని మహిళా వికలాంగుల సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. మహిళా వికలాంగుల సమస్యలపై దశలవారీగా రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు నిర్వహించాలని తీర్మానిం చారు. మహిళా వికలాంగులపై వేధింపులు, లైంగిక దాడులను అరికట్టాలనీ, సకలాంగుల మహిళలతో సమానంగా మహిళా వికలాంగులకు అవకాశాలు కల్పించాలనీ, ఇందిరా మహిళా శక్తి పథకంలో ఐదు శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు.

8 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలి

- తెలంగాణ మీసేవ ఎంప్లాయీస్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మీసేవా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనీ, 8 నెలల పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మీసేవ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో మీసేవా ఈఎస్‌డీ కమిషనర్ రవికిరణ్‌కు ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్షులు ఆర్.సురేశ్, ప్రధాన కార్యదర్శి జెనీమా, కోశాధికారి ఎవిబి లక్ష్మి, సహాయ కార్యదర్శి కవిత, ఉపాధ్యక్షులు బి.బాల్‌రాజు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ మీ-సేవా కేంద్రాలు అద్భుతంగా పనిచేస్తున్నాయని, ప్రజలకు అనేక సేవలను అందించడంలో ప్రశంసనీయ పాత్ర పోషిస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు అనేకమార్లు చెప్పారని గుర్తుచేశారు. వారు ఆ స్థాయిలో కష్టపడుతున్నా రెండేండ్ల నుంచి మీసేవ ఉద్యోగులకు వేతనాల పెంపు లేదని ప్రస్తావించారు. 2022కు సంబంధించి 8 నెలల పిఎఫ్ బకాయిలు క్లియర్ చేయలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బ్రేక్ లేకుండా పిఎఫ్ ఖాతాలు కొనసాగించాలని విన్నవించారు. హెల్త్ ఇన్సూరెన్స్ పథకానికి సంబంధించిన విధివిధానాలు రూపొందించడంలో ఆలస్యం కావడాన్ని ఎత్తిచూపారు. పనిభారం పెరుగుతున్న నేపథ్యంలో అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. కనీస వేతనాలు, వార్షిక బోనస్‌ను అమలు చేయాలని విన్నవించారు. రూ.10 లక్షలు హెల్త్ ఇన్యూరెన్స్ స్కీమ్ వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మీ-సేవా కేంద్రాల్లో కస్టమర్లకు కనీస సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు.

రోబోటిక్ ద్వారా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స

- దక్షిణ భారతదేశంలో తొలిసారి
- నిమ్స్ డాక్టర్లు సాధించిన విజయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో రోబోటిక్ ద్వారా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా చేసి చరిత్ర సష్టించారు. నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తి (33 సంవత్సరాలు) గత పదేళ్ళుగా ఎండ్-స్టేజ్ మూత్రపిండ వ్యాధితో పోరాడుతున్నాడు. 2017లో ఒక సారి మార్పిడి చేసుకున్న తర్వాత అతనికి రెండవ మార్పిడి అవసరం అయింది. అప్పటికే ఒకసారి శస్త్రచికిత్స చేయించుకున్నందున రెండవది సంక్లిష్టంగా మారింది. అలాంటి సంక్లిష్టమైన దానిని రోబోటిక్ విజయవంతంగా చేయడంతో వెంటనే మూత్ర విసర్జన జరగడమే కాకుండా రోగి సజావుగా కోలుకుంటున్నారు. ఈ ఏడాది మొదటి రెండున్నర నెలల వ్యవధిలో నిమ్స్‌లో 41 మూత్రపిండ మార్పిడిలను నిర్వహించింది. ఆస్పత్రిలో ఇప్పటి వరకు 2 వేల మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సలను చేశారు. రోబోటిక్ టెక్నాలజీ రాకతో శస్త్రచికిత్స ఖచ్చితత్వం పెరగడంతో పాటు కోలుకునే సమయం తగ్గిస్తుందని ఆస్పత్రి ప్రధాన యూరాలజిస్ట్, ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవ రాజ్ తెలిపారు. తెలంగాణ ఆరోగ్యశ్రీ పథకం కింద ఈ ప్రక్రియను ఉచితంగా నిర్వహించినట్టు చెప్పారు. అరుదైన ఘనతను సాధించినందుకు వైద్య బందానికి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అభినందనలు తెలిపారు. వారి అంకితభావం, నైపుణ్యాన్ని ప్రశంసించారు. రోబోటిక్ సర్జరీ విజయవంతానికి సహకారం అందించిన యూరాలజీ బందానికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పకు డాక్టర్ రాహుల్ దేవ్ రాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

సెర్ఫ్ ఆఫీస్‌ను ముట్టడించిన ఐకేపీ వీఓఏలు

రూ. 20 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్

అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించిన పోలీసులు

తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, ఎస్వీ రమ



నవతెలంగాణ-అంబర్‌పేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.20,000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు సెర్ప్ ఆఫీస్‌ను ముట్టడించారు. ఈ క్రమంలో పోలీసులు భారీగా మోహరించి వారిని అరెస్టు చేసి నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ముట్టడి సందర్భంగా తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర



అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, ఎస్వీ రమ మాట్లాడుతూ.. బకాయి ఉన్న స్త్రీ నిధి ఇన్సెంటివ్‌ను గ్రామ సంఘాలకు వెంటనే చెల్లించాలని, గ్రామ సంఘాల నుంచి ఐకేపీ వీఓఏలకు రావల్సిన రూ.3,000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐకేపీ వీఓఏల డిమాండ్లను పరిష్కరిస్తామని గతంలో టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్ రెడ్డి అనేక సభల్లో హామీనిచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా నేటికీ వారికి వేతనాలు పెంచకపోవడం అన్యాయ మన్నారు. సమస్యను పరిష్కరించడం చేతకాని ప్రభుత్వం ఐకేపీ వీఓఏలపై పోలీసులను ప్రయోగించి రెండ్రోజులుగా అనేక జిల్లాల్లో తీవ్ర నిర్బంధం విధించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అప్రజాస్వామిక చర్యలను యూనియన్ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. తక్షణం ఐకేపీ వీఓఏల ఉద్యోగ భద్రత, రూ.20,000 కనీస వేతనంపై బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ ఆఫీస్ ముట్టడిలో ప్రదర్శించిన సమరశీల పోరాట స్ఫూర్తి.. సమస్య పరిష్కారమయ్యే వరకు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

గ్రామ స్థాయిలో పనిచేస్తున్న వీఓఏలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం.. గ్రామ సంఘం నుంచి రావాల్సిన రూ.3,000 అమలు కావడం లేదన్నారు. గ్రామ సంఘాల సభ్యుల ఆన్‌లైన్ కార్యకలాపాలు వేగంగా జరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నగేష్, రాష్ట్ర కోశాధికారి సుమలత, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ దుర్గయ్య, కుమార్, శ్రీనివాస్, అంజి, వెంకటయ్య, రమేష్, వసియా బేగం, చంద్రలీల, బుద్ధ తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా

28న రాష్ట్రవ్యాప్త నిరసన

ఎస్‌కేఎం రాష్ట్ర కమిటీ పిలుపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పంజాబ్‌లో రైతుల నిరసనపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా ఈనెల 28న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్త పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఎస్‌కేఎం రాష్ట్ర సమన్వయ కమిటీ విజ్ఞప్తిచేసింది. భగవంత్ సింగ్ మాన్ నేతత్వంలోని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర పోలీసులు జగ్జీత్ సింగ్ దల్లెవాల్ , శ్రవాన్ సింగ్ పాంధర్‌లతో సహా 350 మంది రైతు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఖనౌరి, శంభు సరిహద్దులలో ఆందోళన చేస్తున్న రైతుల టెంట్లు, వేదికలను పోలీసులు బుల్డోజర్లతో కూల్చివేసి, ట్రాక్టర్ ట్రైలర్లు, ట్రాలీలు ఇతర ఉపకరణాలను బలవంతంగా తొలగించారు. ఈనెల మూడు, నాలుగు తేదీలలో పంజాబ్ అంతటా ఇలాంటి అణచివేత కొనసాగింది. ఐదు నుంచి చండీగఢ్‌లో ఎస్‌కేఎం ప్రకటించిన ప్రదర్శన, వారం రోజుల ధర్నాను అడ్డుకోవడానికి బల్బీర్ సింగ్ రాజేవాల్, రుల్దు సింగ్ మాన్సా వంటి నాయకులు సహా 800 మందికి పైగా ఎస్‌కేఎం కార్యకర్తలను అరెస్టు చేసి జైలులో పెట్టారు. నిరసన తెలిపే పౌరుల రాజ్యాంగ హక్కు ప్రజాస్వామ్య సమాజానికి పునాది రాయి. ఎస్‌కేఎం ప్రధాన నాయ కులు, కార్యకర్తల అరెస్టును ధైర్యంగా ఎదుర్కొన్న పంజాబ్ రైతులు 2025 మార్చి 5న పంజాబ్ అంతటా భారీ శాంతియుత ప్రదర్శ నలు నిర్వహిం చారు. ఖనౌరి, శంభు పంజాబ్ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతులు , కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు హర్యానా పోలీసులు మూసి వేశారు. రైతు సంఘాలు ఎంఎస్‌పీ, రుణమాఫీ వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల కోసం పోరాడుతున్న సంగతి తెలిసిందే. నరేంద్ర మోడీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్న నేపథ్యంలో వ్యవ సాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎస్‌కేఎం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే అప్పుల నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. గత పదేండ్లల్లో మోడీ ప్రభుత్వం రూ. 16 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసిందనీ, కానీ ఒక్క రూపాయి కూడా రైతులకు రుణాన్ని మాఫీ చేయలేదు. వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరిం చడానికి ఎంఎస్‌పీ, రుణ మాఫీ తప్పనిసరి కాబట్టి, కార్పొరేట్ శక్తులు, పోలీసు అణచివేతకు వ్యతిరే కంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనలో రైతు సంఘాలతోపాటు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు భాగ స్వామ్యం కావాలని కోరారు. ఈమే రకు తెలంగాణ సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, పశ్య పద్మ వి ప్రభాకర్, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, కొండల్, పెద్దారపు రమేష్, నాగిరెడ్డి, ప్రసాదన్న, భాస్కర్, ఆర్ వెంకట్ రాములు, కాంతయ్య మంగళవారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు.

రోడ్లు, భవనాల కోసం రూ.32,832 కోట్లు ఖర్చుపెట్టినం

నల్లగొండ నియోజకవర్గంలో 279 కోట్లతో రోడ్లేసినం

వేయలేదని మంత్రి కోమటిరెడ్డి అనటం సరిగాదు రమ్మంటే..వచ్చి చూపించడానికి సిద్ధం

నేనూ చెప్పేది ప్రతిదీ ప్రభుత్వ అధికారిక వాస్తవాలే

బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్లు వేయలేదు..గుంతలు కూడా పూడ్చలేదని మంత్రి కోమటిరెడ్డి మాట్లాడటం అవాస్తవమనీ, బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో 32,832 కోట్లతో రోడ్లు, బ్రిడ్జీలు, బిల్డింగ్ నిర్మాణాల కోసం ఖర్చు పెట్టామని బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. నల్లగొండ నియోజకవర్గంలో రూ.279 కోట్లతో రోడ్లేసినమని మరోమారు స్పష్టం చేశారు. ఆ రోడ్లను చూపించడానికి తాము సిద్ధమని సవాల్ విసురుతూ రోడ్ల ఫొటోలను సభలో ప్రదర్శించారు. మంగళవారం అసెంబ్లీలో పలు శాఖల పద్దులపై చర్చ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. తాను చనిపోతే దేహంపై జాతీయ జెండా కప్పుతారనీ, ఆ గౌరవం పొందే అతి తక్కువ మందిలో తానొక్కడినని చెప్పారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, నాలుగేండ్లు మిషన్ భగీరథ వైస్‌చైర్మెన్‌గా పనిచేసిన తనను ఎవరు కించపర్చాలని చూసినా సభలో వాస్తవాలే చెబుతానని భావోద్వేగంతో అన్నారు. ఆర్అండ్ బీ శాఖకు బడ్జెట్ కేటాయింపుల్లో 11,316 కోట్ల లోటు ఉందని ఎత్తిచూపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం రూ.8,112 కోట్లు ఖర్చుచేశారనీ, అందులో రూ.4,167 కోట్లు అప్పులు తెచ్చారని మంత్రి అవాస్తవాలు మాట్లాడారని చెప్పారు. వివిధ విభాగాల్లో రోడ్లు, బ్రిడ్జిలు, బిల్డింగ్‌లు, రెన్యువల్స్ కలిపి పదేండ్ల కాలంలో మొత్తంగా 24,832 కోట్లు విడుదలయ్యాయని గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రంలో నేషనల్ హైవేల కోసం పెట్టిన రూ. 8 వేల కోట్లు కూడా కలిపితే 32,832 కోట్లు ఖర్చుచేశామని



నొక్కి చెప్పారు. బీఆర్ఎస్ రాక ముందు తెలంగాణలో 60 ఏండ్లలో డబుల్ రోడ్ల విస్తీర్ణం 6,093 కి.మీ ఉంటే బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో 8,432 కి.మీ సింగిల్ లైన్ నుండి డబుల్ రోడ్లుగా మార్చామనీ, నాలుగు లైన్ల రోడ్లను 485 కిలోమీటర్లు వేశామని వివరించారు. తాము అధికారంలోకి రాకముందు 2,511 కి.మీ నేషనల్ హైవేలుంటే కేసీఆర్ వచ్చిన పదేండ్లలో 2,472 కి.మీ కొత్తగా వచ్చాయని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో ఒక కోటి స్క్వేర్ ఫీట్ల కొత్త బిల్డింగ్‌లు నిర్మించామని తెలిపారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఓపెన్ చేయాలని కోరారు. ఉప్పల్ ఫ్లైఓవర్‌కు 2017లో గ్రీన్‌సిగ్నల్ వచ్చిందనీ, 2018లో పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. పనులు వేగంగా జరిగేందుకు ఎస్క్రో అకౌంట్‌ను తాను ఓపెన్ చేయించానని సభాదృష్టికి తీసుకొచ్చారు. మంత్రి కోమటిరెడ్డి తీసుకొచ్చారని చెప్పడం అబద్ధమన్నారు. 15 నెలల నుంచి పనులు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి 50 శాతం ఇస్తామని కేంద్రాన్ని ఒప్పించామని గుర్తుచేశారు. ఉత్తర భాగం భూసేకరణ 80 శాతం త్రీడీ నోటిఫికేషన్ కూడా పూర్తిచేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క ఎకరం కూడా భూసేకరణ చేయలేదని విమర్శించారు. ఆర్ఆర్ఆర్ కోసం రూ.3 వేల కోట్లు పెట్టాల్సి ఉండగా..రూ.1500 కోట్లు మాత్రమే పెట్టారని ఎత్తిచూపారు. పర్యాటక రంగం అభివృద్ధిలో కేవలం మహబూబ్‌నగర్, ములుగు జిల్లాలనే కాకుండా ఇతర జిల్లాలనూ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖకు ఏటేటా నిధులు తగ్గించడం సరిగాదని సూచించారు. పెంచాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో చివరి బడ్జెట్‌లో అటవీ శాఖకు రూ.1471 కోట్లు కేటాయిస్తే..ప్రస్తుతం దాన్ని రూ.1023 కోట్లకు తగ్గించడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో గ్రీన్ కవరేజీ 33 శాతానికి పెంచాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. చెట్ల నరికివేత విషయంలో రాష్ట్ర సర్కారు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కంపా నిధులను పూర్తి స్థాయిలో వాడుకోవాలని సూచించారు.

గతేడాది ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.38 వేల కోట్ల ఆదాయాన్ని టార్గెట్‌గా పెట్టుకున్నారనీ, ఈసారి దాన్ని రూ.50 వేల కోట్లకు పెంచుకోవడాన్ని తప్పుబట్టారు. మ్యానిఫెస్టోలో బెల్ట్ షాప్‌లు తీసేస్తామని

ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.18 వేల కోట్ల ఆదాయం పెంచుకోవాలనుకోవడం బాధాకరం

ప్రకటించి ఇప్పుడు ఆదాయాన్ని పెంచుకుంటామని ప్రకటించడం దారుణమన్నారు. కొత్త బ్రాండ్లు, కొత్త బీర్లు, కొత్త బార్లు, మరిన్ని బెల్ట్ షాప్ లు తీసుకొచ్చి ప్రజల నుండి ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడానికి కొత్త పాలసీ తేవడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడం కోసం ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తారా? అని ప్రశ్నించారు. బెల్టుషాపులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలి

సీఎం పర్యవేక్షిస్తున్నా ఇతర పనుల్లోనే బిజీ

సర్కారు బడుల్లో 6 లక్షల మంది విద్యార్థులు తగ్గడమేంటీ?: అసెంబ్లీలో బీజేపీ సభ్యుడు పైడి రాకేశ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రిని కేటాయించాలని బీజేపీ సభ్యులు పైడి రాకేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అసెంబ్లీలో విద్య, వాణిజ్య పన్నులు, క్రీడలు, యువజన సర్వీసులు, రోడ్లు, భవనాలు, ఎక్సైజ్, పర్యాటకం, పర్యావరణ, అడవులు, దేవాదాయ శాఖల పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నా ఇతర శాఖలు, పనుల్లోనే బిజీగా ఉన్నారని చెప్పారు. విద్యాశాఖకు మంత్రి ఉంటే ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 26 వేల ఉపాధ్యాయ పోస్టులు, కాంగ్రెస్ ప్రభుత్వం 11 వేల టీచర్ పోస్టులు కలిపి 37 వేల పోస్టులను భర్తీ చేశాయని చెప్పారు. విద్యారంగానికి వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయని అన్నారు. అనుభవమున్న అధికారులున్నారని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వ స్కూళ్లలో ఆరు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడో లోపం ఉందనీ, దాన్ని సరిదిద్దాలని కోరారు. పదేండ్లలో ఆరు వేల స్కూళ్లు మూతపడ్డాయని వివరించారు. గతేడాది 1,834 బడుల్లో విద్యార్థుల్లేరనీ, ఈ ఏడాది 1,938 ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చు కోవడానికి భవిష్యత్‌లో వాటిని వేలం వేస్తారని చెప్పారు. విద్యారంగమంటే ప్రభుత్వానికి నిర్లక్ష్యమెందుకని ప్రశ్నించారు. కనీస వసతుల్లేవనీ, బాత్రూమ్‌లు, మరుగుదొడ్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. వసతుల్లేని ప్రభుత్వ బడులకు విద్యార్థులు ఎందుకెళ్లాలని అడిగారు. అందుకే అప్పుచేసి ప్రయివేటు బడులకు పిల్లలను పంపిస్తున్నారని అన్నారు. సర్కారు బడులపై తల్లి దండ్రులు నమ్మకం కోల్పోయారని చెప్పారు. పేదలకు విద్యను దూరం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కానీ 2025-26 బడ్జెట్‌లో 7.57 శాతం నిధులనే కేటాయించిందని వివరించారు. విద్యారంగాన్ని కాపాడాలని కోరారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్

- రాజ్‌ఠాకూర్

పదేండ్లపాటు బీఆర్ఎస్ హయాంలో క్రీడలను పట్టించుకోలేదని కాంగ్రెస్ సభ్యులు రాజ్‌ఠాకూర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్స హిస్తున్నదని చెప్పారు. అందులో భాగంగానే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని తెస్తున్నదని వివరిం చారు. హైదరాబాద్- రామ గుండం రహదారిని ఆరు లేన్లుగా వేయాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి, గండ్ర సత్య నారాయణరావు మాట్లాడుతూ పదేండ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసింద న్నారు. గురుకులాలు, ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యులకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ సభ్యులు మందుల సామేల్ సూచించారు. 'విజ్ఞానంతోనే విక సించు జగత్తు, పసిపిల్లల చదువే దానికి విత్తు'అనే పాటను కాంగ్రెస్ సభ్యులు ఆదినారాయణ పాడారు. మన ఊరు-మనబడి పథకంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు నిధులు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ సభ్యులు మర్రి రాజశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

119 నియోజకవర్గాల బడ్జెట్ వివరాలివ్వాలి

బీఆర్ఎస్ హయాంలో సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాలకు ఎక్కువ నిధులను కేటాయించారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్, మధిర, కొల్లాపూర్ నియోజకవర్గాలకు అధిక నిధులిచ్చారంటూ ప్రచారం జరుగుతున్నదని రాకేశ్‌రెడ్డి చెప్పారు. 2026-27 బడ్జెట్ ప్రవేశపెట్టినపుడు 119 నియోజకవర్గాల వారీగా నిధుల కేటాయింపు వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను ఇవ్వాలని కోరారు. ఎర్రచందనం ఎగుమతికి తెలంగాణకు అనుమతి లేదని చెప్పారు. దేశంలో 16 రాష్ట్రాలకే అనుమతి ఉందనీ, అందులో తెలంగాణ లేదని వివరించారు. కేంద్రానికి లేఖ రాసి అనుమతి పొందాలని సూచించారు.



ఎరుపెక్కిన తమిళ వీధులు

గ్రాండ్ వాలంటీర్ పరేడ్‌కు ఘనంగా రిహార్సల్

ఉత్సాహంగా పాల్గొన్న వాలంటీర్లు

చెన్నై : ఈ ఆదివారం తమిళనాట వీధులన్నీ ఎరుపెక్కాయి. ఏప్రిల్ 6న రాష్ట్రంలోని మధురైలో సీపీఐ(ఎం) 24వ జాతీయ మహాసభలో భాగంగా గ్రాండ్ వాలంటీర్ పరేడ్ నిర్వహించనున్నారు. ఈ గ్రాండ్ వాలంటీర్ పరేడ్‌కు రిహార్సల్‌ను ఈ నెల 23న తమిళనాడు వ్యాప్తంగా ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించారు. చెరిగిపోని స్వాతంత్య్ర స్ఫూర్తి భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు వర్ధంతి అయిన ఆదివారంను ఈ రిహార్సల్‌కు ఎంపిక చేశారు. గ్రాండ్ వాలంటీర్ పరేడ్‌లో పాల్గొనే వాలంటీర్లంతా ఈ రిహార్సల్‌లో పాల్గొన్నారు. ఈ రిహార్సల్ కవాతు నుంచి గౌరవ వందనాన్ని మధురై ఔటర్ జిల్లాలోని తెర్కల్లుపట్టిలో కేంద్ర కమిటీ సభ్యులు, జాతీయ మహాసభ సమావేశ రిసెప్షన్ కమిటీ చైర్మన్ కె. బాలకృష్ణన్ స్వీకరించారు. కాంచీపురంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం, మధురై నగరంలో రిసెప్షన్ కమిటీ కార్యదర్శి, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎస్. వెంకటేషన్ స్వీకరించారు. అలాగే ఆయా జిల్లాల్లో వివిధ కేంద్ర కమిటీ, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యులు పరేడ్ గౌరవ వందనాలు స్వీకరించారు.

కాగా, ఏప్రిల్ 6న మధ్యాహ్నం 3 గంటలకు మధురైలోని తెప్పకుళం సమీపంలో గ్రాండ్ వాలంటీర్ పరేడ్ ప్రారంభం కానుంది. భారత దేశ విప్లవాత్మక పోరాటాల చిహ్నాల్లో ఒకటైన వాచతీ వారియర్స్ ఈ పరేడ్ ప్రారంభిస్తారు. తమిళనాడు నలుమూలల నుంచి 25 వేల మందికిపైగా ఈ కవాతులో పాల్గొంటారు. శ్రామికవర్గపు యూనిఫాం ఖాకీ, ఎరుపు దుస్తులు ధరించి, ఎర్ర జెండాలతో ఈ పరేడ్ నిర్వహిస్తారు.

మా-టమాట

'ఈ జీతంతో నెట్టుకు రావటం కష్టంగా వుంది భాయ్ ' అని మొరపెట్టుకునే ఫ్యాక్టరీ కార్మికులు ఎంతో మంది కనబడుతుంటారు. గిట్టుబాటు ధరకోసం రోడ్డెక్కి ఏండ్లతరబడి ఉద్యమాలు చేస్తున్న రైతులున్నారు. రోజుకూలి పదో పరకో పెంచకపోరా అనే ఆశతో పలుగు, పార పట్టుకుని మోర పైకెత్తి ఆశగా చూసే గ్రామీణ ఉపాధి చట్టం కార్మికులున్నారు. కనీస స్థాయి వేతనం కోసం ప్రభుత్వాల దిగ్బంధాలను ఎదిరించి పోరాడే ఆశా, అంగన్వాడీ మహిళా ఉద్యోగుల వార్తలనూ వింటున్నాం.

వీటితో పాటు చట్ట సభలు కోటీశ్వరులు, శత కోటీశ్వరులతో నిండి పోతున్నాయని నెత్తినోరు కొట్టుకుంటూ ఏడీఆర్ నివేదికలు ఉన్నాయి. చట్ట సభలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల లెక్క చూస్తే సామాన్యుల కండ్లు తిరుగుతాయి.

అయినా పార్లమెంటు సభ్యులుగా వారికిస్తున్న జీతాలు సరిపోవటం లేదని కేంద్ర బీజేపీ ప్రభుత్వం 'మహా ఇదై' వారి జీతాలు అమాంతం 24 శాతం పెంచింది. జీతంతో పాటు అలవెన్సులూ, పెన్షన్లనూ పెంచింది. మొన్నటి దాకా నెలకు అక్షరాలా లక్ష రూపాయల జీతం తీసుకుంటున్న ఎంపీకి ఇప్పుడు జీతం రూ. 1,24,000. దీనితో పాటు ఢిల్లీలో అద్దె లేకుండా ఇల్లు.

అన్నట్టు మనం నెలవారీ జీతానికిగానీ, లేక రోజు కూలీగా గానీ పనిచేస్తాం. మన ఎంపీలు అటు నెలవారీగానూ పనిచేస్తూ అసలు పనియైన పార్లమెంటుకు హాజరైనందుకు కూడా భత్యం తీసుకుంటారు. దానిని కూడా రూ.2వేల నుంచి రూ.2500కు పెంచారు. పార్లమెంటు సభ్యుడికి ఇచ్చే పెన్షన్ ఏకంగా రూ.6వేలు పెంచారు. ఎంపీ పెన్షన్ రూ. 25 వేల నుంచి రూ.31 వేలకు పెంచారు. 25 ఏండ్లు, 30 ఏండ్లు ఫ్యాక్టరీల్లో పని చేసి పదవీ విరమణ చేసిన ఈపీఎఫ్ పెన్షనదారుకు ఇప్పటికీ ఇస్తున్న పెన్షన్ వెయ్యి రూపాయలు మాత్రమే. ఇలా ఎంపీల జీతభత్యాలు పెంచటానికి కారణం గురించి ప్రభుత్వం మనకొక చట్టాన్ని చూపుతుంది. కానీ ఆ చట్టం చేసేది కూడా ఈ ఎంపీ లేగా.



చట్టం పేరు చెప్పి ప్రతి ఐదేండ్లకు ఒకసారి వీరి జీతాలు వీరే పెంచుకుంటారు. గతంలో 2018, ఏప్రిల్‌లో పెంచారు. ఐదేండ్లు గడిచాయి కనుక ఇప్పుడు ఈ పెరిగిన జీత భత్యాలను 2023 ఏప్రిల్ నుంచి అమలు చేసి, ఈ 24 నెలల ఏరియర్స్ కూడా గుంజుతారు. ప్రజాస్వామ్యమను ఘనసౌధానికి పునాదిరాళ్లు గట్టిగా ఉండాలంటే ఎంపీల జీతాలు పెంచితే చాలని అనుకున్నట్టుంది ప్రభుత్వం.

కేరళలో ఏకేజీ మెమోరియల్ ప్రారంభం

తిరువనంతపురం : సీనియర్ నేత ఏకే గోపాలన్ వర్ధంతిని పురస్కరించుకొని కేరళ స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎంబీ రాజేష్ 'ఏకేజీ మెమోరియల్‌ను ప్రారంభించారు. మయిలదుత్తురై జిల్లాలోని తరంగంబాడిలో సీపీఐ (ఎం) ఏరియా కమిటీ కార్యాలయంలో దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు పి. షణ్ముగం పార్టీ పతాకాన్ని, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.శామ్యూల్ రాజ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసన్ సమావేశ హాలును, ఎమ్మెల్యే వీపీ నాగై మాలి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. పార్టీ 24వ జాతీయ మహాసభల ప్రాధాన్యతను వివరిస్తూ బహిరంగ సభను కూడా నిర్వహించారు.



మంత్రిని పట్టుకుని చిలుకపలుకులంటారా ?

- ఆర్ఆర్ఆర్‌కు హైవే నెంబర్ వచ్చింది
- రోడ్లమీద రూపాయి ఖర్చుపెడితే మూడు రూపాయల ఆదాయమొస్తుంది : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



మంత్రి శ్రీధర్‌బాబును పట్టుకుని సభలో చిలుకపలుకులు పలుకుతు న్నాడని బీఆర్ఎస్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డి అనటాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తప్పుబట్టారు. మంగళవారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన జోక్యం చేసుకుని మాట్లాడారు. ఆర్ఆర్ఆర్‌కు హైవే నెంబర్ 161ఏ వచ్చిందనీ, దానికి హైవే నెంబర్ రాలేదని ప్రశాంత్‌రెడ్డి చెప్పడం అసత్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 6,600 కోట్ల రూపాయలకు టెండర్లకు పిలిచి రోడ్లు వేయలేదని విమర్శించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని పనిని తాము చేసి చూపెడుతున్నామన్నారు. రోడ్ల మీద రూపాయి ఖర్చుపెడితే మూడు రూపాయల ఆదాయం ప్రభు త్వానికి వస్తుందని వివరించారు. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాల రోడ్లనే సుందరంగా తీర్చిదిద్దుకుంటే సరిపోదని దెప్పిపొడిచారు. రాష్ట్రంలోని అన్ని రోడ్లనూ ఆ స్థాయిలో వేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

మద్యం ద్వారా ఆదాయం పెంచింది బీఆర్ఎస్సే

- ట్యాక్సులు పెంచకుండా ఆదాయం పెంచే మార్గాలపైనే మా దృష్టి : మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బెల్టు షాపుల ద్వారా, మద్యం అమ్మకం ద్వారా ఇప్పుడే తాము ఆదాయమార్గాలను అన్వేషిస్తున్నట్టు బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడటం తగదనీ, మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఏటేటా పెంచుకుంటూ పోయినది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. మంగళవారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా మద్యం ద్వారా ఆదాయాన్ని పెంచి ప్రజల బతుకులను ఛిద్రం చేయాలని కాంగ్రెస్ సర్కారు చేస్తున్నదని బీఆర్ఎస్ సభ్య లు ప్రశాంత్‌రెడ్డి మాట్లా డటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

రాష్ట్రం ఆవిర్భవించే నాటికి తెలం గాణలో మద్యం ద్వారా సర్కారు పొందుతున్న ఆదా యం రూ.9 వేల కోట్లు ఉంటే... 2023 డిసెంబర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఆ ఆదాయం 34 వేల కోట్లకు(400 శాతం పెరుగుదల) చేరిందని గుర్తుచేశారు. 25వేల ఆదాయాన్ని పెంచింది వారు కాదా? అని ప్రశ్నించారు. 39 వేల కోట్ల ఆదాయానికి నాలుగు శాతం పెంచి బడ్జెట్‌లో చూపెట్టామని తెలిపారు. బెల్టుషాపులను



ప్రోత్సహించే ప్రసక్తే లేదనీ, వాటిని కట్టడి చేశామని తెలిపారు. తమ ప్రభుత్వం మద్యంపై ఒక్క శాతం పన్ను కూడా పెంచలేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం వచ్చాక మద్యం ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని చెప్పారు. పన్నులు పెంచకుండా, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రాకుండా చూసి, ఫామ్‌హౌజ్‌ల నుంచి ఇల్లీగల్‌గా వెళ్లకుండా అరికట్టి.. బేవరేజీల వద్ద సీసీ కెమెరాలు, పోలీసుల నిఘా పెట్టి మద్యం ద్వారా వచ్చే ఆదాయం పక్కదోవ పట్టకుండా అరికట్టామని తెలిపారు. చెక్‌పోస్టులను బలోపేతం చేశామని వివరించారు.

హానికర కోనో కార్పస్ చెట్లను తొలగించండి

- రాష్ట్ర సర్కార్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మనుషులకు హానికరంగా మారిన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. మంగళవారం శాసనసభలో అటవీశాఖ పద్దు చర్చలో భాగంగా గ్రీనరీ అంశంపై బీఆర్ఎస్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డి మాట్లాడే సమయంలో స్పీకర్ జోక్యం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్వాస, ఇతర అనారోగ్య సమస్యలకు ఆ మొక్క కారణమవుతున్నదని చెప్పారు. ఆ మొక్క ఆక్సిజన్‌ను తీసుకుని కార్బన్‌డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రహదారులకిరువైపులా, నగరాల్లో రోడ్ల మధ్యలో ఈ చెట్లను విపరీతంగా పెంచిన విషయాన్ని ప్రస్తావించారు. ఏపుగా పెరగటం తప్ప ఆ చెట్ల వల్ల దేనికీ ఉపయోగం లేదని చెప్పారు. మనుషుల అనారోగ్యాలకు కారణమవుతున్న ఆ చెట్లను తొలగించాలని రాష్ట్ర సర్కారుకు సూచించారు.

ట్రంప్ బాటలో మోడీ

ఉన్నత విద్య ప్రయివేటీకరణ దిశగా అడుగులు

- రాష్ట్రంలో నిఘా పెంచాలి లోపాలను గుర్తించాలి వాటిని సరిదిద్దాలి
- సమాజ నిర్మాణానికి విద్యే పునాది ఆ పునాది బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలి: సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలో ఉన్నత విద్యను ప్రయివేటీకరించిన ఆ దేశ అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ బాటలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఉన్నత విద్య ప్రయివేటీకరణ దిశగా అడుగులు వేస్తున్నారని సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మంగళవారం శాసనసభలో పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచంలో అత్యంత సంతోషంగా ఉన్న విద్యార్థులు ఫిన్‌లాండ్‌లో ఉన్నారనీ, స్కాండినేవియన్ దేశాల్లో విద్యా వ్యవస్థ బాగుందని చెప్పారు. స్విట్జర్లాండ్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, నెదర్లాండ్ తదితర దేశాల్లో టీచర్లకు ఐఏఎస్ అధికారుల కంటే ఎక్కువ మొత్తంలో వేతనాలు ఇస్తారనీ, వారి నుంచి నేర్చుకునే అంశాలను గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో విద్యకు ఖర్చు చేస్తున్నా అందుకు తగ్గ ఫలితాలు రావడం లేదని కూనంనేని సాంబశివరావు తెలిపారు. విద్యావ్యవస్థ బలోపేతానికి నిఘా పెంచి లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దాలని ఆయన కోరారు. సమాజ నిర్మాణానికి విద్యే పునాది అనీ, ఆ పునాది బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పదేండ్ల కాలంలో ప్రాథమిక, ఉన్నత విద్యారంగంలో విద్యార్థుల సంఖ్య, డ్రాప్ అవుట్స్, పరిణామాలు, వాటి ఫలితాలు, నష్టాలు, కష్టాలు, ఉపయోగాలపై ప్రత్యేకమైన



కమిటీతో సమగ్రంగా విచా రణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా లోపాలు బయటపడి, వాటిని సరిదిద్దితే అనేక సమస్యలు పరిష్కార మౌతాయని అభిప్రాయ పడ్డారు. విద్యా రంగంలో ప్రభుత్వం నిధులను ఖర్చు చేస్తున్నా అందుకు తగ్గ ఫలితాలు మాత్రం రావడం లేదని చెప్పారు.

విద్యా ప్రమాణాల విషయంలో తెలంగాణ రాష్ట్రం 14వ స్థానంలో ఉందనీ, 9,10వ తరగతుల విద్యార్థుల డ్రాప్ అవుట్స్ 2020-21లో దేశంలో 13.9 శాతం ఉండగా, తెలంగాణలో 22.1 శాతంగా ఉన్నదని విచారం వ్యక్తం చేశారు. కేరళలో వంద శాతం అక్షరాస్యత ఉన్నదనీ, తమిళనాడులో ఐఐటీ, ఎఐఎంలలో దేశంలోనే రెండవ స్థానంలో ఉన్నాయని తెలిపారు. సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ సబ్జెక్ట్ విషయంలో మన పదవ తరగతి విద్యార్థులు ఇతర దేశాలలో చదువుతున్న ఐదవ తరగతి విద్యార్థులతో



కూడా సమానంగా ఉండడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్య సంస్థలలో అవసరం మేరకు బోధనా సిబ్బందిని నియమించకుండా, తక్కువ వేతనాలు ఇచ్చేందుకు రకరకాల పేర్లతో ఉపాధ్యాయులను నియమించారని కూనంనేని సాంబశివరావు తెలిపారు. వీరందరిని ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి వేతనాలను పెంచాలని సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా మద్యం బెల్టు షాపులను ఎత్తివేయాలనీ, కుదిరితే మద్య నిషేధం విధిస్తే బాగుంటుందని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. నకిలీ మద్యం, గుండుంబాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్లును ఒక పరిశ్రమగా గుర్తిస్తే, ఆ కల్లుపై ఆధారపడిన కల్లు గీత కార్మిక కుటుంబాలకు మేలు జరుగుతుందనీ, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని సూచించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఎగవేతలు ఎన్ని ఉన్నాయో గుర్తించారా? అని ఆయన ప్రశ్నించారు.

నవతెలంగాణ

మనిషిని నిజమైన మనిషిగా రూపుదిద్దేదే విద్య - స్వామి వివేకానంద

బుధవారం 26 మార్చి 2025

www.navatelangana.com

సంపాదకీయం

అ'న్యాయ'మూర్తి!



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరికి ఏ అన్యాయం జరిగినా కోర్టు మెట్లెక్కుతారు. అది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు. పాలకులు, అధికారులు, పోలీసులు చేయలేనిది కోర్టు చేస్తుందనే నమ్మకం. ఆ నమ్మకమే అపనమ్మకమైతే? అధికారంతో కుమ్మక్కయితే? అవినీతిలో కూరుకుపోతే? ఇలాంటివన్నీ నేడు పౌర సమాజాన్ని వేధిస్తున్న ప్రశ్నలు. ఎందుకంటే, న్యాయంపై నమ్మకం సన్నగిల్లే ఓ అవినీతి బండారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌వర్మ ఇంట్లో బయటపడింది. ఆయన అధికారిక నివాసంలో దొరికిన నోట్లకట్టల మూట అనేక అనుమా నాలకు తావిస్తోంది. దీనిపై విచారించేందుకు సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో అంతర్గత కమిటీ వేసింది. ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ అయితే ఆయన్ను విధులకు దూరంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. కొలీజియం సమావేశమై వర్మను

తమకు అనుకూలమైన తీర్పునిచ్చినందుకు జస్టిస్ రంజన్ గగోయ్‌కి రాజ్యసభ పదవిని కట్టబెట్టగా, జస్టిస్ అబ్దుల్ నజీర్ పదవీ విరమణ కాగానే గవర్నర్ బహుమతిని అందుకున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో స్వతంత్ర హోదాలో పనిచేయాల్సిన న్యాయవ్యవస్థ పారదర్శకత పాటించడం, ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం సాధ్యమేనా? అందుకే 'న్యాయం గెలుస్తుందన్నమాట నిజమేకానీ...గెలిచేదంతా న్యాయం కాదు' అంటారు శ్రీశ్రీ. జస్టిస్ వర్మ ఇంట్లో దొరికిన నోట్ల కట్టలపై సమగ్ర విచారణ చేసి నిజాల్ని వెల్లడించాలి. అధికారంలో ఉన్నవారు న్యాయ విలువల్ని కాపాడాలి. లేదంటే నేడు వర్మ గురించి మాట్లాడుకున్నట్టే, రేపు ఇంకొకరి గురించి కూడా మాట్లాడుకోవాల్సి వస్తుంది.

అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ విధంగా శరవేగంగా జరుగుతున్న పరిణామాలు, టీవీల్లో,మాధ్యమాల్లో వర్మ వ్యవహారంపై నడుస్తున్న చర్చలు ఒకరకంగా న్యాయవ్యవస్థకే పెను కళంకాన్ని తెచ్చిపెట్టాయి.

అసలేం జరిగింది? ఎలా జరిగింది? అన్న అంశాలకంటే న్యాయవ్యవస్థలో ఏం జరుగుతుందన్నది ఆలోచించడం చాలా ముఖ్యం. మార్చి14న ఢిల్లీలోని యశ్వంత్‌వర్మ నివాసంలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించడంతో స్టోర్ రూమ్‌లోని అనేక వస్తువులతో పాటు కోట్ల రూపాయలు కాలిపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ప్రాథమికంగా విచారణ చేపట్టిన ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా మాత్రం జడ్జి ఇంటి ఆవరణలో సగం కాలిన నోట్లు, ఇతర శిథిలాలను తర్వాత రోజు తొలగిస్తున్న దృశ్యా లను ఆధారాలతో సహా ఛీఫ్ జస్టిస్ డి.కె. ఉపాధ్యాయకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. వర్మ నివాసంలో నగదు ఫొటోలు, వీడియోలతో సహా అంతర్గత విచారణ నివేదికను సమాచారం నిమిత్తం ఈనెల ఇరవైరెండున సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ వర్మ మాత్రం డబ్బు దొరికిన విషయం ధృవీకరించడం లేదు. 'అగ్ని ప్రమాద సమయంలో మేము భోపా ల్‌లో ఉన్నామని, డబ్బు సంచులు అక్కడికి ఎలా వచ్చాయో, నేను ఇంతవరకు చూడలేదని' చెప్పారు. అంతేకాదు, దీన్ని కుట్రగా అభివర్ణించారు. తనపై వచ్చిన అభియోగాలపై హుందాగా విచారణ ఎదుర్కోవాల్సిన వ్యక్తి దాన్ని విస్మరిస్తూ మాట్లాడటం విచిత్రం.

దీన్ని సీరియస్‌గా తీసుకున్న భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా విచారణ చేస్తుండగానే అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ సీజేఐకి ఓలేఖ రాసింది.అది న్యాయవ్యవస్థలోనే పెను దుమారాన్ని రేపింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న యశ్వంత్‌ను ఇక్కడకు ఎలా బదిలీ చేస్తారని ఆ లేఖలో ప్రశ్నించింది.ఆ 'చెత్త' మాకొద్దంటూ తీవ్ర పదజాలాన్ని ప్రయోగించింది. బార్ వాదనను పరిశీలిస్తే గనుక వర్మ అక్కడ కూడా ఇలాగే ఉన్నారన్న అనుమానం కలగకమానదు. లెక్కలేని డబ్బు బయటపడిన నేపథ్యంలో వర్మ గతంలో ఇచ్చిన తీర్పులన్నీ మరోసారి విచారించాలనే వాదన కూడా నెటిజన్ల నుంచి వస్తున్నది. ఎంతోమంది దోషులను నిర్దోషులుగా మారిస్తేనే ఈ డబ్బు నజారానా వచ్చిందనే విమర్శలకు దొరికిన నగదు బలాన్ని చేకూరుస్తున్నది. ఈ అంశంపై పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. జడ్జి ఇంట్లో కరెన్సీ కట్టలు దొరికిన అంశంపై చర్చించాలని సీపీఐ(ఎం) ఎంపీ శివదాసన్‌తో సహా ప్రతిపక్షాలు నోటీసులు జారీచేశాయి. పాలక పక్షం ఈ అంశంపై చర్చించకపోగా ఉనికిలో లేని అంశాల్ని ముందుకు తెచ్చి అసలు విషయాన్ని దాటవేసింది.

ప్రజాస్వామ్యంలో పారదర్శకతకు పెద్దపీట వేసే న్యాయవ్యవస్థ ఈ విధంగా దిగజారడం సామాన్యులను సైతం కలవర పరుస్తున్నది. ప్రస్తుత పెట్టుబడిదారి సమాజంలో డబ్బే కేంద్రంగా ఉంది. అది అవినీతిగా మారి ప్రజాస్వామ్య మౌలిక విభాగాలన్నింటినీ విస్తరించింది. దాన్ని తగ్గించే కృషి చేయాల్సిందిపోయి బలోపేతంచేసే పాలన దేశాన్ని నడిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో న్యాయం ఏ విధంగా సామాన్యుడికి అందుతుంది? దశాబ్దకాలంగా ఈ చర్చ జరుగుతూనే ఉంది. తమకు అనుకూలమైన తీర్పునిచ్చినందుకు జస్టిస్ రంజన్ గగోయ్‌కి రాజ్యసభ పదవిని కట్టబెట్టగా, జస్టిస్ అబ్దుల్ నజీర్ పదవీ విరమణ కాగానే గవర్నర్ బహుమతిని అందుకున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో స్వతంత్ర హోదాలో పనిచేయాల్సిన న్యాయవ్యవస్థ పారదర్శకత పాటించడం, ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం సాధ్యమేనా? అందుకే 'న్యాయం గెలుస్తుందన్నమాట నిజమేకానీ...గెలిచేదంతా న్యాయం కాదు' అంటారు శ్రీశ్రీ. జస్టిస్ వర్మ ఇంట్లో దొరికిన నోట్ల కట్టలపై సమగ్ర విచారణ చేసి నిజాల్ని వెల్లడించాలి. అధికారంలో ఉన్నవారు న్యాయ విలువల్ని కాపాడాలి. లేదంటే నేడు వర్మ గురించి మాట్లాడుకున్నట్టే, రేపు ఇంకొకరి గురించి కూడా మాట్లాడుకోవాల్సి వస్తుంది.

ఇజ్రాయిల్‌లో నిరసనలు : ఉక్రెయిన్‌పై ఎటూతేలని చర్చలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఒక పరిణామం ఆందోళన, ఆగ్రహాలకు దారి తీస్తున్నది. మరొక సంక్షోభ తాత్కాలిక పరిష్కారం గురించి సానుకూల సంకేతాలు. ప్రతి రోజూ అనేక అంశాలు ముందుకు వస్తున్నప్పటికీ యావత్ ప్రపంచ దృష్టి కేంద్రీకృతమైన సమస్యలకు పరిమితమవుదాం. బందీల విముక్తి దానికి ప్రతిగా ఖైదీల విడుదలకు సంబంధించి గాజాలోని హమాస్‌తో కుదిరిన శాంతి ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘించింది. మరోమారు గాజాలో మారణకాండను ప్రారంభించింది. దీని మీద ప్రపంచంలో వెల్లడైన నిరసన అంతా ఒక ఎత్తయితే ఏకంగా ఇజ్రాయిల్‌లోనే లక్షలాది మంది ప్రధాని నెతన్యాహు రక్తదాహాన్ని నిరసిస్తూ ప్రదర్శనలు జరపటం గమనించాల్సిన పరిణామం. బందీలను తమ వద్ద ఉంచుకుని వేలాది మంది ప్రాణాలను తీసేందుకు, లక్షలాది భవనాలను నేలమట్టం గావించటాన్ని ఇంకా ఎంతకాలం కొనసాగిస్తారనే ఒత్తిడి పాలస్తీనియన్ల నుంచి వచ్చిన కారణంగానే హమాస్ శాంతి ఒప్పందానికి అంగీకరించింది. దీని అర్థం గాజన్లు హమాస్‌ను వ్యతిరేకిస్తున్నారని కాదు. అలాగే బందీల గురించి పట్టించుకోకుండా అరబ్బుల ఊచకోత, పాలస్తీనా ప్రాంతాలపై దాడులతో సాధించేదేమిటని ఇజ్రాయిల్ పౌరులు కూడా పెద్ద ఎత్తున ఒత్తిడి చేసిన కారణంగానే నెతన్యాహు ఒక అడుగు వెనక్కు వేయాల్సి వచ్చింది. యూదులు మారుమనసు పుచ్చుకొని తమ ప్రభుత్వంపై ఆగ్రహిస్తున్నారని అను కున్నా పొరపాటే. నిజానికి అలాంటి ధోరణే ఉంటే ఏడాదిన్నర కాలంగా మారణకాండను సహించి ఉండేవారే కాదు. అలా అని మొత్తం యూదులందరూ ఉన్మాదులే అనుకున్నా తప్పే.గాజా ప్రాంతాన్ని శాశ్వతంగా ఆక్రమించేందుకు ఇజ్రాయిల్ పథకం వేయనున్నట్లు, దానికి గాను అనేక సాకులు చెబుతున్నదని పరిశీలకులు భావిస్తున్నారు. మార్చి ఒకటవ తేదీన కాల్పుల విరమణ తొలి దశ ముగిసింది. హమాస్ వద్ద ఇంకా 59 మంది బందీలు ఉన్నట్లు చెబుతుండగా వారిలో 35 మంది మరణించి ఉండవచ్చని కూడా అంటున్నారు. ఉక్రెయిన్ సంక్షోభంలో కూడా అటు రష్యాకు ఇటు జెలెన్‌స్కీ, అసలు మొత్తంగా ఐరోపా, అమెరికాకూ అది ముగియటం అవసరమే. అయితే అది ఎలా అన్నదే కీలకం.

గత వారంలో మారణకాండను తిరిగి ప్రారంభించిన ఇజ్రాయిల్ ఈసారి గాజాను శాశ్వతంగా ఆక్రమించుకోవాలని కొందరు బహిరంగంగానే పిలుపునిస్తున్నారు. అమెరికా సంగతి సరేసరి. దాన్ని తాము స్వాధీనం చేసుకొని విహార కేంద్రంగా మారుస్తామని, అక్కడ ఉన్న జనాలను జోర్డాన్, ఈజిప్టు తదితర దేశాలకు తరలించి పునరావాసం కల్పిస్తామని ట్రంప్‌తో సహా అక్కడి దుర్మార్గులు మాట్లాడుతున్నది తెలిసిందే.2023 అక్టోబరు ఏడు నుంచి గాజా మీద దాడులు జరుపుతున్నా, దాన్ని అష్టదిగ్బంధనం కావించినప్పటికీ ఇజ్రాయిల్ మిలిటరీ బందీల జాడ కనుక్కోలేకపోవటమే గాక ఒక్కరంటే ఒక్కరిని కూడా విడుదల చేయించలేకపోయింది. దాని దాడుల్లో కొంతమంది బందీలు మరణించినట్లు హమాస్ గతంలో పేర్కొన్నది. బందీల ప్రాణాలను ఫణంగా పెట్టి పాలస్తీనియన్లను సాధిస్తారా అని ఆలోచించే వారి సంఖ్య టెల్‌అవీవ్‌లో పెరుగుతున్నది. అందుకే గతంలో జరిగిన ప్రదర్శనలతో పోలిస్తే భారీ సంఖ్యలో జనం పెరిగినట్లు వార్తలు వచ్చాయి. ప్రధాని నెతన్యాహు నివాసం వద్దకూడా నిరసన వెల్లడించారు. రాజధాని టెల్‌అవీవ్‌లో లక్ష మంది పాల్గొన్నారు. అంతర్గత గూఢచార సంస్థ అధిపతి, అటార్నీ జనరల్‌ను తొలగించాలనే ఆలోచనకు వ్యతిరేకత కూడా వ్యక్తమైంది. తిరిగి దాడులు కొనసాగిస్తే బతికి ఉన్న బందీలకు ప్రాణహాని కలుగుతుందని, ముందు వారు విడుదల కావాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇజ్రాయిలీ జాతీయ పతాకాలతో పాటు ప్రతిపక్ష పార్టీల జెండాలు, బ్యానర్లు కూడా ప్రదర్శించారు. నియంతృత్వ ఉన్మాదానికి స్వస్తి పలకాలనే పెద్ద బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.

గత వారం రోజులుగా గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ మారణకాండ కొనసాగుతూనే ఉంది. ఒక ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న, ఒక గుడారంలో సేదతీరుతున్న హమాస్ అగ్రనేతలు ఇద్దరు ఈ దాడుల్లో మరణించారు. అల్ జజీరా విలేకరి ఒకరు కూడా మృతుల్లో ఉన్నారు. గాజాతో పాటు పశ్చిమగట్టు ప్రాంతాలపై కూడా ఇజ్రాయిల్ మిలిటరీ దాడులు జరుపుతూ అనేకమందిని అరెస్టు చేస్తున్నది. ఇప్పటి వరకు గాజా



ప్రాంతంలో 50,082 మందిని చంపి వేసినట్టు, 1,13,408 మంది గాయ పడ్డారని, 61,700 మంది కనిపిం చటం లేదని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. పాలస్తీనియన్లకు మద్దతు తెలుపు తున్న ఎమెన్‌పై దాడుల పథకం వివరాలను పొరపాటున ఒక జర్నలిస్టుకు పంపిన మాట నిజమేనని అమెరికా ప్రభుత్వం పేర్కొన్నది. రెండు నెలల కాల్పుల విరమణ తర్వాత మరోసారి ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించిన పూర్వరంగంలో ఈజిప్టు రెండవ దశ కాల్పుల విరమణకు కొత్త ప్రతిపాదన ముందుకు తెచ్చింది. వారానికి ఐదుగురు బందీల చొప్పున హమాస్ విడుదల చేయాలని దానికి అనుగుణంగా దాడుల విరమణ జరగాలని, దీనికి హమాస్, అమెరికా అంగీకరిం చినట్లు ఇజ్రాయిల్ వైపు నుంచి స్పందన లేదని వార్తలు వచ్చాయి. గాజాలో అదనపు ప్రాంతాలను ఆక్రమించాలని రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కాట్జ్ తమ దళాలను ఆదేశించినందున రాజీ ప్రతిపాదనలకు సిద్ధంగా లేదని స్పష్టమవుతున్నది.

రష్యన్లు చేస్తున్న తప్పుడు ప్రచారాలు అమెరికా అధ్యక్ష భవనంలో పని చేస్తున్న కొంత మంది మీద ప్రభావం చూపుతున్నాయని జెలెన్‌స్కీ ఆరోపించాడు. వారు స్వంత గూఢచారుల సమాచారం కంటే పుతిన్ మీదనే ఎక్కువగా విశ్వాసం ఉంచుతున్నట్లు చెప్పాడు. యుద్ధం ముగియాలని ఉక్రేనియన్లు కోరుకోవటం లేదని అందువలన వారిని దారికి తెచ్చేందుకు ఏదో ఒకటి చేయకతప్పదన్న సూచన అమెరికన్లకు వెళ్లిందని అన్నాడు. రష్యాలోని కురుస్కు ప్రాంతంలో ఉన్న తమ సేనలను రష్యా చక్రబంధం చేసిందన్న ట్రంప్ వ్యాఖ్యలు కూడా తప్పుడు సమాచార ప్రభావమే అన్నాడు. పుతిన్‌ను సంతుష్టీకరించేందుకు, జెలెన్‌స్కీని అంకెకు రప్పించేందుకు గానీ అంద చేస్తున్న మిలిటరీ సాయం, గూఢచార సమాచార అందచేత నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్ యంత్రాంగం ఐరోపా నుంచి ఒత్తిడితో తర్వాత వాటిని పునరుద్ధరించింది. విలువైన ఖనిజాల ఒప్పందంపై సంతకాలు చేసేందుకు వాషింగ్టన్ వచ్చిన జెలెన్‌స్కీ ఓవల్ కార్యాలయంలో డోనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌తో గొడవపడి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.

ఉక్రెయిన్ సంక్షోభం గురించి అమెరికా, రష్యా ప్రతినిధి వర్గాల మధ్య సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో సోమవారం నాడు చర్చలు జరిగాయి. వాటి తీరుతెన్నుల గురించి ప్రతినిధులు తమ దేశ నేతలకు వివరించిన తర్వాత ఒక సంయుక్త ప్రకటన వెలువడవచ్చని వార్తలు వచ్చాయి. చర్చలు ప్రయాసకరంగా ఉన్నప్పటికీ నిర్మాణాత్మకంగా ఉన్నట్లు రష్యా అధికార వార్తా సంస్థ రోసియా 24 ఒక సెనెటర్ చెప్పిన అంశాన్ని ఉటంకించింది. సానుకూల ప్రకటన వెలువడవచ్చని అమెరికా అధ్యక్షభవన వర్గాలు పేర్కొన్నాయి. పది గంటల పాటు జరిగిన సంప్రదింపులలో మూడు సార్లు విరామం ఇచ్చారు. చర్చల తర్వాత అమెరికా ప్రతినిధులు ఉక్రెయిన్ అధికారులతో చర్చలు జరిపారు. నల్లసముద్ర ప్రాంతంలో నౌకల సంచారంపై ఒప్పందం గురించి పరిశీలిస్తున్నట్లు వెల్లడైంది. ఒకవైపు చర్చలు సాగుతున్నప్పటికీ రెండు పక్షాలూ దాడులు కొనసాగించాయి. తాము 30 మంది రష్యన్ సైనికులను చంపివేసినట్టు ఉక్రెయిన్ ప్రకటించుకుంది. తాము ట్రంప్ ప్రతిపాదించిన నెల రోజుల కాల్పుల విరమణను అంగీకరించలేదని, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను వాయిదా వేసేందుకు మాత్రమే అంగీకరించినట్లు రష్యా ప్రతినిధులు అంతకు ముందు చెప్పారు.

నల్ల సముద్రంలో నౌకలు స్వేచ్ఛగా తిరిగేందుకు ఒక ఒప్పందం అవసరమని ఉక్రెయిన్, రష్యా కూడా భావిస్తోంది. రేవుల నుంచి ఎగుమతి అయ్యే ధాన్యం,నూనెలు,ఎరువుల తనిఖీ గురించి గతంలో కుదిరిన ఒప్పందం నుంచి రష్యా వైదొలిగింది. దానిలో తమ ఎగుమతుల మీద ఉన్న ఆంక్షల భాగాన్ని అమలు జరపలేదని గతంలో పేర్కొన్నది. తన ఎగుమతులు స్వేచ్ఛగా జరిగేందుకు వీలు కుదిరితే ఇప్పటికైనా రష్యా అంగీకరించవచ్చు. అయితే ఇతర అంశాలపై సైనిక చర్యనాటి నుంచి రష్యా చేస్తున్న డిమాండ్లలో ఇంతవరకు ఎలాంటి మార్పు లేదు. నాటోలో చేరాలన్న ప్రతిపాదనను అధికారికంగా జెలెన్‌స్కీ ఉపసంహరించుకోవాలి,ఉక్రెయిన్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న, స్వతంత్ర దేశాలుగా రష్యా గుర్తించిన నాలుగు ప్రాంతాల నుంచి ఉక్రెయిన్ సేనలను ఉపసంహరించుకోవాలి. సోవియట్ కాలంలో ఉక్రెయిన్ పాలనా పరిధిలోకి వచ్చిన క్రిమియా ద్వీపకల్పాన్ని 2014లో రష్యా తిరిగి తనలో విలీనం చేసుకున్నది. దానితో సహా, రష్యా మద్దతు ఉన్న తిరుగుబాటు ప్రాంతాలన్నింటినీ వెనక్కు అప్పగించాలని ఉక్రెయిన్ కోరుతున్నది. అలాంటి ఆశలు పెట్టుకోవద్దని జెలెన్‌స్కీకి అమెరికా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఒక వేళ ఒప్పందం కుదిరి మిలిటరీ చర్యను ఉపసంహరించుకున్న తర్వాత శాంతి సేనలనో మరొక పేరుతోనో తమను వ్యతిరేకించే దేశాల మిలిటరీని సరిహద్దుల్లో అంగీకరించేది లేదని కూడా రష్యా స్పష్టం చేసింది.

ఒక వైపు చర్చలకు తేదీ, స్థలం నిర్ణయించిన తర్వాత జెలెన్‌స్కీ టైమ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్‌పై ఆరోపణలు చేశాడు. సౌదీలో చర్చల రోజే వాటిని ఆ పత్రిక ప్రచురించింది. రష్యన్లు చేస్తున్న తప్పుడు ప్రచారాలు అమెరికా అధ్యక్ష భవనంలో పని చేస్తున్న కొంత మంది మీద ప్రభావం చూపుతున్నాయని జెలెన్‌స్కీ ఆరోపించాడు. వారు స్వంత గూఢచారుల సమాచారం కంటే పుతిన్ మీదనే ఎక్కువగా విశ్వాసం ఉంచుతున్నట్లు చెప్పాడు. యుద్ధం ముగియాలని ఉక్రేనియన్లు కోరుకోవటం లేదని అందువలన వారిని దారికి తెచ్చేందుకు ఏదో ఒకటి చేయకతప్పదన్న సూచన అమెరికన్లకు వెళ్లిందని అన్నాడు. రష్యాలోని కురుస్కు ప్రాంతంలో ఉన్న తమ సేనలను రష్యా చక్రబంధం చేసిందన్న ట్రంప్ వ్యాఖ్యలు కూడా తప్పుడు సమాచార ప్రభావమే అన్నాడు. పుతిన్‌ను సంతుష్టీకరించేందుకు, జెలెన్‌స్కీని అంకెకు రప్పించేందుకు గానీ అందచేస్తున్న మిలిటరీ సాయం, గూఢచార సమాచార అందచేత నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్ యంత్రాంగం ఐరోపా నుంచి ఒత్తిడితో తర్వాత వాటిని పునరుద్ధరించింది. విలువైన ఖనిజాల ఒప్పందంపై సంతకాలు చేసేందుకు వాషింగ్టన్ వచ్చిన జెలెన్‌స్కీ ఓవల్ కార్యాలయంలో డోనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌తో గొడవపడి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. పాక్షిక ఒప్పందానికి సుముఖత తెలిపిన తర్వాత కూడా రష్యా ప్రతిరోజూ దాడులు చేస్తున్నదని, వాటిని నివారించాలంటే పుతిన్ మీద మరింత వత్తిడి తేవాలని జెలెన్‌స్కీ తన మద్దతుదార్లను కోరుతున్నాడు. గత ఒక్క వారంలోనే నియంత్రిత బాంబుదాడులు 1,580, 1,100డ్రోన్ దాడులు, వివిధ రకాల 15 క్షిపణులతో దాడులు చేసినట్లు చెప్పాడు. వాటిలో 1,02,000 వరకు విదేశీ విడిభాగాలు ఉన్నాయని, దీని అర్థం ఇప్పటి వరకు రష్యా మీద విధించిన ఆంక్షలు ఫలించలేదని తేలింది గనుక ఆంక్షల నిబంధనలలో ఉన్న లోపాలను సవరించి కఠినంగా అమలు జరపాలన్నాడు. అందుకోసం కొత్త నిర్ణయాలు, కొత్తగా ఒత్తిడి అవసరమన్నాడు.

క్రిమియా,డాన్‌బాస్, రష్యా అదుపులో ఉన్న మరో రెండు ప్రాంతాలు ఉక్రెయిన్ సంక్షోభంలో కీలక అంశాలని అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కోఫ్ రియాద్ చర్చలకు రెండు రోజుల ముందు చెప్పాడు. రష్యా పాలనకు మద్దతు ఇచ్చిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం వాటిని రష్యా ప్రాంతాలుగా ప్రపంచ దేశాలు అంగీకరిస్తాయా అన్నది ముఖ్య మన్నాడు. వాటి మీద అంగీకారం కుదిరితే సమస్య పరిష్కారం అవుతుందన్నాడు. ఈ నాలుగు ప్రాంతాల్లో మెజారిటీ జనం రష్యన్ భాష మాట్లాడతారని, రష్యా పాలనకు ఆమోదం తెలిపారన్నాడు. వీటిని ఆమోదిస్తే జెలెన్‌స్కీ రాజకీయంగా బతుకుతాడా అన్నది కూడా కీలకాంశమన్నాడు. వాటిని రష్యన్ ప్రాంతాలుగా గుర్తించేది లేదని జెలెన్‌స్కీ గతంలో స్పష్టం చేశాడు. సౌదీ చర్చల్లో ముందుకు వచ్చిన అంశాలేమిటి? తదుపరి ముందుకు పోవటం ఎలా అన్నది మున్ముందు చూడాల్సి ఉంది. ■

20 26వ సంవత్సరం సమీపిస్తున్న కొద్దీ పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన సమస్య ప్రజల దృష్టిని ఆకర్షిస్తూ వివాదాస్పదంగా మారుతున్నది. నియోజక వర్గాలను స్తంభింపచేసిన గడువు ముగిసే సంవత్సరం ఇదే. 2026 తర్వాత నిర్వహించే తొలి జనాభా లెక్కలతో తదుపరి దఫా పునర్విభజన తప్పక చేపట్టవలసి వుంటుంది. 1976 ఎమర్జెన్సీలో ఆమోదించిన 42వ రాజ్యాంగ సవరణ ఈ విధంగా స్తంభింప చేయాలని తొలుత నిర్ణయించింది. తర్వాత వాజ్‌పేయి హయాంలో ఈ స్తంభనను 2026 వరకూ పొడిగించారు. నియో జకవర్గాల పునర్విభజనలో రెండు అంశాలున్నాయి. 1.ప్రతి పదేళ్లకోసారి జరిగే జనాభా లెక్కల తర్వాత అక్కడ నమోదైన జనాభాను జాతీయ జనాభాతో పోల్చి ఆ నిష్పత్తి ఆధారంగా ప్రతి రాష్ట్రానికి వచ్చే పార్లమెంటరీ సీట్ల సంఖ్య, అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పున: పరిశీలన చేయడం. 2.జనాభా రీత్యా సాపేక్షంగా సమాన స్థాయిలో ఉండేలా పార్లమెంటరీ అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాదేశిక సరిహద్దులను పున:నిర్ణయించడం.

దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరం

1976 రాజ్యాంగ సవరణ, తత్పర్యవ సానంగా వాజ్‌పేయి ప్రభుత్వం 2001లో చేసిన సవరణ కారణంగా 1981, 1991, 2001 దశాబ్దాల జనాభా లెక్కల తర్వాత పునర్విభజన కమిషన్లేవీ ఏర్పాటు కాలేదు. ఈ స్తంభన 2026తో ముగుస్తుంది గనక రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఈ సమస్య ముందుకొచ్చింది. తాజా జనాభా ఆధారంగా పునర్విభజన జరిపితే దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో రాజకీయ ప్రాతినిధ్యం తగ్గి పోతుందనేది ఇక్కడ ప్రాథమికంగా వస్తున్న అభ్యంతరం. రాష్ట్రాల జనాభా పెరుగుదల రేట్లలో హెచ్చు తగ్గులే ఈ వ్యత్యాసానికి కారణమవుతున్నాయి.

న్యాయబద్ధంగా పునర్విభజన ప్రక్రియ



PEOPLE'S DEMOCRACY

కొన్ని రాష్ట్రాలు సమర్థవంతమైన జనాభా నియంత్రణ చర్యలతో పెరుగుదల రేట్లు బాగా తగ్గించగలిగాయి. అదే సమ యంలో కొన్ని రాష్ట్రాల్లో ఇది చెప్పుకోదగినంతగా పెరిగింది. దీని ఫలితమేమంటే జనాభాను అదుపు చేయడంలో జయప్రదమైన రాష్ట్రాలకు శిక్ష విధించబడుతుంది. మరోవంక ఆ పని చేయని వాటికి ఎక్కువ సీట్లను బహూకరించినట్లవుతుంది. పంజాబ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు కూడా కొన్ని సీట్లు కోల్పోతాయని అంచనా వేస్తున్నారు. జనాభా నియంత్రణకు నాయకత్వం వహించిన దక్షిణాది రాష్ట్రాలు పునర్విభజనకు జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవడాన్ని అందుకే వ్యతిరేకిస్తున్నాయి.

పెరుగుదల దామాషా?

మీడియాలో కథనాలు వస్తున్నట్టుగా మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్యను ఇప్పుడున్న 543 నుంచి 848కి పెంచినా జనాభా ప్రాతిపదికన అయితే అయిదు దక్షిణాది రాష్ట్రాలకు 40 సీట్లు మాత్రమే పెరుగుతాయి. అదే మరో వైపున ఉత్తరప్రదేశ్ ఒక్కదానికే 63 సీట్లు, బీహార్‌కు 39 సీట్లు పెరుగుతాయి. ఈ విధంగా సీట్ల పంపిణీలో ఈ అసమానతలనే దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి.తాజా జనాభా లెక్కల ప్రాతిపదికన పునర్విభజన ప్రక్రియ చేపట్టడం పట్ల వ్యక్తమవుతున్న ఈ వ్యతిరేకతకు సమాధా నంగానే కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఏ దక్షిణాది రాష్ట్రానికీ సీట్లు తగ్గబోవనీ పైగా నిష్పత్తి సూత్రంతో పెరుగుతా యనీ పేర్కొన్నారు. అయితే ఈ ప్రకటన కూడా అస్పష్టమైందిగానే వుంది. ఎందుకంటే నిష్పత్తి సూత్రం ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం తీసుకుంటారా లేక ప్రస్తుత సీట్ల నిష్పత్తి ప్రకారమా అనే స్పష్టత లేదు. జనాభా ప్రకారమే అయ్యేట్టయితే అప్పుడు ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లలో నిష్పత్తికి మించి వాటా వస్తుంది.

రెండు ప్రత్యామ్నాయాలు

ప్రస్తుత పరిస్థితిలో అనుసరించదగిన అత్యుత్తమ పద్ధతి ఏమంటే ప్రస్తుతం ఒక్కో రాష్ట్రానికి వున్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా పెంపుదల చేయడం. దీనివల్ల ప్రజలకు ప్రాతినిధ్యం వహించేందుకు మొత్తం సీట్ల సంఖ్య పెంచడంతో పాటు రాష్ట్రాల మధ్యలో ప్రస్తుతం వున్న సీట్ల నిష్పత్తిని కాపాడినట్లవుతుంది. జనాభా పెరుగుదల ప్రకారంగాక ఇప్పుడున్న సీట్ల కేటాయింపు మేరకే ప్రతి రాష్ట్రం అదనంగా సీట్లు పొందుతుంది.ఉదాహరణకు మొత్తం సీట్లు 800కు పెంచితే అప్పుడు తమిళనాడుకు ఉన్న 39 స్థానాలకు మరో 18 తోడై 57కు చేరుతుంది. ఆ విధంగా మొత్తం సీట్ల సంఖ్యలో ఇప్పుడున్న నిష్పత్తి అలాగే వుంటుంది. ఇదే ఫార్ములా ప్రకారం చేస్తే కేరళకు తొమ్మిది సీట్లు ఎక్కువగా పెరిగి 29కి చేరతాయి. ఇప్పుడు 80 స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌కు 38 పెరిగి 118 అయితే 25 సీట్ల పెంపుతో బీహార్‌కు 79 అవుతాయి. ఇవి ఇప్పుడు వాటికి వున్న దామాషా కొనసాగింపే అవుతాయి. కనుక మరింత మెరుగైన ప్రాతినిధ్యం కోసం మొత్తం సీట్ల సంఖ్యను పెంచే సందర్భంలో ఏ రాష్ట్రం కూడా వున్న సీట్లను కోల్పోకుండా చూసినట్లు అవుతుంది. ఏమైనా ఈ పద్ధతిపై ఏకాభిప్రాయం కుదరని పక్షంలో ఉండే ఒకే ఒక ప్రత్యామ్నాయం పునర్వి భజన ప్రక్రియను మరో పాతికేళ్ల వాయిదా వేయడమే. ఈ సమస్య చర్చించేందుకూ ఒక ఉమ్మడి వైఖరికి వచ్చేందుకుగాను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మార్చి 22న దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులూ పంజాబ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ నుంచి ప్రధాన పార్టీలనూ ఆహ్వానించారు. ఈ సంయుక్త సమావేశంలో తీసుకునే వైఖరితో పునర్విభజన సమస్యకు పరిష్కారం వేగం పుంజుకోవాలి.

(మార్చి 19 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ప్రజాస్వామ్యానికి గ్యారెంటీ లేని ప్రభుత్వ పాలన



టి.నాగరాజు
9490098292

ఈ మధ్య ఒక పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థి ఉద్యమాలు, వారి పాత్ర గురించి గొప్పగా మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి సంఘాల్లో పని చేయాలని, రాజకీయాల గురించి ఆలోచించాలని, అప్పుడే మంచి రాజకీయాలు ఉంటాయని ప్రకటించారు. అంతేకాదు, యునివర్సిటీల్లో అన్ని భావాలపై చర్చలు జరగాలని, విద్యార్థుల పరస్పర అవగాహనకు అలాంటి చర్చలు చాలా అవసరమని చెప్పారు. కానీ ఆయన మాటలకు యూనివర్సిటీలో జరిగే చర్యలకు పూర్తి విరుద్ధంగా ఉన్నది. ఎందుకంటే, ఈ నెల 13న ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ పేరుతో ఒక సర్క్యులర్ విడుదలైంది. యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించకూడదని, ఆందోళనల పేరుతో యూనివర్సిటీనిర్వహణకు ఆటంకం కలిగిస్తున్నారని అందులో సారాంశం అనుమతి లేకుండా యూనివర్సిటీలోకి చొరబడటం, వర్సిటీ అధికారులు, సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలివ్వడం, ధర్నాలు, ప్రదర్శనలు, ఆందోళనలు చేయడంలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్న హెచ్చరిక. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని, అ తర్వాతే రిజిస్ట్రార్, ఇతర అధికారుల దగ్గరకు రావాలని సర్క్యులర్‌లో పొందుపర్చారు. ఇది పూర్తిగా అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధం, ఇంకా చెప్పాలంటే నియంతృత్వం కూడా.

ఉస్మానియ విశ్వవిద్యాలయానిది వందేండ్ల చరిత్ర. ఎన్నో ప్రజా, విద్యార్థి ఉద్యమాలకు ఊపిరిపోసింది. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించింది. 1938లో ఏర్పడిన స్టేట్ కాంగ్రెస్ వందేమాతరం గీతాలాపన చేయాలని పిలుపు పాటించింది. విద్యార్థులు గేయాలపన చేస్తే విద్యార్థులను సస్పెండ్ చేస్తే వారికి మద్దతుగా సమ్మె నిర్వహించిన చరిత్ర ఉస్మానియాది. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు ఇక్కడి విద్యార్థుల చైతన్యం ఎలాంటిదో. చరిత్రలో అనేక కీలకమైన పరిణామాలకు ఉస్మానియా విద్యార్థుల స్ఫూర్తి, చైతన్యం, అన్యాయంపై ప్రశ్నించే గళమే కారణం.నిజాం ప్రభుత్వం మొదలు నేటి పాలకుల వరకు అవలంభించిన, అవలంభిస్తున్న ప్రజావ్యతిరేకత విధానాలపై వర్సిటీ విద్యార్థులు నిరంతరం పోరాడుతూనే ఉన్నారు. అలాంటి యూనివర్సిటీలో రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, వర్సిటీ స్వతంత్రతను దెబ్బతీసే విధంగా ఆంక్షలు విధిస్తూ సర్క్యులర్ విడుదల చేయడం శోచనీయం. గత సర్కార్ పాలనలో నిర్బంధం, నియంతృత్వం పెరిగిందని,ప్రజాస్వామ్యం అపహాస్యం అయిం దని గగ్గోలు పెట్టి, తన ఎన్నికల ప్రసంగాల్లో, కార్యక్రమాల్లో ఆరుగ్యారంటీలిచ్చి ఏడో గ్యారంటీ గా ప్రజాస్వామాన్ని పునరుద్ధరి స్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారు? వర్సిటీలో ఆంక్షలు విధించడమేనా ఏడో గ్యారంటీ? ప్రజా పాలనలో విద్యార్థులున్నారా లేదంటే ప్రజా ప్రతినిధులే చెలామణి అవుతున్నారా? స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత సర్కార్‌దే.

ధర్నాలు, ఆందోళనలు, నినాదాలు నిషేదించడం అనేది రాజ్యాంగ వ్యతిరేకం. తమ నిరసన ప్రకటించడానికి ప్రజలు, విద్యార్థులు, ధర్నాలు, ఆందోళనలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు జరుపుకునే హక్కులను రాజ్యాంగం ఆర్టికల్ 19(1) ద్వారా కల్పించింది. కానీ రాజ్యాంగ హక్కుకు భిన్నంగా ఉస్మానియా



యూనివర్సిటీ అధికారులు వ్యవరిస్తున్నారు. 1969 తొలి తెలంగాణ ఉద్యమం,2009లో మలి తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఇలాంటి సర్క్యులర్ విడుదల చేయలేదు. నాడు ముండ్లకంచెలు, గేట్లు బంద్, బారికేడ్లు పెట్టారే తప్ప ఏనాడూ ప్రజాస్వామిక హక్కులను కాలరాసింది లేదు. ఇన్ని ఆంక్షలు పెట్టిన అధికారులు ఈ ప్రభుత్వానికి తెలియకుండా సర్క్యులర్ ఇచ్చిందా? ఇదే విషయమై అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులు అడిగితే కూడా కనీస స్పందనలేదు. రాజ్యాంగ హక్కులు హరించే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజ్యాంగ హక్కులు తెలియవా? తమ అధి నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని మరి రాజ్యాంగం కాపాడాలని అడుగుతుంటే ఇక్కడ మాత్రం హక్కులను అడగొద్దంటూ ఆంక్షలు విధించడం ఎంతవరకు సమంజసం?

సెంట్రల్ యూనివర్సిటీల్లో కనీసం విద్యార్థి సమస్యలు పరిష్కారానికి విద్యార్థి సంఘాలు గుర్తింపు ఎన్నికలు ఉంటాయి. మరి రాష్ట్ర యూనివర్సిటీల్లో ఇలాంటి ఎన్నికలు లేవు. సమస్యలు పరిష్కారం కోసం ఎవరిని అడగాలి, ఎవరు ఆందోళన చేయకుండా ఎవరు స్పందించి పరిష్కారం చేస్తారు? ఇవి ప్రభుత్వానికి, అధికారులకు తెలియదా? ఇప్పుడిప్పుడే ఉన్నత విద్యలోకి అణగారిన వర్గాలు ప్రధానంగా ఎస్సీ, బీసీ,ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు వస్తున్నారు. వీరంతా సమస్యలతోనే సహవాసం చేస్తున్నారు. ఈ విద్యార్థులు అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ఎన్ని నిధులిస్తున్నారు. ఈ వర్గాల విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలేమిటి? నిధులివ్వకుండా, సరైన సౌకర్యాలు కల్పించకుండా, లైబ్రరీ సౌకర్యాలు ఇవ్వకుండా,మెస్ ఆధునికీకరణ చేయకుండా, నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. ప్రయివేటు విద్యాసంస్థల మాదిరిగా రెగ్యూలర్ కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో భారీగా ఫీజులు పెంచి, కోర్సులు ఎత్తివేశారు, అనేక సంవత్సరాల నుండి అధ్యాపకులను నియమించకుండా ,నాన్ టీచింగ్ స్టాఫ్ నియమించకుండా చదువులు నష్టం చేశారు.ఈ చర్యలు ద్వారా కింది వర్గాలకు ఉన్నత విద్య అందకుండా చేసి ఆంక్షలు పేర దూరం చేసే కుట్రలు చేస్తున్నారు.

వర్సిటీలో చదువుకునే పరిస్థితి లేకుండా చేస్తే ప్రశ్నించకుండా, పోరాడకుండా ఎలా ఉంటారు? హాస్టల్‌లో తాగునీరు లేదు, నాణ్యమైన భోజనం లేదు. ఈ విషయమై అనేక సందర్భాల్లో అమ్మాయిలే రాస్తారోకో చేశారు. మరి పరిష్కారం చేశారా? హస్టల్స్‌లో పెచ్చులూడి విద్యా ర్థులు గాయాల పాలైతే ఏ అధికారి పట్టించుకోలేదు. మరి పేద వర్గాల నుండి వచ్చిన విద్యార్థులు సక్రమంగా చదువుకోవాలంటే ఆటంకాలు తొలగాలి కదా? అలాంటప్పుడు సమస్యల గురించి ప్రశ్నించవద్దా? అడగవద్దా? అడిగితే యూనివర్సిటీ నిర్వహణకు ఆటంకం కలిగించి నట్లా? మరి వీటిని అడిగేది విద్యార్థులే కదా! నాటి ప్రతిపక్ష నాయకుడిగా యూనివర్సిటీకి వచ్చిన రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఈ సమస్యలను పరిష్కరించడానికి ఎందుకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులివ్వలేదు? ఎందుకు ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయటం లేదు. ఎందుకు స్కాలర్‌షిప్స్ ఇవ్వటం లేదు?వీటికి సమాధానం చెప్పకుండా సర్క్యులర్‌ను అడ్డుపెట్టుకుని ఆంక్షలు విధించడం భయపెట్టడానికా?లేదంటే విద్యార్థుల గొంతు నొక్కడానికా? ఈ సర్క్యులర్‌ను చూస్తే నిజంగానే విద్యార్థుల గళాన్ని అణిచేసే ప్రయత్నం చేస్తున్నట్టు అర్థమవుతున్నది.

యూనివర్సిటీలో సర్క్యులర్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులతో నిర్బంధాన్ని ప్రయోగించి, బలప్రయోగం ద్వారా అక్రమ అరెస్టులు చేస్తున్నారు. ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారంటే ఈ సర్కార్ అసలు లక్ష్యం ప్రభుత్వ ఉన్నత విద్యను ప్రయివేటుపరం చేయడం. అందుకే ఇలాంటి విధానాలను అవలంభిస్తున్నది.ఉస్మానియానే కాదు ఈమధ్య కాలంలో నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చాలని ప్రతిపాదన పెట్టింది. కార్పొరేట్ శక్తుల నుండి నిధులను తీసుకుని మార్కెట్ అవసరాల కోసం స్కిల్ యూనివర్సిటీ తీసుకొచ్చింది..హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చెందిన భూములను నాలుగు వందల ఎకరాలు కార్పోరేట్ శక్తులకు విక్రయించాలని నిర్ణయాలు చేసింది. ఇవన్నీ చూస్తే విద్యారంగాన్ని ఏం చేయాలనుకుంటున్నది సర్కార్? ఇప్పటికైనా ఉస్మానియా ఇచ్చిన సర్క్యులర్‌ని వెనక్కి తీసుకుని ఇచ్చిన ప్రజాస్వామ్య పునరుదద్ధరణ హామీని నిలబెట్టుకోవాలి.లేదంటే విద్యార్థుల నుంచి ప్రతిఘటన తప్పదు. ■

ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌కు ఆదేశాలివ్వొచ్చా?

ఈ అంశంపై మాత్రమే వాదనలు వింటున్నాం : సుప్రీంకోర్టు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చా? అనే అంశంపై మాత్రమే వాదనలు వింటున్నట్టు సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని, కశ్చన్ ఆఫ్ లా వరకే పరిశీలిస్తున్నట్టు తేల్చి చెప్పింది. ఫిరాయించిన వ్యక్తి లోక్‌సభ, అసెంబ్లీ, జిల్లా పరిషత్‌కు పోటీ చేశారా అనేది తాము పట్టించుకోబోమని... ఆ అంశాన్ని స్పీకర్ చూసుకుంటారని స్పష్టం చేసింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 15న బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్పీ)ను దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై కేటీఆర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిస్‌ల ద్విసభ్య ధర్మాసనం ముందు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు సుదీర్ఘ వాదనలు వినిపించారు. పిటిషనర్లు పాడి కౌశిక్ రెడ్డి, వివేకా నంద్ తరఫు సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం, కేటీఆర్ తరపున సీనియర్ న్యాయవాదులు దామా శేషాద్రినాయుడు, మోహిత్ రావులు, స్పీకర్ కార్యాలయం తరపున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వి, ముకుల్ రోహిత్గీలు హాజరయ్యారు. తొలుత ఆర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ... గతేడాది మార్చి, ఏప్రిల్‌లో పార్టీ ఫిరాయింపులపై తొలిసారి కోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. అనంతరం జూన్‌లో రిట్ పిటిషన్ వేశామన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన దానం నాగేందర్ ఏకంగా కాంగ్రెస్ బీ ఫాం పై ఎంపీ ఎన్నికలకు పోటీ చేసి ఓడారని కోర్టుకు దృష్టికి తెచ్చారు. ఆ తర్వాత కూడా... బీఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారని తెలిపారు. మరో ఎమ్మెల్యే తన కూతురు కోసం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని ప్రచారం చేశారని... తెల్లం వెంకట్ రావు సైతం పార్టీ ఫిరాయించారని ఆర్యమ సుందరం వాదనలు వినిపించారు. ఈ ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్



స్పందించలేదని, కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని అన్నారు. దీనిపై రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా సింగిల్ బెంచ్ ఈ వ్యవహారంపై విచారణ సమయాన్ని ఖరారు చేయాలని నాలుగు వారాలు టైం ఇచ్చిందని గుర్తు చేశారు. దీనిపై స్పీకర్ కార్యాలయం అప్పీల్‌కు వెళ్లగా... స్పీకర్ కు తగినంత సమయం ఇవ్వాలన్న గ్రౌండ్స్‌పై ఈ ఉత్తర్వులను డివిజన్ బెంచ్ పక్కన పెట్టినట్లు వివరించారు. కానీ ఇప్పటి వరకు ఆ తగినంత సమయం అంటే ఎంతో చెప్పలేదన్నారు. స్పీకర్ సమయంపై సుభాష్ దేశాయ్, కేశం మేఘాచంద్, రాజేంద్ర సింగ్ రాణా కేసుల్లో సుప్రీంకోర్టు గైడ్ లైన్ ఇచ్చిందన్నారు. ఈ తీర్పుల ఆధారంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అయితే సుప్రీంకోర్టును ఆశ్రయించిన తర్వాతే... ఈ ఏడాది ఫిబ్రవరి 13న మూడు వారాల్లో రిప్లై ఇవ్వాలని స్పీకర్‌కు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చిందని గుర్తు చేశారు. మూడు వారాలు పూర్తి అయినా... ఆ నోటీసులు ఎటువెళ్లాయో తెలియదని ఆరోపించారు. తాము స్పీకర్‌కు ఫిర్యాదు చేసి దాదాపు ఏడాది పూర్తి అయిందని ... ఇప్పటికీ స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదన్నారు.

ఫిరాయింపుల పై వార్షికోత్సవం అయ్యిందా..? : జస్టిస్ బీఆర్ గవాయి వ్యంగ్యంగా వ్యాఖ్యలు

పిటిషనర్ వాదనలపై జస్టిస్ బీఆర్ గవాయి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏడాది కాలం అంటే... 'పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయ్యిందా' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మరోసారి సుందరం వాదనలు వినిపిస్తూ... స్పీకర్ క్వాషి జ్యూడీషియరీ అధికారాలతో ఉన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్ పై కూడా ఉంది. ఒకవేళ అది జరగడం లేదు అని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టు ను ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించింది. అలాంటి సందర్భంలో.. రాజ్యాంగ పరిరక్షకులుగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చు.

స్పీకర్ క్వాషి జ్యూడీషియరీ అధికారాలతో ఒక ట్రిబ్యునల్ గా స్పీకర్ వ్యవహరించాలి. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లాలని, ఆయన విధుల్లో జోక్యం చేసుకోవాలని కోరడం లేదు. కానీ, రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని మాత్రమే తాము కోరుతున్నామని' నివేదించారు. మరోసారి జస్టిస్ గవాయి జోక్యం చేసుకుని గతంలో ఇలాంటి వ్యవహారాల్లో త్రిసభ్య ధర్మాసనం, ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాలు స్పీకర్ తగిన సమయం ఇస్తున్నట్టు స్పష్టంగా చెప్పలేదన్నారు. అలాంటప్పుడు తాము వాటిని కాదని ఎలా ముందుకు వెళ్లగలమని అభిప్రాయపడ్డారు. 'ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి ఎలా రాయగలం?.' అని ప్రశ్నించారు. అయితే తగినంత సమయం (రీజనబుల్ టైం) అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయని సుందరం వాదనలు కొనసాగించారు. గతంలో రాజేంద్ర సింగ్ రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకొందని, కేవలం నాలుగు వారాల్లోనే నిర్ణయం కూడా జరిగి పోయిందని గుర్తు చేశారు. రాజేంద్ర సింగ్ రాణా కేసులో మూడు నెలలు కాదు.. నాలుగు వారాలే అని స్పష్టం చేయడంతో.. అనర్హత వేటు పడిందని వాదించారు. అలాగే మరో కేసులో... తగిన సమయం అంటే స్పీకర్ మాత్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పిందన్నారు. దాదాపు గంట పాటు వాదనల తర్వాత పాడి కౌశిక్ రెడ్డి రిట్ పిటిషన్ పై ఆర్యామ సుందరం వాదనలు ముగించారు.

వారంలోపే హైకోర్టుకు వెళ్లారు.. : మనుసింఘ్వి

పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలపై స్పీకర్ సెక్రెటరీ తరపు సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మనుసింఘ్వి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫిరాయింపులపై గతేడాది జులై మొదటి వారంలో స్పీకర్ కంప్లైంట్ చేస్తే... 9వ తేది నాటికే కోర్టులో పిటిషన్ వేశారన్నారు. నారిమన్ కేసులో ఫిర్యాదుకు, పిటిషన్‌కు నిర్దిష్ట గడువు ఉండాలని కోర్టు తీర్పునిచ్చిందని చెప్పారు. అయితే ఫిరాయింపులపై ఫిర్యాదు అందగానే స్పీకర్ స్పందించారని, నోటీసులు ఇచ్చారని బెంచ్ దృష్టికి తీసుకెళ్లారు. మధ్యలో జస్టిస్ గవాయి జోక్యం చేసుకొని... గత విచారణ సందర్భంగా స్పీకర్, అసెంబ్లీ సెక్రెటరీ, ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసినట్టు గుర్తు చేశారు. ఇందుకు సింఘ్వి బదులిస్తూ... అసెంబ్లీ సెక్రెటరీ తరపున అఫిడవిట్ దాఖలు చేసినట్టు బెంచ్‌కు నివేదించారు. అనంతరం కేటీఆర్ తరపు సీనియర్ అడ్వొకేట్ దామా శేషాద్రి వాదనలు కొనసాగించారు. రాజేంద్ర సింగ్ రాణా కేసులో స్పీకర్ టైం పై కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం సందర్భంలో రాజ్యాంగంలో పలు కీలక అంశాలను చేర్చినట్టు వివరించారు.

ఈ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను చదివి వినిపించారు. ఎవరైతే పార్టీని ఫిరాయిస్తారో వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కామెంట్ చేశారని గుర్తు చేశారు. స్పీకర్ నిర్ణయం పై తగినంత సమయం అన్న అంశంపై... సుభాష్ దేశాయ్, రాజేంద్ర సింగ్ రాణా కేసుల్లోని ముఖ్యాంశాలను కోర్టుకు నివేదిస్తూ... వాదనలు ముగించారు.

ఇజ్రాయిల్ హత్య, ఎంఎంటీఎస్‌లో లైంగిక దాడికి సీపీఐ(ఎం) ఖండన

- నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ నగరంతోపాటు, రాష్ట్రంలో దారుణాలు, హత్యలు కొనసాగుతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. ఇజ్రాయిల్ హత్య, ఎంఎంటీఎస్‌లో లైంగిక దాడికి యత్నించిన ఘటనలను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నడిబొడ్డున దస్తగిరి అనే కామాంధుడు లైంగిక దాడికి పాల్పడుతున్న నేపథ్యంలో, బాధిత కుటుంబాన్ని కాపాడే ప్రయత్నం చేసిన ఇజ్రాయిల్ అనే న్యాయవాది పట్టపగలే అతి దారుణంగా హత్యకు గురయ్యారని తెలిపారు. అదే విధంగా ఎంఎంటీఎస్ రైలులో ఒంటరిగా ప్రయాణిస్తున్న ఓ యువతిపై మహేష్ అనే మరో కామాంధుడు లైంగిక దాడి యత్నానికి పాల్పడుతుంటే కదిలే రైలు నుంచి దూకి ఆమె మాన, ప్రాణాలను కాపాడుకుని తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలనీ, బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుల దురహంకార హత్యలు రాష్ట్రంలో పెరుగుతున్నాయని వివరించారు. సూర్యాపేటలో కృష్ణ అనే యువకున్ని, ఇబ్రహీంపట్నం సమీప గ్రామంలో కులాంతర వివాహం చేసుకున్న కానిస్టేబుల్‌ను హత్యచేశారని తెలిపారు. వరుసగా ఘటనలు జరుగుతున్నా వాటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. హోంమంత్రిత్వ శాఖ ముఖ్యమంత్రి దగ్గరే ఉన్నప్పటికీ, ఇలాంటి హత్యలు, అరాచకాలు, కామాంధుల దౌర్జన్యాలను అరికట్టడంలో పోలీస్ యంత్రాంగం తీవ్రంగా విఫలమౌతున్నదని తెలిపారు. వాటిని అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల మాన, ప్రాణాలను కాపాడాలని కోరారు.

మతోన్మాద, బుల్డోజర్ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలి

మతోన్మాద, బుల్డోజర్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు, లౌకికవాదులు పోరాడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీల ఇండ్లపై బుల్డోజర్ దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. మణిపూర్‌లాంటి హింసాత్మకమైన దాడులు, మత ఘర్షణలను రెచ్చగొట్టే చర్యలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈనెల 17 నుంచి జరుగుతున్న ఘటనలు అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. బుల్డోజర్లు తీసుకెళ్లి మైనార్టీల ఇండ్లను కూల్చివేశారని తెలిపారు. ఔరంగజేబ్ 300 ఏండ్ల క్రితం ఘటనను ఉపయోగించుకుని దానితో అల్లర్లను రెచ్చగొడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో యోగి ప్రభుత్వం కూడా మైనార్టీల మీదకు బుల్డోజర్లు పంపి వారి ఇండ్లను కూల్చివేసిందని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్‌లో కూడా ఇలాంటి ఘటనలే జరిగాయని తెలిపారు. బుల్డోజర్ పాలన సరికాదనీ, వాటిని అరికట్టాలని సుప్రీం కోర్టు స్పష్టంగా ప్రకటించినప్పటికీ, దీన్ని ధిక్కరించి ఇప్పటికీ ఈ బుల్డోజర్ల పాలననే కొనసాగిస్తున్నారని విమర్శించారు. భారత క్రికెట్‌కు వ్యతిరేకంగా మాట్లాడాడనే ఆరోపణతో, వాస్తవాలు తెలుసుకోకుండానే మైనార్టీ బాలుడి కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. ఇలాంటి ఘటనలు తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మత ఉన్మాద రాజకీయాలకు పాల్పడుతున్నావారికి, బుల్డోజర్ పాలన సాగిస్తున్నవారికి వ్యతిరేకంగా ప్రజలు, లౌకిక శక్తులు సంఘటితమై పోరాడాలని ఆయన కోరారు.

వేడి నీళ్ల బకెట్‌లో పడి బాలుడు మృతి

- తీవ్రగాయాలతో రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స



నవతెలంగాణ - జవహర్ నగర్

ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు వేడి నీళ్ల బకెట్‌లో పడి తీవ్రంగా గాయపడిన బాలుడు మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కటి నర్సింహా- సుమలత దంపతులు ఇద్దరు కుమారులతో కలిసి బాలాజీనగర్‌లో నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం నర్సింహా అత్త పుల్లమ్మ చిన్న కుమారుడు బన్నీ(4)ని తీసుకొని సమీపంలో ఉన్న సోదరుడు సాయి ఇంటికి వెళ్లింది. అక్కడ హీటర్‌తో బకెట్‌లో నీటిని వేడి చేశారు. అక్కడే ఆడుకుంటున్న బన్నీ ప్రమాదవశాత్తు బకెట్‌లో పడిపోయాడు. దాంతో బాలుడి ఛాతి నుంచి కాళ్ల వరకు కాలిపోయింది. వెంటనే సమీపంలోని మీనాక్షి ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి.. ఏఎస్ రావు నగర్‌లోని అంకురా ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం బన్నీ మృతిచెందాడు. తండ్రి నర్సింహా ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త ముందే భార్యపై లైంగికదాడి

- సంగారెడ్డి జిల్లాలో ఘటన

నవతెలంగాణ-కంది

భర్తతో కలిసి ఆటోలో వెళ్తున్న ఓ వివాహితపై ఇద్దరు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన భర్తపై దాడి చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని జాతీయ రహదారి మామిడిపల్లి చౌరస్తా వద్ద మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ఆటోలో పెద్దకంజర్ల గ్రామానికి వెళ్తుండగా.. ఇద్దరు దుండగులు సదరు మహిళపై లైంగిక దాడికి ఒడిగట్టారు. అడ్డుకోబోయిన భర్తపై దాడి చేశారు. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కాగా ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ పరిశీలించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కొత్తకుంటను పరిశీలించిన హైడ్రా కమిషనర్

- మట్టిని తొలగించాలని బిల్డర్స్‌కి ఆదేశం



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధి ఖాజాగూడలోని కొత్తకుంట(నానక్‌రామ్‌కుంట)ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. కొత్తకుంట ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. ఇదే విషయమై ఇటీవల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పరిస్థితిని కమిషనర్ పరిశీలించారు. అక్కడ నిర్మాణాలు చేపడుతున్న వంశీరామ్ బిల్డర్స్‌తో కమిషనర్ మాట్లాడారు. చెరువులో వేసిన మట్టిని మూడు, నాలుగు రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి తెలుసుకునేందుకు జాయింట్ ఇన్స్‌పెక్షన్ చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. చెరువులో పోసిన మట్టిని రెండు, మూడు రోజుల్లో తొలగిస్తామని ఈ సందర్భంగా వంశీరామ్ బిల్డర్స్ కమిషనర్‌కు హామీ ఇచ్చారు.

చెరువుల అభివృద్ధి పనుల పరిశీలన

చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట, బోరబండ సమీపంలోని సున్నం చెరువును సందర్శించారు. ఈ రెండు చెరువుల్లో పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెరువుల చుట్టూ తిరిగి.. సుందరీకరణ, పచ్చదనం పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. హైడ్రా ఈ ఏడాది చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు వచ్చే వర్షాకాలానికి పూర్తి కావాలని, పనుల్లో ఎక్కడ జాప్యం, అలసత్వం లేకుండా చూడాలని అధికారులను రంగనాథ్ ఆదేశించారు.

టెన్త్ ప్రశ్నాపత్రం లీకేజీ నిందితుల అరెస్ట్

- ఆరుగురికి రిమాండ్ , మరో ఆరుగురి పై విచారణ
- పరారీలో ఒకరు : నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడి

నవతెలంగాణ -నకిరేకల్

నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 21న పదోతరగతి పరీక్ష తెలుగు ప్రశ్నాపత్రం లీకేజీకి సంబంధించిన కేసులో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ప్రకటించారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కేసులో మరో ఆరుగురిపై విచారణ జరుగుతోందని, మరొకరు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. తెలుగు పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత వాట్సప్‌లో ప్రశ్నాపత్రం చక్కర్లు కొడుతూ జిల్లా విద్యాశాఖ అధికారికి చేరిందన్నారు. వెంటనే నకిరేకల్ ఎంఈఓకు డీఈఓ ఫోన్ చేసి విచారణ చేయాల్సిందిగా ఆదేశించారని తెలిపారు. గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రం 8వ నెంబర్ గది కిటికీ వద్ద పరీక్ష రాస్తున్న బాలిక ప్రశ్నాపత్రాన్ని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకొని వెళ్లాడని నిర్ధారించుకొని నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎంఈఓ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి 13 మందిని అదుపులోకి తీసుకొని విచారించినట్టు తెలిపారు. ప్రశ్నపత్రం దొరికిన వెంటనే జవాబులు రాసి తెలిసిన వారికి అందించి ఎక్కువ మార్కులు పొందాలనే ఉద్దేశంతో ఏ1 చిట్ల ఆకాష్, ఏ3 బండి శ్రీను, సీసీఎల్1 (బాలుడు) కలిసి పట్టణంలోని గురుకుల పాఠశాలకు స్కూటీపై వచ్చారని వివరించారు. అక్కడ పోలీసులు ఉండటంతో లోపలికి వెళ్లేందుకు వీలుకాక పోవడంతో స్కూలు వెనుక వైపునకు వెళ్లారన్నారు. అక్కడ ఏ11 రాహుల్, సీసీఎల్-2 (బాలుడు)తో కలిశారు. కిటికీ వైపు గది నెంబరు-8లో పరీక్ష రాస్తున్న విద్యార్థిని గమనించారని తెలిపారు. రాహుల్‌కు ఆమె తెలిసిన వ్యక్తి కావడంతో అటువైపు వెళ్లి.. ప్రశ్నాపత్రాన్ని చూపించాలని సీసీఎల్2 సైగ చేయగా ఆమె అందుకు ఒప్పుకోలేదని పేర్కొన్నారు. సీసీఎల్ -1, చిట్ల ఆకాష్ కలిసి రాహుల్ సహాయంతో ప్రహరీ ఎక్కి సీసీఎల్-2 ఉన్న కిటికీ వద్దకు వెళ్లగా ఆమె ప్రశ్నాపత్రాన్ని చూపించిందని అన్నారు. సీసీఎల్-1 తన ఫోనులో తెలుగు ప్రశ్నాపత్రాన్ని ఫొటో తీసుకుని కిందకు దిగారని పేర్కొన్నారు. ఆ ఫొటోలను మిగతా వారు ఒకరి నుంచి ఒకరికి పంపుకున్నట్టు తెలిపారు. ఆ పేపర్‌లో ఉన్న ప్రశ్నలకు ఏ4 గుడుగుంట్ల శంకర్ ద్వారా సమాధానాలు తయారు చేసి.. ఏ5 బ్రహ్మదేవర రవిశంకర్‌కు సంబంధించిన జిరాక్స్ షాప్‌లో జిరాక్స్ తీసుకున్నారని తెలిపారు. అనంతరం వాటిని తమకు తెలిసిన వారికి ఇవ్వడానికి పరీక్షా కేంద్రానికి వెళ్లగా అక్కడ పోలీసులు ఉండటంతో దొరికిపోతామేమోనని తిరిగి వెళ్లిపోయినట్టు పేర్కొన్నారు. పేపర్ వాట్సప్‌లో చక్కర్లు కొట్టడంతో అధికారుల దృష్టికి వెళ్లిందన్నారు.

ఎంఈఓ ఫిర్యాదు మేరకు పోలీసులు 13 మందిని అదుపులోకి తీసుకొని విచారించి.. ఈనెల 23న చిట్ల ఆకాష్, చిట్ల శివ, బండి శ్రీను, గుడుగుంట్ల శంకర్, బ్రహ్మదేవర రవిశంకర్‌ను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారని తెలిపారు. ఒకటో నిందితుడి(బాలుడు)ని జువైనల్ బోర్డు ముందు హాజరు పరిచినట్టు పేర్కొన్నారు. మరో ఆరుగురు పోగుల శ్రీరాములు, తలారి అఖిల్‌కుమార్, ముత్యాల వంశీ, పలాస అనిల్ కుమార్, పళ్ల మనోహర్ ప్రసాద్, రెండో నిందితుడు (బాలుడు)పై విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాహుల్ -ఏ11 పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఇందులో బ్రహ్మదేవర రవిశంకర్, రెండో బాల నిందితుడు మినహాయించి మిగిలిన వారందరూ స్నేహితులేనని తెలిపారు. కేసు విచారణ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

జమిలీపై జేపీసీ గడువు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

తొలిరోజు వరకు ఉండనున్నది. ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ చైర్మెన్ పిపి చౌదరి లోక్‌సభలో కమిటీ పదవీకాలాన్ని పొడిగించే తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా.. వాయిస్ ఓటుతో ఆమోదించారు. రాజ్యసభ నుంచి కొత్త సభ్యుడికి కూడా పార్లమెంటరీ కమిటీలో స్థానం కల్పించినట్టు లోక్‌సభ సెక్రెటరీ జనరల్ సభకు తెలిపారు. వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దాంతో 39 మంది సభ్యుల కమిటీలో ఓ పోస్టు ఖాళీ కావడంతో కొత్తగా సభ్యుడికి చోటు కల్పించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం విదితమే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉందని.. జేపీసీకి బిల్లును పంపాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు.

కమిటీకి బీజేపీ ఎంపీ పిపి చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. ఈ కమిటీ కాల పరిమితి ఏప్రిల్ 4తో ముగియనున్నది. బిల్లుపై ఇంకా చర్చించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో ఇప్పటికే న్యాయ నిపుణులతో కమిటీ చర్చలు జరిపింది. సుప్రీంకోర్టు మాజీ సీజేఐలు జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎపి షా కమిటీ ఎదుట హాజరైన అభిప్రాయాలను తెలిపారు.

జీపీలో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

- తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ధర్నా

వేతనాల నిధులు తక్షణమే విడుదల చేయాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్



నవతెలంగాణ - ముషీరాబాద్

గ్రామ పంచాయతీల్లో కార్మికులకు మల్టీపర్పస్ పని విధానం రద్దుచేసి వేతనాల నిధులు తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వలె గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని కోరారు. మంగళవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌లో భాగంగా ధర్నాచౌక్ వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 60 వేల మంది కార్మికులకు 5-6 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో అనేక ఆందోళన పోరాటాలు చేసిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం 2024 డిసెంబర్ 19న పంచాయతీ కార్మికుల బకాయి వేతనాల చెల్లింపునకు రూ.149 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ మొత్తాన్ని కార్మికుల బకాయి వేతనాలకు మాత్రమే ఖర్చు చేయాలని తెలియజేస్తూ అన్ని పంచాయతీలకు నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. బకాయి చెల్లింపులకు వివిధ పంచాయతీల నిధుల నుంచి కార్యదర్శులు చెక్కులు అందించారని చెప్పారు. అయితే, ఎస్టీవోలలో చెక్కులను జమ చేయగా మూడు నెలలు గడుస్తున్నప్పటికీ నిధులకు మోక్షం కలగడం లేదన్నారు.

ప్రభుత్వం బకాయి వేతనాలకు నిధులు కుడి చేతితో ఇచ్చి ఎడమ చేతితో నోటికాడి ముద్దను లాక్కున్నట్టుగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షులు జి.పాండు మాట్లాడుతూ.. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, స్థలాలు కేటాయించాలని, ప్రతి కార్మికుడికీ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని, పర్మినెంట్ చేయాలని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ.. పాత కేటగిరీని తీసుకొస్తూ జీవో 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైల్ల గణపతి రెడ్డి, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, చాగంటి వెంకటయ్య, మహేష్, అప్పిరెడ్డి, రామచందర్, వెంకట్ గౌడ్, దాశరథ్, శంకర్, మల్లేష్, మాధవి, నరసమ్మ, నరసయ్య, వెంకటేశ్వర్లు, గడ్డం ఈశ్వర్ పాల్గొన్నారు.

విద్యాశాఖలో సంస్కరణలు తెస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఇంటర్మీడియట్‌లోనూ పిల్లలు డ్రాపౌట్ అవుతున్నారని చెప్పారు. 40 శాతం మాత్రమే హాజరు శాతం ఉంటున్నదని గుర్తు చేశారు. గ్రాడ్యుయేషన్‌లో చేరకపోవడంపై అధ్యయనం చేయించాలని కోరారు. హైదరాబాద్‌లో పబ్‌ల సంస్కృతిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త నిబంధనలు రూపొందించి అమలు చేయాలని కోరారు. పబ్‌ల్లో డ్రగ్స్ సైతం సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాతబస్తీ నుంచి అన్నీ వెళ్లిపోతున్నాయని అన్నారు. త్వరలో హైకోర్టు సైతం షిఫ్ట్ చేయనున్నారని అన్నారు. ఆ భవనాన్ని నిజాం నగలు ప్రదర్శించడానికి వినియోగించాలని సూచించారు. 'జూ'ను తరలిస్తామని ప్రభుత్వం చెబుతున్నదన్నారు. లండన్ జూ తో పోలిస్తే మనది ఎందుకు పనికి రాదని చెప్పారు. పాతబస్తీపై వివక్ష చూపరాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యేన్నం శ్రీనివాసరెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బట్టకాల్చి మీదేయడం బీఆర్ఎస్ సభ్యులకు అలవాటైందని విమర్శించారు. ఇంజినీరింగ్ విద్యాసంస్థల ఏర్పాటులో గతంలో ఘోరమైన తప్పిదాలు దొర్లాయని వ్యాఖ్యానించారు. పట్టణాల్లోనే తప్ప గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పిల్లల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. అన్నీ సౌకర్యాలతో స్కూళ్లను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. గత బీఆర్ఎస్ సర్కారు 12 స్కూళ్లను మూసివేసిందన్నారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు. ఆయన పెట్టిన పాఠశాల నుంచి టాపర్స్ బయటకొస్తున్నారని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు : మంత్రి శ్రీధర్ బాబు

- 26 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం:మాజీ మంత్రి హరీశ్ రావు

బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టును భర్తీ చేయలేదని రాష్ట్ర శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. మంగళవారం శాసనసభలో పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా విద్యాశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ హయాంలో తీసుకున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని, విద్య, వైద్యం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. పదేళ్లలో కూపకూలిన వాటిని సరి చేసేందుకు సమయం పడుతున్నదని చెప్పారు. మూసేసిన 79 పాఠశాలలను తిరిగి ప్రారంభించినట్టు వెల్లడించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయని సవాల్ విసిరారు. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినట్టు వివరించారు. కాంగ్రెస్ పాలనలో మూతపడ్డ 1,913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

కానిస్టేబుల్‌పై బీర్ బాటిల్‌తో దాడి

- పారిపోతుండగా ఛేజ్ చేసి పట్టుకున్న కానిస్టేబుల్



నవతెలంగాణ - బంజారాహిల్స్

హైదరాబాద్ బంజారాహిల్స్‌లో కానిస్టేబుల్‌పై ఓ వ్యక్తి బీర్ బాటిల్‌తో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకెళ్తే.. ఖాజా అనే బైక్ రేసర్ టోలిచౌకీ నుంచి అతి వేగంతో బైక్ నడుపుకుంటూ వస్తూ ఒమేగా హాస్పిటల్స్ రోడ్ వద్ద కారును ఢీకొట్టాడు. దాంతో కారు డ్రైవర్, ఖాజా మధ్య గొడవ జరిగింది. అదే సమయంలో ఆ రూట్‌లో డ్యూటీ నిమిత్తం వెళ్తున్న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ శ్రీకాంత్ గమనించి ఇద్దరినీ శాంతింపజేయడానికి ప్రయత్నించారు. కానీ ఖాజా తన తప్పుని ఒప్పుకోకుండా మరింత దూకుడుగా వ్యవహరించాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న బీర్ బాటిల్ తీసుకుని కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరిగెత్తాడు. అయితే, కానిస్టేబుల్ రెండు కిలోమీటర్లపాటు అతన్ని వెంబడించి పట్టుకున్నాడు. కానిస్టేబుల్, కారు డ్రైవర్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించగా, వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. నిందితుడు మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

కానిస్టేబుల్‌ను ఆస్పత్రిలో చేర్పించిన నవతెలంగాణ విలేకరి

నిందితుడి చేతిలో గాయపడి కూడా.. అతన్ని వెంబడించి పట్టుకున్న కానిస్టేబుల్ శ్రీకాంత్‌ను 'నవతెలంగాణ' బంజారాహిల్స్ విలేకరి రఘునాథ్ గుర్తించి వెంటనే సమీపంలోని సిటీ న్యూరో ఆస్పత్రిలోని అత్యవసర చికిత్సలో అడ్మిట్ చేయించారు. అనంతరం ఇన్స్పెక్టర్ రాఘవేంద్రకు విషయాన్ని తెలియజేశారు. దాంతో బంజారాహిల్స్ పోలీసులు విలేకరిని అభినందించారు.



మహిళలను అంగడి వస్తువుగా చూడొద్దు..

- మహిళా సంఘాల నేతల డిమాండ్

నవతెలంగాణ-ముషీరాబాద్

అందాల పోటీలతో మహిళలను అంగడి వస్తువుగా చూడకుండా మహిళలను గౌరవించే విధంగా, స్త్రీ ఔన్నత్యాన్ని చూపించే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు అనసూయ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు విమలక్క అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా కార్యాలయం వీరనారి ఐలమ్మ భవనంలో మంగళవారం ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణ జ్యోతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మీ మాట్లాడుతూ.. అందాల పోటీలనేవి మహిళల శరీరాలను అవమానించడం తప్ప మరొకటి కాదన్నారు. అనసూయ మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అందాల పోటీల మీద ఖర్చు పెట్టే బదులు ప్రజలకు విద్య వైద్య సౌకర్యాలు కల్పించేలా విధానాలు రూపొందించాలన్నారు. విమలక్క మాట్లాడుతూ.. ఒకవైపు అంగన్వాడీలు, ఆశా వర్కర్లు వేతనాల కోసం సమ్మెబాట పడుతుంటే.. మిస్ వరల్డ్ పోటీలతో తెలంగాణ కీర్తి ప్రతిష్టలు ఎలా పెరుగుతాయో ప్రభుత్వాలు చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కేఎన్.ఆశాలత, పీఓడబ్ల్యూ నాయకులు ఝాన్సీ, స్వరూప, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి, చైతన్య మహిళా సంఘం నాయకులు శ్రీదేవి, పీఓడబ్ల్యూ నాయకులు ప్రేమలత, డీఎస్పీ నాయకులు శాంత, ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంస్థ నాయకులు హేమలత, బహుజన మహిళా సంఘం నాయకులు ధనలక్ష్మి, బహుజన రాజ్యాధికార సమితి నాయకులు సునీత, లెక్చరర్ ఇందిర పాల్గొన్నారు.

వరిపొలంలోకి దూసుకెళ్లిన లారీ

- ఇద్దరు కూలీలు మృతి
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన



నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రమాదవశాత్తు వరిపొలంలోకి లారీ దూసుకెళ్లగా ఇద్దరు కూలీలు మృతిచెందిన ఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో మంగళవారం జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్(టి) గ్రామానికి చెందిన మోకిడి పూలమ్మ(51), మోకిడి సంధ్య(30)తోపాటు మరికొంతమంది కూలీలు కలిసి పొలం పనికి వెళ్లారు. ఈ క్రమంలో చిట్యాల మండలం శాంతినగర్ సమీపంలోని పత్తి మిల్లు నుంచి పత్తి గింజల లోడ్‌తో టేకుమట్ల వైపు వస్తున్న లారీ.. గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద ఉన్న వరి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో వరిపొలంలో పనులు చేస్తున్న పూలమ్మ, సంధ్యపై లోడ్ లారీ పడటంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న చిట్యాల ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని జేసీబీల సాయంతో లారీని బయటకు తీసి, స్థానికుల సాయంతో మృతదేహాలను వెలికి తీసి చిట్యాల సీహెచ్‌సీకి తరలించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ఏప్రిల్ రెండోవారంలో ఫలితాలు!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈనెల 20వ తేదీన ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు ముగిసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఈనెల ఐదో తేదీన ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2, జాగ్రఫీ పేపర్-2 పరీక్షను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 295 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. వారిలో 294 (99.66 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వివరించారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జరిగాయని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈనెల పదో తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ రాష్ట్రంలో 19 కేంద్రాల్లో ప్రారంభమైంది. ఈనెల 29 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. వచ్చేనెల రెండోవారంలో ఇంటర్ ఫలితాలను విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది.

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఎస్బీఐ విరాళం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) విరాళాన్ని అందజేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌హెచ్ఓ కోఠి ఉద్యోగులు విరాళంగా అందించిన రూ. 37,16,500 చెక్కును జీఎం రాజేష్ కుమార్ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఎస్బీఐ ఉద్యోగులను అభినందించారు. పదేళ్లుగా సహాయం చేస్తూ అంకితభావాన్ని చూపిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్ మరియు ఎస్బీఐ డీజీఓ అండ్ సీడీఓ జితేంద్ర కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బకెట్లో పడి 13 రోజుల శిశువు మృతి

- రాజేంద్రనగర్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-రాజేంద్రనగర్

అనుమానాస్పద స్థితిలో 13 రోజుల పసికందు బకెట్లో పడి మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజవకర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ ప్రాంతానికి చెందిన మణి స్థానికంగా ఒక ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతనికి భార్య ఆరోగ్య, ఒక కుమారుడు, 13 రోజుల పసికందు ఉంది. రోజు మాదిరిగానే మణి స్థానికంగా ఉన్న కంపెనీలో పని చేయడానికి వెళ్లాడు. అయితే వెళ్లిన కొద్దిసేపటికి భార్యా అతనికి ఫోన్ చేసి పసికందు బకెట్‌లో పడిందని చెప్పింది. వెంటనే ఇంటికి చేరుకుని పసికందును తీసుకుని సమీప ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు శిశువు మృతిచెందిందని నిర్ధారించారు. వెంటనే అతను మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పసికందు మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూతబడిన స్కూళ్లు తెరిచేదెప్పుడు?

విద్యాశాఖకు తగ్గిన కేటాయింపులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్ లో గతేడాది 7.77 శాతం నిధులు కేటాయిస్తే, ఈ ఏడాది 7.51 శాతానికి తగ్గించారని విద్యాశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం శాసనసభలో పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సర్కారు పెట్టకపోగా నిధులను తగ్గిస్తున్నదని తెలిపారు. ఈ నిధులతో విప్లవాత్మక మార్పులు ఎలా తెస్తారని ప్రశ్నించారు. పాఠశాల విద్యకు కేటాయించిన నిధులు జీతభత్యాలకే సరిపోతాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో సమగ్ర శిక్ష అభియాన్‌కు కేంద్రం మూడో విడత నిధులను వినియోగించుకోలేకపోయామని తెలిపారు. పీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ హయాంలో 6,000 పాఠశాలలు మూతపడ్డాయని ఆరోపించారని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ హయాంలో 1,913 పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు మూతపడ్డ అన్ని పాఠశాలలను తెరిపించారా? అని ప్రశ్నించారు. మరో 4 వేల స్కూళ్లను సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. 257 గ్రామ పంచాయతీల్లో స్కూళ్లు లేవని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 3,60,000 మంది విద్యార్థులు తగ్గారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని, బీఆర్ఎస్ ప్రభావం ఇంకా కొనసాగుతున్నదనీ, ఆ ప్రభావంతోనే పిల్లలు బయటికి వెళ్లిపోతున్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచేందుకు ఒక్కొక్కటిగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

సబితా ఇంద్రారెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, బీఆర్ఎస్ హయాంలో మన ఊరు-మన బడి కోసం రూ.3,000 కోట్లతో 9,000 స్కూళ్లను డిజిటల్ క్లాసెస్ ప్రారంభించినట్టు తెలిపారు. ఒక్కో స్కూలుకు రూ.5 లక్షల కేటాయించామనీ, ఎక్కువ మంది విద్యార్థులున్న స్కూళ్లను తొలి దశలో ఎంపిక చేసినట్టు వివరించారు. వాటికి సంబంధించి క్షేత్రస్థాయిలో రూ.30 లక్షలలోపు పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించాలని కోరారు. మిడ్డే మీల్స్ వర్కర్లకు వేతనాన్ని రూ.1,000 నుంచి రూ.3,000కు పెంచినట్టు తెలిపారు. వారి వేతనాన్ని రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాస్టళ్ల విద్యార్థులకు సన్నబియ్యం ఇచ్చినట్టు వెల్లడించారు. బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకుని, కేజీ టు పీజీ ఉచిత విద్య సలహా నాడు పరిశ్రమల శాఖ మంత్రిగా తాను ఇస్తే నాటి పాలకులు పాటించలేదని తెలిపారు. ఇందుకు సబితా ఇంద్రారెడ్డి, ప్రస్తుత పాలకులకు చెప్పి అమలు చేయించాలని సూచించారు.

సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో తెలంగాణలో విద్యా హక్కు చట్టం ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారని గుర్తుచేస్తూ, ప్రస్తుతం ఆయన ఉన్నందున అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కొడంగల్ కే కాదు... రాష్ట్రానికి ముఖ్యమంత్రి

సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్‌లో విద్యా వాలంటీర్లను నియమించారనీ, రాష్ట్రమంతటా నియమించాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. కొడంగల్ పాలిటెక్నిక్‌ను మాత్రమే అప్‌గ్రేడ్ చేశారని చెప్పారు. సీఎం కొడంగల్‌కు మాత్రమే సీఎం కాదనీ, రాష్ట్రానికి సీఎం అని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ మనవడు ముక్కు మూసుకోలేదా?:సీతక్క



హాస్టళ్లలో నాడు పరిస్థితులు ఎలా ఉండేవో తెలుసని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. సాక్షాత్తు మాజీ సీఎం కేసీఆర్ మనవడు హాస్టళ్లలో టాయిలెట్ల పరిస్థితి చూసి ముక్కు మూసుకున్నారని గుర్తుచేశారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి 3 రోజుల ముందు బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని కొన్ని స్కూళ్లలో ప్రారంభించారంటే విద్య, విద్యార్థుల పట్ల బీఆర్ఎస్ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

విద్యకు ప్రాధాన్యమిస్తే 3,60,000 మంది విద్యార్థుల నమోదు ఎందుకు తగ్గింది?

గురుకులాలకు తగ్గిన 40 వేల దరఖాస్తులు : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

అంతా బాగుంటే 40 వేల దరఖాస్తులు ఎలా తగ్గాయి?

గురుకులాల వైపు చూసేందుకు ప్రజలు భయపడుతున్నారని సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్టు అంతా బాగుంటే 51 వేల సీట్లున్న ఐదో తరగతిలో ప్రవేశాల కోసం గతేడాది 1.20 లక్షల దరఖాస్తులు వస్తే, ఈ ఏడాది 80 వేలు మాత్రమే వచ్చాయనీ, 40 వేల దరఖాస్తులు ఎలా తగ్గాయని ప్రశ్నించారు. ఎస్సీ గురుకులాల్లో ఐదు డిగ్రీ కాలేజీలను మూసేశారనీ, 238 జూనియర్ కాలేజీలను వేరే దగ్గర విలీనం చేసేందుకు ఆలోచిస్తున్నారని ఆరోపించారు. సీఓఇ గురుకులాల నుంచి ఎంబీబీఎస్ సీటు పొందిన వారికిచ్చే రూ.50 వేల ప్రోత్సాహకం, ఇంజనీరింగ్‌కు ఎంపికైన వారికిచ్చే ల్యాప్ టాప్ లను ఆపేశారని తెలిపారు. గురుకులాల్లో పరిస్థితులపై ఏసీబీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో చేయించిన తనిఖీల రిపోర్టును బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్న కామన్ రిక్రూట్ మెంట్ బోర్డు ఫైలును ఎందుకు క్లియర్ చేయించడం లేదని ప్రశ్నించారు. యూనివర్సిటీల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను తీసేసి గవర్నర్లకు అప్పగించేందుకు యుజీసీ ప్రయత్నిస్తున్నదనీ, దాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

పోరాటమే మార్గం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలు కార్మికులు, రైతులు, కూలీలను మరిచిపోతున్నాయి. ఈ నెలంతా రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వే చేసి వాటి పరిష్కారానికి నిరసనలు, ధర్నాలు నిర్వహిద్దాం.. ఐక్యంగా పోరాడితేనే విజయం సాధిస్తాం' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పెద్దపల్లి జిల్లా రామగుండంలో మంగళవారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. తొలిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా సీపీఐ(ఎం) పెద్దపల్లి కమిటీ, శ్రేణులు ఆయనకు రామగుండం ఎన్టీపీసీ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. పెద్దఎత్తున బైక్‌ర్యాలీతో ధర్నా స్థలికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మార్గమధ్యలో ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు, రాజేష్ థియేటర్ వద్ద ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి జాన్‌వెస్లీ పూలమాలలు వేశారు. అనంతరం మహాధర్నా సభలో ప్రసంగించారు. కూలీలు, కార్మికులు తమ ఆదాయంతో ఇల్లు కట్టుకోవడం, కిరాయిలు చెల్లించడం, పిల్లల చదువు, వైద్యం వంటి కనీస అవసరాలు తీర్చుకోవడం అసాధ్యమవుతోందని జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, బిల్డింగ్, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ తదితర అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. "రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు ఇండ్ల స్థలాలు లేవు. ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున పోరాటం తప్పదు' అని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రూ.54 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా, కేవలం 2.5 లక్షల కోట్లే కూలీలు, రైతుల కోసం కేటాయించిందని విమర్శించారు. సాగు రంగంలో కూడా కార్పొరేట్ శక్తులు వచ్చేలా ప్రభుత్వాల విధానాలుంటున్నాయని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కార్పొరేట్ల కోసమే పని చేస్తున్నాయని విమర్శించారు.

రాష్ట్రంలో పెరుగుతున్న నేరాలు

ఇటీవల రాష్ట్రంలో హత్యలు, లైంగికదాడులు ఆందోళన కలిగిస్తున్నాయని వెస్లీ అన్నారు. నేరాలను అదుపులో ఉంచే రాష్ట్ర హోంశాఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన దగ్గరే ఉంచుకుని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో అడ్వకేట్ హత్య, ఎంఎంటీఎస్ రైల్లో యువతిపై లైంగికదాడి యత్నం, నడిరోడ్డుపై నరుకుతూ సాగుతున్న కులదురంహకార హత్యలు.. గాడి తప్పిన పోలీసుశాఖ తీరుకు అద్దం పడుతున్నాయని చెప్పారు. వెంటనే హోంశాఖ మంత్రిని నియమించి రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు.

రామగుండం భూపోరాటం స్ఫూర్తిదాయకం

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రెండేండ్ల కిందట నాలుగు భూపోరాట కేంద్రాలు ఏర్పాటు చేసి సమారు ఆరు వందల మంది గుడిసెలు వేసుకుని ఉన్నారని వెస్లీ తెలిపారు. వారికి ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే సానుకూలంగా ఉన్నారని, ఈ అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆయనపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

ఈ సందర్భంగా సింగరేణి పర్మినెంట్ ఇండ్ల స్థలాల పోరాట నాయకులు, మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు, భూ పోరాట కేంద్రాల ప్రతినిధులు, న్యాయవాద సంఘం సభ్యులు తమ సమస్యల పరిష్కారానికి అండగా నిలిచి ప్రభుత్వంపై పోరాడాలని జాన్‌వెస్లీకి వినతిపత్రాలు అందించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌కి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎ.మహేశ్వరి వ్యవహరించగా, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, సీనియర్ నాయకులు భిక్షమయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, ఎ.ముత్యంరావు, ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆశావర్కర్ల అరెస్టులను నిరసిస్తూ నిరసనలు

సమస్యలు పరిష్కరించేంతవరకూ పోరాడుతామంటున్న ఆశాలు

రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, దిష్టిబొమ్మల దహనం

నవతెలంగాణ-విలేకరులు

ఆశా వర్కర్లపై పోలీసులు దాడిచేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టారు. ఆశా వర్కర్ల పైన ప్రభుత్వం నిర్బంధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఖమ్మం జడ్పీ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏన్కూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు, అశ్వారావుపేట, దుమ్ముగూడెం, దమ్మపేట మండల కేంద్రాల్లో నిరసన తెలిపారు. అశ్వారావుపేటలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులను పోలీసులు అరెస్టు చేసి విడుదల చేశారు. వికారాబాద్ జిల్లా పూడూర్ మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులో భారీ ర్యాలీ తీశారు. కందుకూరులో రాస్తారోకో నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్‌లో రాస్తారోకో నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వైఎస్ఆర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. నారాయణపేటలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సంగారెడ్డిలో బస్టాండ్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. సిద్దిపేటలో, మెదక్ జిల్లా శివ్వంపేటలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నిర్మల్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలోని ఉత్కూరు చౌరస్తాలో ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆశాలు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేశారు. మేడ్చల్ పట్టణంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్లు మానవహారంగా ఏర్పడి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శంకరపట్నంలో కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. తిమ్మాపూర్ మండలంలోని రాజీవ్ రహదారిపై నిరసన తెలిపారు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద ఆశావర్కర్లు మానవహారం చేపట్టి నిరసన తెలిపారు.

మనస్సాక్షిని కలిచివేసింది

యూపీ ప్రభుత్వ అక్రమ కూల్చివేతలపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

సహజ న్యాయ సూత్రాలను గౌరవించాలని హితవు



న్యూఢిల్లీ : 2021లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో నోటీసు ఇచ్చిన ఒక రోజు వ్యవధిలోనే ఓ న్యాయవాది, ఓ ప్రొఫెసర్, మరో ముగ్గురి నివాస గృహాలను రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేయడంపై సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'నోటీసు ఇచ్చిన 24 గంటల లోపే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన చర్య న్యాయస్థానం మనస్సాక్షిని కలచివేసింది' అని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భూయాన్‌తో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. కేసులో తీర్పు వెలువరించిన తర్వాత కూల్చివేసిన ఇళ్లను పునర్నిర్మించాల్సిందిగా అధికారులను ఆదేశిస్తామని తెలిపింది. 'ఇలాంటి చర్యలను సహించబోమని మీకు చెబుతున్నాం' అంటూ తీవ్రంగా స్పందించింది. సహజ న్యాయ సూత్రాల పట్ల ప్రభుత్వానికి కనీస గౌరవం ఉండాలని హితవు పలికింది.

న్యాయవాది జుల్ఫికర్ హైదర్, ప్రొఫెసర్ అలీ అహ్మద్, ఇద్దరు వితంతువులు, మరో వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తమ నివాస గృహాలను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను గతంలో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీంతో వారు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమ భూమిని రాష్ట్ర ప్రభుత్వం గ్యాంగ్‌స్టర్-రాజకీయ నేత అయిన అతిక్ అహ్మద్‌తో ముడిపెట్టడం సరికాదని వారు వాదించారు. అహ్మద్ 2023 ఏప్రిల్‌లో హత్యకు గురయ్యారు. 2021 మార్చిలో ఒక రోజు బాగా పొద్దుపోయిన తర్వాత అధికారులు తమకు కూల్చివేత నోటీసులు ఇచ్చారని, వీటిని న్యాయస్థానంలో సవాలు చేసేందుకు ఏ మాత్రం సమయం ఇవ్వకుండా ఆ మరునాడే కూల్చేశారని పిటిషనర్లు తెలియజేశారు. భూమిని లీజుకు తీసుకున్నామని, దానిపై యాజమాన్య హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నామని వివరించారు. అయితే పిటిషనర్లకు చట్టపరంగా ఎలాంటి హక్కులు లేవని, వారు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వాదించింది.

కూల్చివేతలకు సంబంధించి పిటిషనర్లకు చాలా ముందుగానే మూడుసార్లు నోటీసులు అందజేశామని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కోర్టుకు తెలియజేశారు. పిటిషనర్లు ఇళ్లు కోల్పోలేదని, వారు అక్కడ నివసించడం లేదని తెలిపారు. అయితే నోటీసులను పిటిషనర్లకు స్వయంగా అందజేయలేదని, వారి ఆస్తుల మీద అతికించారని, కేవలం తుది నోటీసును మాత్రమే పోస్టులో పంపారని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. 'మీరు అనుకున్నప్పుడే పోస్టులో పంపుతారు. ఇది ఒక ఎత్తుగడ' అని వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు సుప్రీం బెంచ్ సూచించింది. చట్ట ప్రకారం ముందుకు సాగాల్సి ఉంటుందని గుర్తు చేసింది. ఈ నెల ఐదవ తేదీన విచారణ జరిపిన సందర్భంలో కూడా యూపీ ప్రభుత్వాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది. ఇలాంటి చర్యలు దిగ్భ్రాంతి కలిగిస్తాయని, తప్పుడు సంకేతాలు పంపుతాయని చెప్పింది.

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం

వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలపై ప్రత్యేక దృష్టి

హైడ్రా - జీహెచ్ఎంసీ కమిషనర్ల సమావేశం

కమిటీలు వేసి ఇబ్బందులు అధిగమించేందుకు చర్యలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై హైడ్రా, జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టాయి. విపత్తుల సమయంలో సంభవించే సంఘటనలతోపాటు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరు విభాగాలు సమీక్షించాయి. వరద ముప్పుతోపాటు, అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి మంగళవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ డిపార్టుమెంట్‌తోపాటు..హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వరద ముప్పు నివారణతోపాటు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడటానికి ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులతో ప్రాంతాలవారీగా కమిటీలు వేయాలని నిర్ణయించారు. ఈ రెండు కమిటీలు ఎప్పటికప్పుడూ సమావేశమై, సమస్యలు ఉత్పన్నం కాకుండా సమన్వయంతో చూడాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు ఏ ప్రాంతంలో ఎక్కువ జరుగుతున్నాయి, ఎందుకు జరుగుతున్నాయనే విషయాన్ని తెలుసుకోవడమే కాకుండా, ఆయా ప్రాంతాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని భావించారు. ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న ప్రాంతం నుంచే తనిఖీలు ప్రారంభించి, వారిని అప్రమత్తం చేయాలని ఓ నిర్ణయానికొచ్చారు. నిబంధనలు ఏం చెబుతున్నాయి.. వాటిని నివాసితులు, వాణిజ్యసముదాయాల యజమానులు పాటిస్తున్నారా అనేది తరచూ తనిఖీలు చేయాలని భావించారు. నగరంలో వరద ముప్పు ఉన్న 141 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించిన అధికారులు, అక్కడ పరిస్థితి ఎలా ఉంది, వరద నివారణకు తీసుకున్న చర్యలపై ఇరువురు కమిషనర్లు సమీక్షించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, కల్వర్టులు, నాలాలు, క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో వరద నీరు సాఫీగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. క్యాచ్‌మెంట్ ప్రాంతాలను గుర్తించి, వరద నీరు దగ్గర్లో చెరువుకు చేరేలా చూడాలని సూచించారు. జోనల్ స్థాయి కమిటీలు అక్కడి సమస్యకు సమాధానం చెప్పేలా ఉండాలని భావించారు. సమస్యపై పూర్తి అవగాహన ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడికక్కడా జవాబుదారీ వ్యవస్థను రూపొందించినప్పుడే వరద ముప్పుతోపాటు అగ్ని ప్రమాదాలను నివారించగలమని వారు నిర్ణయానికొచ్చారు.

త్వరలో ఫుడ్ సేఫ్టీలో అదనపు సిబ్బంది నియామకం

డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫుడ్ సేఫ్టీ విభాగంలో త్వరలో అదనపు సిబ్బందిని నియమించనున్నట్టు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ తెలిపారు. మంగళవారం ఆమె ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అదనంగా మినీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆహార తయారీదారులందరూ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు కలిగి ఉండేలా అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. జీహెచ్ఎంసీ, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో సీనియర్ అధికారులను ఫుడ్ సేఫ్టీ నియంత్రణ పై పర్యవేక్షకులుగా నియమించనున్నట్టు వెల్లడించారు. ఈ సమీక్షలో రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్. వి. కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి మార్గదర్శకాలు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజీవ్ యువ వికాసానికి మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ మేరకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. జనాభా ప్రాతపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలకు టార్గెట్లను ఆయన జిల్లా కలెక్టర్లు, జిల్లా సంక్షేమ కార్పొరేషన్ల ఎండీలకు ఇవ్వనున్నారు. యూనిట్ కాస్ట్ వారీగా సబ్సిటీ శాతం, బ్యాంకు లోన్ల శాతాన్ని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరానికి రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు తదితర డాక్యుమెంట్ల దరఖాస్తు చేసుకునేందుకు అవసరముంటాయి. నిర్దేశించిన సమయంలోపు ప్రజలు ఓబీఎంఎంఎస్ పోర్టల్ లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మండల స్థాయిలో ఐదుగురితో, జిల్లా స్థాయిలో 10 మందితో స్క్రీనింగ్ కమిటీలను నిర్ణయించారు. ఏప్రిల్ 5లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏప్రిల్ 6 నుంచి మే 20 వరకు మండల స్థాయిలో అర్హులను గుర్తిస్తారు. మే 21 నుంచి 31 వరకు జిల్లా స్థాయిలో గుర్తించి మంజూరునిస్తారు. జూన్ 2 నుంచి 9 వరకు మంజూరైన వాటిని రాష్ట్ర వ్యాప్తంగా జారీ చేస్తారు.

దుర్గా భవాని కాలనీలో వేలాడుతున్న విద్యుత్ తీగలు



నవతెలంగాణ-చంపాపేట్

దుర్గా భవాని నగర్ కాలనీ చౌరస్తా వద్ద ఒరిగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలు.. కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా వేసవిలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతోష్ నగర్, సైదాబాద్, చంపాపేట్ డివిజన్ దుర్గా భవాని నగర్ కాలనీ మా కమ్యూనికేషన్ చౌరస్తా రోడ్ నెంబర్ 7 వద్ద రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, తదితర ప్రాంతాల్లోనూ ఈ సమస్య కొనసాగుతోందని పలువురు వాపోతున్నారు. పగలు వెలుగుతున్న వీధిదీపాల వల్ల విద్యుత్ వృథా అవుతుందని ప్రజలు అంటున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా.. ఫలితం లేదని అయా ప్రాంత వాసులు అంటున్నారు.

'ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సర్వే'



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలో దళిత వాడలో ప్రజా సమస్యలపై బాలాపూర్ మండల సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి వి.శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళిత వాడలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలను పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటం లేదని మండి పడ్డారు. దళితుల సమస్యలను పరిష్కారం చేయడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నా లక్ష్యం మహిళల పక్షం



- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

నా లక్ష్యం మహిళల పక్షం అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అష్టలక్ష్మీ మహిళా మండలి రజతోత్సవాలను ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మహిళల పట్ల సహజంగానే నేను పక్షపాతం చూపుతానని పేర్కొన్నారు. అష్టలక్ష్మీ మహిళా మండలి ఏర్పాటు అయి రజతోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో యాదృచ్ఛికంగా తన రాజకీయ జీవితం ప్రారంభం అయి కూడా రజతోత్సవం పూర్తి అయిందన్నారు. ఇరవై ఐదు సంవత్సరాల కిందటే మహిళా సంఘం ఏర్పాటు చేసిన అష్టలక్ష్మీ మహిళా మండలి సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పాతికేళ్ల కిందట మహిళలు ముందుకు వచ్చి సంఘాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా విజయవంతంగా నడపడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేస్తున్నారని, ఇది ఒక మంచి పరిణామం అని అభిప్రాయపడ్డారు. అష్టలక్ష్మీ మహిళా మండలి ముందుకు సాగడానికి వాసవి కాలనీ పెద్దలు చంద్రశేఖర్ గుప్త తోడ్పాటు ఎంతో ఉందని గుర్తు చేశారు. ఇదే వేదికగా పాల్గొన్న తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాత గ్రామం తన అమ్మమ్మ ఊరు తాండూరు అని సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేశారు.

పార్టీలు వేరైనా ప్రధాన రాజకీయ పార్టీల్లో రాణించడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదన్నారు. తనతో పాటు కాంగ్రెస్ నుంచి కల్వ సుజాత, కార్పొరేటర్‌గా రాధా ధీరజ్ రెడ్డిలు మహిళలు అంటే గృహిణులు కాదని రాజకీయ రంగంలో కూడా ఉనికిని చాటుకుంటున్నామని ఆమె వివరించారు. మహిళా మండలి అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాత, కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, అష్టలక్ష్మీ ఆలయ చైర్మెన్ సోమ సురేష్, వాసవి కాలనీ ప్రముఖులు చంద్రశేఖర్ గుప్త, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాంనర్సింహ గౌడ్, యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్ రెడ్డి, కొంద్రు శ్రీనివాస్, సిద్దగౌని వెంకటేష్ గౌడ్, గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శుభోదయం కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-చంపాపేట్

శుభోదయం కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ నందు డ్రైన్స్ నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా డ్రైన్స్ లెవెల్స్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకొని, ఒక డ్రాయింగ్ రూపంలో నివేదిక ఇవ్వాలని కోరారు. తర్వాత రోజు వారీ క్యాంపు కార్యాలయంలో వాటర్ వర్క్స్ అధికారులు, బస్తీవాసులతో సమావేశం నిర్వహించారు. తర్వాత డ్రైన్స్ లెవెల్స్ మీద, ఏ డ్రైన్ లైన్స్ ఎక్కడెక్కడ కలుస్తున్నాయో అనే విషయం మీద ఆరా తీశారు. బస్తీలో ఉన్న పశువుల దొడ్డి దగ్గర నుంచి క్రింద వరకు నూతన డ్రైన్స్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభం చేయాలని సూచించారు. అలాగే మిగతా గల్లీల లెవెల్స్ కూడా ఒకవైపు పశువుల దొడ్డి వైపు మిగతా క్రింద కలుస్తున్నాయని తెలిపారు. కావున మెయిన్ లైన్ మొదటగా వేయించడం జరుగుతుందని తెలిపారు. దాదాపు 140 రన్నింగ్ మీటర్స్ వరకు ఒక ఫీట్ డయా వేయించడం జరుగుతుందని తెలిపారు. తద్వారా మురుగునీటి సమస్యలు తీరుతాయని వివరించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు రమ్యభారతి, శ్రీనివాస్, నాయకులు చేగొని విఠల్ గౌడ్, సుంకోజు కృష్ణమాచారి, గోరిగే శ్రీనివాస్ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరణించిన పోలీసుల కుటుంబాలకు భద్రత నుంచి ఆర్థిక సహాయం అందచేసిన సీపీ

నవతెలంగాణ-సిటీబ్యూరో





రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ హరీష్ బాబు, మరో ఘటనలో ప్రమాదవశాత్తూ చనిపోయిన అంబర్‌పేట ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్ కానిస్టేబుల్ బాలకృష్ణ కుటుంబ సభ్యులకు రాచకొండ పోలీస్ కమిషనర్ జీ. సుధీర్‌బాబు భద్రత నుంచి ఆర్థిక సహాయం చేశారు. మంగళవారం ఎల్బీనగర్‌లోని రాచకొండ క్యాంపు కార్యాలయంలో మృతుల కుటుంబాలకు భద్రత చెక్కులు అందజేశారు. కానిస్టేబుల్ హరీష్ బాబు భార్య ప్రియాంకకు రూ.3 లక్షల తొంబై తొమ్మిది వేల నూట అరవై, ఇద్దరు మైనర్ పిల్లలకు చెరి రెండు లక్షలు, బాలకృష్ణ తండ్రి సత్తయ్యకు మూడు లక్షల తొంబై తొమ్మిది వేల నూట అరవై మరియు తల్లి జయమ్మకు మూడు లక్షల తొంబై తొమ్మిది వేల నూట అరవై రూపాయల చెక్‌లను భద్రత విభాగం నుంచి అందించారు. వారి యోగ క్షేమములను సీపీ తెలుసుకొని వారికి రావాల్సిన పెన్షన్ తొందరగా వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మినిస్టీరియల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రాచకొండ అడిషనల్ డీసీపీ అడ్మిన్ శివకుమార్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు సి. హెచ్. భద్రారెడ్డి, మృతుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

20వేల లీటర్ల ఉచిత నీటిని సరఫరా చేయండి



- బీజేపీ తుర్కయంజాల్ మున్సిపలశాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో 20వేల లీటర్ల ఉచిత నీటిని సరఫరా చేయాలని తుర్కయంజాల్ మున్సిపల్ బీజేపీ శాఖ కోరింది. ఈ మేరకు తుర్కయంజాల్ మున్సిపల్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఎలిమినేటి నరసింహా రెడ్డి అధ్యక్షతన హెచ్ఎండబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం కలిసి జీహెచ్ఎంసీలో 20వేల లీటర్ల మంచి నీటిని ప్రతి ఇంటికి ఉచితంగా సరఫరా చేస్తున్నందున తుర్కయంజాల్ మున్సిపాలిటీలో కూడా జీవో211 ప్రకారం 20వేల లీటర్ల మంచి నీటి సప్లైని ఫ్రీగా చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్, రైతు సహకార బ్యాంకు వైస్ చైర్మెన్ కొత్త రాంరెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా కోశాధికారి బచ్చిగళ్ళ రమేష్, బల్దేవ్ రెడ్డి, ఎస్సీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ కొంద్రు పురుషోత్తం, సామల యూసుఫ్ రెడ్డి, బిక్షపతి, సంజీవ రెడ్డి, మైలారం బాబు, దార వెంకటేష్, సురేష్, కోలన్ రవీందర్, గుండా కృష్ణ, సురేష్ సాగర్, యటెల్లి శేఖర్ రెడ్డి, పిట్టల వంశీ, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్రం విఫలం



- సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఎక్కడ..?
- మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాన్ యాదవ్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాన్ యాదవ్ అన్నారు. మంగళవారం జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ బాను ఆధ్వర్యంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నౌకరి దో జంజీరే నహి అనే నినాదంతో ఢిల్లీ కేంద్రంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శివ చరణ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దయాసాగర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు వల్లపు సుభాన్ యాదవ్, మహేశ్వరం మండల ప్రెసిడెంట్ రాజు గొల్లూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లేక అల్లాడుతూ ఆత్మహత్యలకు పాలుపడుతున్నారని ఆరోపించారు. యువతను పట్టించుకోకుండా ప్రభుత్వ ధనాన్ని ఆదాని, అంబానీలకు దోచిపెడుతూ, కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ ఏకచత్రాధిపత్యం చేయాలనే ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రతి సంవత్సరానికి యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మాటను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ఈ బీజేపీ ప్రభుత్వం దేశాన్ని మరో 20 ఏండ్లు వెనక్కి తీసుకెళ్ళిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జెనరల్ సెక్రెటరీ సందీప్ రెడ్డి, బాలాపూర్ మండల ప్రెసిడెంట్ పార్వతి రవి కాంత్ రెడ్డి, కందుకూరు మండల ప్రెసిడెంట్ వెంకటేష్ గౌడ్, బాలాపూర్ మండల వైస్ ప్రెసిడెంట్ మరాఠీ నర్సింగ్ వారితో పాటు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిని కలిసిన కాసిరెడ్డి వెంకటేశ్వర్



నవతెలంగాణ-మీర్‌పేట్

బీజేపీ రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్‌ను మంగళవారం రంగారెడ్డి జిల్లా కిసాన్ మాజ్దూర్ సంఘం అధ్యక్షులు కాసిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి కలిశారు. తర్వాత నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర్ రెడ్డి వెంట అరుణ్, ప్రవీణ్ కుమార్, కిషోర్ రెడ్డి, రింటూ రెడ్డి, హరీష్ తదితరులు ఉన్నారు.

కనపాక అభిషేక్‌ను అభినందించిన ఉప్పల



నవతెలంగాణ-నాగోల్

అంతర్జాతీయ బ్యాట్మెంటన్ జూనియర్ టోర్నమెంటు-2025 మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచిన కనపాక అభిషేక్‌ను టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, మేడ్చల్ మల్కాజిగిరి బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్త నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అభినందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21-9, 21-12 మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచిన అభిషేక్‌ను అభినందిస్తూ ఇంకా మునుముందు ఎన్నో విజయాలు సాధించి రాష్ట్రానికి, కన్న తల్లీదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. అభిషేక్ మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచిన తర్వాత బ్యాడ్మింటన్ జాతీయ 20వ ర్యాంక్ సాధించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. క్రీడాకారులను తాను అన్ని విధాలా అందుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన కోచ్ మేడ్చల్ మల్కాజ్ గిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ వికాస్ హర్షను అభినందించారు.

'ప్రైమరీ స్కూల్ పక్కనున్న స్థలంలో హైస్కూల్ కట్టాలి'



నవతెలంగాణ-చంపాపేట్

సింగరేణి కాలనీ బాంబే హౌస్‌లో సరళా దేవి హార్ష్ ప్రైమరీ స్కూల్ పక్కనున్న స్థలంలో హైస్కూల్ కట్టాలని పాఠశాల ప్రిన్సిపాల్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ జాయింట్ కలెక్టర్ ముకుందా రెడ్డి, హైదరాబాద్ విద్యాశాఖ అధికారి రోహిణి డీఈఓ, సైదాబాద్ ఎమ్మార్వో జయశ్రీ, డిప్యూటీ విద్యాశాఖ రాధాకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్, అధికారులు సింగరేణి కాలనీ సరళా దేవి హార్ష్ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించారు. తర్వాత సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు హైస్కూల్ కట్టాలని జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ హై స్కూల్ కడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు అలివేలు తల్లుల సంఘం సాయి లక్ష్మి సంతోషి, దళిత విమెన్ కలెక్టివ్ సేఫ్ ఫౌండేషన్ సభ్యులు శ్రీను నాయక్, పావని, సీపీఐ పార్టీ నాయకులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

'అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు'



నవతెలంగాణ - మీర్‌పేట్

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు అని సీఐటీయూ నాయకులు యాదయ్య అన్నారు. ఆశా వర్కర్లపై పోలీసుల దౌర్జన్యం, అరెస్టులను ఖండిస్తూ బాలాపూర్ చౌరస్తాలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కార్మికులపై ప్రేమ చూపెట్టి.. ఇప్పుడు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అడిగితే ఆశా వర్కర్స్‌పై పోలీసులతో దాడి చేయించి, అరెస్టులు చేస్తున్నదని ఆరోపించారు. కనీస వేతనం రూ.18వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించి, హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు వి శేఖర్ యాదవ్, ప్రకాష్ రెడ్డి, దాసరి బాబు, రమేష్, ఆశా వర్కర్ల అధ్యక్షులు భాగ్యలక్ష్మి, నీలమ్మ, సునీత పాల్గొన్నారు.

నవతెలంగాణ - చంపాపేట్

ఆశాల పట్ల ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ఐఎస్‌సదన్ ఎక్స్ రోడ్స్, సంతోష్ నగర్ వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి మీనా, మీసాల శ్రావణ్ కుమార్‌లు మాట్లాడుతూ ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల కోసం తలపెట్టిన కార్యక్రమాన్ని భగ్నం చేయాలనుకోవడం అవివేకానికి నిదర్శనమని, సీఎం ఇప్పటికైనా ఆశా వర్కర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అనేకమంది అరెస్ట్ అయినా ఆశా వర్కర్స్ మాత్రం భయపడకుండా వేలాదిమంది చలో హైదరాబాద్ కార్యక్రమం చేస్తుంటే..వారిని పోలీసులు కర్కశంగా లాఠీచార్జి చేయడం, అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో సాయంత్రం వరకు కూర్చోబెట్టుకోవడం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి పరాకాష్ఠమని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలందర్నీ ఏకం చేసి, సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్. కిషన్, ప్రమీల, సైనాజ్, షబానా, ఆశ, పుష్పలత, సుమ, సుల్తానా, కవిత పాల్గొన్నారు.



'విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరం'



నవతెలంగాణ-చంపాపేట్

విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరం అని స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఏషియన్ అథ్లెటిక్స్ కోచ్ డాక్టరు వెంకట సుబ్బారావు అన్నారు. చంపాపేట డివిజను కర్మన్ ఘాట్ పరిధిలో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు శ్రీ చైతన్య స్కూల్ ఫౌండర్ బిఎస్ రావు మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ జోనల్ క్రీడా పోటీలలో కర్మన్ ఘాట్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. వివిధ విభాగాల యందు కర్మన్ ఘాట్ విద్యార్థులు 11 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఏషియన్ అథ్లెటిక్స్ కోచ్ డాక్టరు వెంకట సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. కర్మన్ ఘాట్ విద్యార్థులు రన్నింగ్, త్రోబాల్, బ్యాడ్మింటన్, సి.యన్, మ్యాచ్ రిలే, రింగ్ అండ్ బాల్ బాలెన్సింగ్ రిలేలో ప్రథమ బహుమతులు సాధించినట్టు తెలిపారు. అనంతరం గెలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సతీష్, ఆర్ఐలు. రవీందర్ రెడ్డి, కో ఆర్డినేటర్ రఘువంశీ, పిన్సిపాల్ ఫమాధవి, ప్రైమరీ కోఆర్డినేటర్ కామేశ్వరి, వైస్ పీన్సిపాల్ సుందర్ సింగ్, డిన సతీష్, ఏవో సతీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు అభినందనలు



నవతెలంగాణ-హయత్‌నగర్

డిపోలలో పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగులను డిప్యూటీ డివిజనల్ మేనేజర్లు మంగళవారం అభినందించి.. శాలువాలతో ఘనంగా సత్కరించారు. హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లుగా బాధ్యతలు స్వీకరించిన వారు హయత్ నగర్ 1 డిపోకు విచ్చేసి ఉద్యోగుల అభినందన కార్యక్రమంలో విడివిడిగా పాల్గొని ప్రసంగించారు. సంస్థ పట్ల ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. అదే వరవడి కొనసాగించి సంస్థను ముందుకు తీసుకొని పోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఫిబ్రవరి నెలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన డ్రైవర్, కండక్టర్, మెకానిక్ సిబ్బందికి నగదు పురస్కారాలు, ప్రశాంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయ్, సహాయ మేనేజర్‌లు విజయకుమారి, సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'27న మీర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు'

నవతెలంగాణ-మీర్‌పేట్

అధికంగా ఉన్న ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న మీర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ తలపెట్టనున్న రిలే దీక్షలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, ముఖేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. జిల్లెలగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అధిక పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ రిలే దీక్షల కరపత్రాన్ని నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలు మార్లు మున్సిపల్ అధికారులకు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సిడిఎమ్ఏలకు వినతిపత్రాలను అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. అందుకే ఈ నెల 27వ తేదీన మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న రిలే దీక్షలలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షులు పెండ్యాల నర్సింహ, ఫ్లోర్ లీడర్ కిసర గోవర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సోమేశ్వర్, మాజీ కార్పొరేటర్లు ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, గౌరీ శంకర్, భీమ్ రాజ్, నాయకులు జగన్, గాజుల మధు, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పదు..

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి/కాప్రా

ప్రతీ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని డాక్టర్ హెూమి జే బాబా కన్వెన్షన్ సెంటర్ ఈసీఐఎల్‌లో చర్లపల్లి డివిజన్‌కు చెందిన గడ్డం ముక్తేశ్ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎన్ఎఫ్‌సీ నందు ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం ప్రజా సేవలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, ఎస్ఏ రహీం, రాజిరెడ్డి, రమేష్, ప్రసాద్, శ్రీశైలం, అనిల్, సంపత్, చిన్న, బాలాజీ, రఘు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

నవతెలంగాణ -శామీర్‌పేట



మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలంలోని 7గ్రామాలను కలిపి అలియాబాద్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన సందర్భంగా అలియాబాద్ మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చేయడానికి కృషి చేసిన మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రెష్ యాదవ్‌ను, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిని, డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డిని, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్‌లను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి.యాదగిరి, బి. మల్లేష్, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి రాము, జి నాగమల్ల రెడ్డి, పి. అశోక్, ఎం.ప్రకాష్ గౌడ్, రాంచేందర్ రెడ్డి పి. శ్రీనివాస్, టి.నర్సింగరావు,త టి.శివ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌ను గొంతు నులిమి హత్య చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

- కుటుంబకలహాలతోనే హత్య జరిగిందా అనే కోణంలో పోలీసుల ఆరా?



ఫైల్ ఫోటో

నవతెలంగాణ-కాప్రా

గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఆటోడ్రైవర్‌ను గొంతునులిమి హత్య చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం కుషాయిగూడ ఎస్‌హెచ్‌వో భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు సాయినగర్ కాలనీ, సాయిబాబా టెంపుల్ సమీపంలో నివాసముండే పీ.శంకర్ అనే ఆటో డ్రైవర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గొంతునులుమి హత్య చేశారు. డయాల్ 100 ద్వారా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ బృందాలతో తనిఖీ చేశారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కుషాయిగూడ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే గతకొద్ది రోజులుగా మృతుడి ఇంట్లో కుటుంబ కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో శంకర్‌ను హత్య చేశారా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

కష్టపడి పని చేస్తేనే గుర్తింపు ఉంటుంది



కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పార్టీ కోసం కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆనంద్‌బాగ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో డివిజన్‌లో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కార్యకర్తలకు తాను అందుబాటులో ఉంటానని, పెండింగ్ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాని సూచించారు. అంతకుముందు లక్ష్మికాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సవరించిన నూతన ఓటర్ లిస్ట్ ప్రకారం బూతుల వారీగా ఓటర్లను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో బీకే శ్రీనివాస్, ఏ బ్లాక్ అధ్యక్షులు అశోక్ రెడ్డి, యాదగిరి, డివిజన్ అధ్యక్షులు ఉమేష్ సింగ్, సత్యమూర్తి, మాజీ కౌన్సిలర్ వెంకటేష్, బ్రహ్మయ్య, రాము, రామకృష్ణ, నయీమ్, ములుగు శ్రీనివాస్, అరుణ్, రోజా, పద్మ లక్ష్మీ, కవిత, మోయిన్, వాజిద్, పసియుద్దీన్, లఖాన్, పోషాలు, సోమయ్య, వజీద్, బుచ్చిబాబు, హరికిషన్, బాబు సత్యనారాయణ, సంపత్, నవీన్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ స్కూల్‌లో వరల్డ్ వాటర్ డే



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని సెయింట్ పాల్స్ పాఠశాలలో హైదరాబాద్ జలమండలి వారి సహకారంతో నిర్వహించిన ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యతిథిగా స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నీటి సంరక్షణ గురించి విద్యార్థులకు వివరించారు. నీటిని వృథా చేయొద్దన్నారు. నీటి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తమ తమ ఇండ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వర్షపు నీటిని వృథా పోకుండా నిల్వ చేసుకోవాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం కట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా తాగు, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారని తెలిపారు. ఆ ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నీటిని ఎలా ఉపయోగించాలి.. మానవ మనుగడకు నీటి ప్రాముఖ్యతను గూర్చి వ్యాసాలు వినిపించారు. అంతకుముందు విద్యార్థులు నీటి సంరక్షణపై నినాదాలు చేస్తూ డివిజన్ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జలమండలి డీజీఎం సతీష్, ఏజీఎం వేణుగోపాల్ నాయకులు వెంకటచారి, మల్లేష్ గౌడ్, చంద్రశేఖర్, మురళీకృష్ణ పాఠశాల ప్రిన్సిపాల్ సత్తిరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బుడగ జంగాల శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తా



- కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

నవతెలంగాణ - చర్లపల్లి

నాచారం అన్నపూర్ణ కాలనీలోని బుడగ జంగాల శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ అన్నారు. శ్మశాన వాటిక ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదనీ, ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు చేయడానికి అనేక కష్టాలు పడుతున్నామనీ, సరైన దారిలేక ఇబ్బందులు పడుతున్నామనీ బుడగ జంగాల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ శ్మశాన వాటికలోకి వెళ్లడానికి సిమెంటు రోడ్డు వేయాలని కోరారు. బర్నింగ్ ప్లాట్ ఫారం ఏర్పాటు చేయాలని, స్నానాల గదులు, బట్టలు మార్చుకునేందుకు గదులు, బోరు మోటారు, లైట్లు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం త్వరలోనే శ్మశాన వాటికకు నిధులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, కిష్టయ్య నరసింహ, శంకర్, లడ్డు, శివ రామ్, కృష్ణ, సుధాకర్, మల్లేష్, రాము, శ్రీకాంత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- ఆశా వర్కర్లకు అండగా సీపీఐ(ఎం)
- సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్
- సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పోలీసుల నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్, సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు అన్నారు. ఆశా వర్కర్లపై నిర్బంధానికి నిరసనగా మల్కాజిగిరి చౌరస్తాలో మంగళవారం ధర్నా చేశారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధినేతలకు మంచి గుణాన్ని ప్రసాదించాలని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కోఠి సెంటర్‌లోని హెల్త్ సెక్రటరీ, కమిషనరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆశా వర్కర్స్‌పై పోలీసుల నిర్బంధకాండకు నిరసనగా సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ మీదుగా మల్కాజిగిరి చౌరస్తా నుండి గాంధీ పార్క్ వరకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారు నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి రాజ్య హింసను ప్రేరేపిస్తూ పోలీసు రాజ్యాన్ని నిర్మించే కుట్రలు చేస్తూ కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అడిగితే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. పోలీసు నిర్బంధంతో ఉద్యమాలను ఆపలేరని, ఎంత నిర్బంధాన్ని ప్రయోగిస్తే అంతకు రెట్టింపు ఉద్యమాలు పుట్టుకొస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 29 కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తూ రద్దుచేసిందన్నారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు ఇలాగే కొనసాగితే ప్రభుత్వాలు శంకరగిరి మాన్యాలు పట్టక తప్పదని హెచ్చరించారు. అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ. హేమలత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పరిచిన విధంగా ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. పారితోషకాలు ఇవ్వలేని పనులను ఆశా వర్కర్స్‌తో చేయించకూడదని చెప్పారు. ఆశా వర్కర్లపై మెడికల్ ఆఫీసర్స్ ఒత్తిడి, బెదిరింపులు మానుకోవాలన్నారు. ఆశాలను భే షరతుగా పర్మినెంట్ చేయాలని కోరారు. కార్మిక చట్టాలను సమగ్రంగా అమలు జరపాలని, ఆశా వర్కర్స్‌పై లైంగిక వేధింపులను అరికట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆశాలకు వేతనాలు పెంచని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎంపీలకు వేతనాలను సవరించి పెంచుకున్నదని విమర్శించారు. తమ సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా, ఎన్ని ఆందోళన, పోరాటాలు చేసిన "దున్నపోతు మీద వాన పడ్డ " చందంగా వ్యవహరిస్తుందే తప్ప సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వదిలి ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా, మల్కాజిగిరి మండల ఆశా వర్కర్స్ యూనియన్ టీ. హేమలత, సంతోష, వసంత, సుమలత, రాజ్యలక్ష్మి, స్వప్న, చంద్రకాంత, నమ్రత, సునీత, అరుణ, శోభ, శశికళ, పావని, విజయని, సురేఖ, శాంత కుమారి సంధ్యా రాధ భాగ్యలక్ష్మి మమత శ్వేతా కృష్ణవేణి షబానా, సుల్తానా రీటా శశిరేఖ శ్రావణి యమునా శారద, ఝాన్సీ, సునీత, సుజాత, శిరీష, అధిక సంఖ్యలో ఆశావర్కర్స్, పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



మేడ్చల్‌లో..

అంగన్వాడీల అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ మంగళవారం మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి 44 పై సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆర్టీసీ బస్ డిపో నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రభుత్వ దిష్టిబొమ్మను ఊరేగించారు. అనంతరం సీఐటీయూ మండల కార్యదర్శి మందాపురం నరేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు సోమవారం నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి మహిళలని చూడకుండా వారి పై పిడుగులు గుద్దడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లల్లోకి వెళ్లి ముందస్తు అరెస్టులు చేయడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ స్కీంను సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన ఆ హామీలను నిలబెట్టుకోవాలని చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి పోలీసులను ఉపయోగించుకొని అడ్డుకోవడం హేయమైన చర్య అన్నారు.ఆశా వర్కర్లు తమ సొంత పనుల కన్నా ప్రజలపనే దైవంగా పని చేస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నారని తెలిపారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు ఇవ్వకుండా వాళ్ళ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకులు వసంత, రాజకుమారి, రాజమణి, యాదమ్మ సునంద, మమత, పద్మ, రజిత, లావణ్య, రాణి, అరుణ, ఫాయుమ్, అనిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ రైల్లో మహిళలకు రక్షణ కల్పించాలి

- ఐద్వా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద



నవతెలంగాణ-కాప్రా

ఎంఎంటీఎస్ రైల్లో మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమలానగర్ ఈసీఐఎల్ ఆఫీసులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణిస్తున్న యువతిపై లైంగికదాడికి ప్రయత్నం చేస్తుండగా ఆమె రైల్లో నుంచి దూకి తీవ్ర గాయాలపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలికి నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. మేడ్చల్‌లో ఓ ప్రయివేట్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగానికి వెళ్లి వస్తున్న ఆమెపై అత్యాచార ప్రయత్నం చేసిన దుండగుని ఫాస్ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ ఎంఎంటీఎస్ రైల్లో మహిళా పోలీసులతో రక్షణ కల్పించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రైల్వేలో పోలీసుల రక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయ్యాయని అన్నారు. బాధితురాలికి ఇల్లు, ఉద్యోగం, రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. మద్యం మత్తులో ఉన్నప్పుడు ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని అన్నారు. మద్యం, డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు ఎక్కడపడితే అక్కడ దొరకడం వలన హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. ఇప్పటికైనా వాటిని అరికట్టాలని ఐద్వా డిమాండ్ చేస్తుందన్నారు. సీఎం వైన్ షాపులు పెంచుతామని ప్రకటించారని, ఇప్పటికే ఉన్న వైన్స్‌లతో మహిళలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అదనంగా పెట్టడం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. సీఎం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో సహాయ కార్యదర్శి పి.మంగ ఉపాధ్యక్షులు సిహెచ్ లీలావతి, ఏ.శారద పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపల్ తైబజార్ వేలం

- రూ. 31,06,000 వేలకు దక్కించుకున్న మంగల్‌పురి కిరణ్



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ పురపాలక సంఘం కార్యాలయంలో 2025-2026 ఏడాదికి తైబజార్ బజార్ వేలం పాటను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎ.నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో మంగల్‌పురి కిరణ్, పి. బస్వారెడ్డి, ఎస్. కృష్ణారావు పాల్గొన్నారు. ప్రభుత్వం పాట రూ.30,25,000 ఉండగా మంగళ పూరి కిరణ్ రూ. 31,06,000 వేలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. ఎస్. కృష్ణారావు రూ.31,05,000తో రెండో స్థానంలో నిలించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం, తదితరులు ఉన్నారు.

నవోదయ ఫలితాల్లో క్రాంతి కీన్ విద్యార్థుల హవా..



- సత్తా చాటిన 29 మంది విద్యార్థులు

నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు జనవరి 18న నిర్వహించిన పరీక్ష ఫలితాలలో దమ్మాయిగూడకు చెందిన క్రాంతి కీన్ అకాడమీ విద్యార్థుల హవా కొనసాగింది. 29మంది విద్యార్థులు ఎంపికై సత్తా చాటారు.

క్రాంతి కీన్ అకాడమీ గొప్ప విజయం

-డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి 2025 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో క్రాంతి కీన్ అకాడమీ నుండి 29 మంది విద్యార్థులు ఎంపిక కావడం గొప్ప విజయమని పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. క్రాంతి కీన్ అకాడమీ స్కూల్ ఆన్‌లైన్ తరగతుల ద్వారా ఎంతో మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, జెఎన్‌వీ విజయాల్లో భాగస్వామ్యమైందన్నారు. ఎంపికైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ ఫలితాలతో పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు, పిల్లలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కల్యాణి, సెక్రెటరి లావణ్య, టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ పాఠశాల ప్రత్యేకత

జవహర్ నవోదయ పాఠశాలలు భారత ప్రభుత్వానికి చెందిన కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు. ప్రతి జిల్లాలో ఒక పాఠశాల ఉంటుంది. విద్యార్థులను 6వ తరగతిలో జాయిన్ చేసుకొని 12వ తరగతి వరకు ఉచిత విద్య, వసతి, భోజనం, పుస్తకాలు, ఉన్నత శిక్షణతో కూడిన విద్య, మంచి వాతావరణంలో అందిస్తారు. ఇక్కడ విద్యతో పాటు, అధునాతన ల్యాబ్‌లు, లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఇది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఒక అరుదైన అవకాశం.

శ్రీ సీతారామచంద్ర స్వామి తలంబ్రాల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - చర్లపల్లి

తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడ డిపోలో శ్రీరామ నవమి సందర్భంగా భద్రాద్రి సీతారామ చంద్రస్వామి కల్యాణ తలంబ్రాలు సులువుగా ఇంటి వద్దకే వచ్చే విధంగా ఆర్టీసీ తగిన ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మంగళవారం కుషాయిగూడ డిపో ప్రాంగణంలో సికింద్రాబాద్ రీజినల్ డిప్యూటీ ఆర్ఎంజి. పవిత్ర పోస్టర్ ఆవిష్కరించారు. భద్రాద్రి వెళ్లి కల్యాణం చూడని వాళ్ల కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో రాములోరి తలంబ్రాలను నేరుగా తమ ఇంటి వద్దకే చేర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ వినియోగించుకోవాలని కోరారు. బుకింగ్ కోసం కుషాయిగూడ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేష్, ఫోన్ నెంబర్ 9154298833, 9848852211 సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ డిపో మేనేజర్ మహేష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఆనందరావు, అసిస్టెంట్ మేనేజర్ మెకానికల్ వ్యాస్ సెక్యూరిటీ విభాగం కె. ఎస్‌రెడ్డి, కంట్రోలర్ పీఆర్ఎమ్ రెడ్డి ఉద్యోగులు ఉన్నారు.

నిషిజ ఎస్టేట్స్ పై వస్తున్న ఆరోపణలు అవాస్తవం : గంగాధర్



నవతెలంగాణ-ఘట్కేసర్


నిషిజ ఎస్టేట్‌పై కొంత మంది చేస్తున్న ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని యజ మాని గంగాధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లా డుతూ.. నిషిజ ఎస్టేట్ పేరుతో ఘట్కేసర్ రెవెన్యూ పరిధిలో సర్వే నెం. 543/3, 543/4, 543 /5, 543/6, 543/7, 543/8, 543/9 లో దాదాపుగా 123-00 ఎకరాలలో వెంచర్ అభివృది చేస్తున్నామని, హెచ్ఎండీఏ, రేరా అనుమతులతో పాటు మైనింగ్, బ్లాస్టింగ్ అనుమతులు తీసుకున్నామని తెలిపారు. తమ వెంచర్ పరిధిలో ఘట్కేసర్ ఘట్టు మైసమ్మ గుట్ట ఆలయం, 543/2, ప్రభుత్వ భూమి సుమారుగా 18-00 ఎకరాలు ఉందని, గతంలో ప్రభుత్వ భూమికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సమక్షంలో హద్దులు ఏర్పాటు చేసి బోర్డులు నాటామని తెలిపారు. ప్రభుత్వ భూమి చుట్టూ నిషిజ యాజమాన్యం ప్రహరీ గోడ నిర్మాణం చేసింద తెలిపారు. గట్టు మైసమ్మ దేవాలయానికి సంబంధించిన భూమిని కానీ, మరో వైపు ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేయలేదన్నారు. కొంత మంది ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తునట్టు చేసిన ఆరోపణలో వాస్తవం లేదని చెప్పారు. మా పై అనవసరంగా తప్పుడు ఆరోపణలు చేసి మా సంస్థ పరువు, ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేదిలేదన్నారు. అలాంటి వారి పై న్యాయస్థానం ద్వారా పరువు నష్టం దావా వేస్తామని ఆయన మండిపడ్డారు.

అసెంబ్లీ సందర్శనకు వెళ్లిన విద్యార్థులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

తెలంగాణ అసెంబ్లీని సందర్శించేందుకు మల్కాజిగిరిలోని ప్రభుత్వ పాఠశాలల్లోని వంద మంది బాలికలు వెళ్లారు. విద్యార్థులు వెళ్లడానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బస్సులను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మర్రి ఆదేశాల మేరకు విద్యార్థులకు మల్కాజిగిరి డివిజన్ మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ వాటర్ బాటిల్లు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేసి మంగళవారం అసెంబ్లీకి పంపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జె.ఏ.సీ వెంకన్న, రాము యాదవ్, వాసగొని శ్రీనివాస్ గౌడ్, చిన్న యాదవ్, ఉపేందర్, బైరు అనిల్, సతీష్, సంతోష్ గుప్త, నర్సింగ్, వాసు, శ్రీధర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో తెలుగు రత్న అవార్డ్స్ కార్యక్రమానికి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. -నవతెలంగాణ - చర్లపల్లి

నాగారం తైబజార్ వేలం వాయిదా

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ 2025-26 ఆర్థిక ఏడాకి సంబంధించి తైబజార్ వేలం పాటను మంగళవారం నిర్వహించగా మున్సిపాలిటీ నిర్ణయించిన కనీస ధర కంటే తక్కువ వచ్చినందున వేలం పాట వాయిదా వేసినట్టు కమిషనర్ జి.భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ వేలం పాటలో ముగ్గురు పాల్గొనగా అత్యధికంగా కృష్ణారావు రూ. 28,90,000/- పాడారు. మున్సిపాలిటీ నిర్ణయించిన కనీస ధర కంటే తక్కువ వచ్చినందున ఉన్నతాధికారులకు నివేదిక పంపి మళ్లీ వేలం పాటను నిర్వహిస్తామని, వేలం పాట తేదీని తెలియజేస్తామని కమిషనర్ తెలిపారు.

టీవీఆర్ మోడల్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అపురూప కాలనీలోని "టీవీఆర్ మోడల్ హై స్కూల్"లో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ టి . వంశీ కష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులతో జ్యోతి ప్రజ్వలన గావించి వెల్కమ్ డాన్స్ తో స్వాగతం పలికారు. చిన్నారులు చేసిన సాంస్కతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రీ ప్రైమరీ విద్యార్థులు యూకేజీ పూర్తిచేసుకుని ప్రైమరీ సెక్షన్ 1వ తరగతిలోకి అడుగుతున్న శుభ సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తారు. మేనేజింగ్ డైరెక్టర్ వంశీకష్ణారెడ్డి ప్రమోట్ చేసిన ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, శ్రద్ధ వంటి లక్షణాలను నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్ద వలసిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎల్కేజీ , యూకేజీ విద్యార్థిని విద్యార్థులు ప్రిన్సిపల్ ఎం జయరాజ్ , అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అరెస్ట్‌లను నిరసిస్తూ నల్ల బ్యాడ్జిలతో నిరసన

- ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలు ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్



నవతెలంగాణ - బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆశాల అక్రమ అరెస్ట్‌లను నిరసిస్తూ నల్ల బ్యాడ్జిలతో మంగళవారం నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడుతూ 24న చలో కోఠి కమిషనరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్ లను రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్బంధంలో అరెస్ట్ లు చేసిన వేలాది మంది ఆశాలు కోఠికి వస్తే ధర్నా జరగకుండా అక్రమ అరెస్ట్ లు చేయడం మగ పోలీస్ లు మహిళా ఆశాల ను అరెస్ట్ లు చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18లు ఇవ్వాలని, అదే విధంగా ఈఎస్ఐ, పీఎఫ్‌లను అమలు చేయాలని, మట్టి ఖర్చులకు రూ. 50వేలు, రిటైర్మెంట్ బెన్ఫిట్ లు తదితర వంటి విషయాలపై అసెంబ్లీ లో చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ లీడర్ లు అనిత, సబియా, ఆశాలు భాగ్యలక్ష్మి, అపర్ణ, రేణుక, పద్మమ్మ, దీప్తి, లలిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

దీనబంధు కాలనీ రోడ్ల పై మరోసారి మురుగు నీరు



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి డివిజన్ దీన బంధు కాలనీలో రోడ్డు పై మరోసారి మురుగు నీటి ప్రవాహం వరదలా పారడంతో దుర్గంధంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ రోడ్డు నంబర్ 17 వద్ద డ్రయినేజీ మ్యాన్ హెూల్ నుంచి మురుగు నీరు వరదలా పారుతున్నది. ఈ నెల 20న అదే మ్యాన్ హెూల్ నుంచి మురుగు నీరు రోడ్డుపై పొంగి పొర్లడంతో,వాటర్ వర్క్స్ అధికారులకు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రయినేజీ లైన్ క్లియర్ చేసి మురుగు నీరు ప్రవాహాన్ని ఆపేశారు. అయితే వాటర్ వర్క్స్ సిబ్బంది మరమ్మతులతో తాత్కాలికంగా మాత్రమే డ్రయినేజీ లీకవ్వడంతో ఆగిందని.. మళ్ళీ తరువాత రోజు నుంచి అదే మ్యాన్ హెూల్ నుండి మురుగు నీరు రోడ్డు పై ప్రవహిస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. తరచూ డ్రయినేజీ లీక్ అవడంతో స్థానికులు అనారోగ్యాలకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కాబట్టి పై నుంచి వచ్చే డ్రయినేజీ లైన్‌ను పక్కా ప్రణాళికతో మరమ్మత్తులు పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని, తరచూ డ్రయినేజీ సమస్యలు పునరావృతం కాకుండా పకడ్బందీగా మరమ్మతులు చేయాలని జలమండలి అధికారులను స్థానికులు కోరుతున్నారు.

విద్యతో పాటు క్రీడలు కీలక భూమికను పోషిస్తాయి

- జేఎన్టీయూహెచ్ వీసీ ప్రొ. టి. కిషన్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యతో పాటు క్రీడలు కీలక భూమికను పోషిస్తాయని జేఎన్టీయూహెచ్ వైస్-చాన్సలర్ ప్రొ. టి. కిషన్ కుమార్ రెడ్డి అన్నారు. కూకట్ పల్లిలోని జేఎన్టీయూ హెచ్‌లో ఈ నెల 25, 26వ తేదిలలో జరిగే వైస్-చాన్సలర్ ట్రోఫీ అంతర్-కళాశాల క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ పాల్గొని విశ్వవిద్యాలయ ఇండోర్ స్టేడియంలో పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ పోటీల్లో జేఎన్టీయూహెచ్ అనుబంధ , స్వయం ప్రతిపత్తి కళాశాలల నుంచి పురుషులు, మహిళల కబడ్డీ, ఖోఖో జట్లు ఉత్సాహపూర్వకంగా పాల్గొన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని, జట్టు భావాన్ని, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించామన్నారు. క్రీడలు తన బాల్యాన్ని గుర్తు చేశాయంటూ తన విద్యార్థి దశ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. గెలుపు ముఖ్యం కాదు పాల్గొనడమే గెలుపుతో సమానం అంటూ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని ఇచ్చారు. జేఎన్టీయూహెచ్ నుంచి జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే ప్రతిభావంతులైన క్రీడాకారులకు విశ్వవిద్యాలయం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు క్రీడల్లో రాణించాలని విశ్వవిద్యాలయం ఆకాంక్షించింది. విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తూ, క్రీడా అభివద్ధికి విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ కషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.ఎస్. దిలీప్, సీనియర్ ప్రొఫెసర్ బాలు నాయక్, జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ బి. కైలాష్ యాదవ్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్ల గొండ అశోక్, తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ డి. సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించండి



- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎం. శంకర్
- ఏఈకి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ పరిసర ప్రాంతాల్లోని బస్తీలలో వోల్టేజ్ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎం. శంకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆల్విన్ కాలనీ ఏఈ పిరియా నాయక్‌కు పార్టీ కూకట్‌పల్లి నాయకులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ నగర్ దీనబంధు కాలనీ, ప్రగతి నగర్, రామకష్ణ నగర్, పాపిరెడ్డి నగర్ కాలనీ తదితర బస్తీలలో, లోవల్టేజ్ సమస్య వల్ల ఇంట్లో వాడుకునే ఎలక్ట్రికల్ వస్తువులు, టీవీ, ఓవెన్, ఫ్రిడ్జ్ లాంటి వస్తువులు పాడైపోతున్నాయని తెలిపారు. కావున ఈ బస్తీలకు అవసరానికి తగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మాలు ఏర్పాటు చేసి, లో ఓల్టేజ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. అందుకు ఏఈ ఈ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు కే కృష్ణ నాయక్, శాఖ కార్యదర్శి పి ధర్మారావు, పోలయ్య కృష్ణారావు, లక్ష్మీనారాయణ, డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్ సీసాల బస్తీలో వైష్ణవి దుర్గ దేవి ఆలయ ముఖద్వార నిర్మాణానికి బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకులు కొలుకుల జైహింద్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు,యువ నాయకులు కొలుకుల సాయి,కొలుకుల కార్తీక్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

భగత్ సింగ్ నగర్‌లో పార్కు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కబ్జాకు కాదేది అనర్హం అన్నచందంగా భూభకాసురులను బరితెగిస్తున్నారని భగత్ సింగ్ నగర్ దోబిఘాట్ స్థలంలో తక్షణమే పార్కు ఏర్పాటు చేయాలని చింతల్ డివిజన్ బీజేపీ శ్రేణులు కోరారు. ఈ మేరకు గాజుల రామారం ఉప కమిషనర్ మల్లారెడ్డికి ఫిర్యాదు అందజేశారు. సర్వే నెంబర్ 148 చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్‌లోగల దోబీ ఘాట్(మొగుళ్ళకుంట) ఎఫ్.టి.ఎల్,బఫర్ జోన్‌ను యథేచ్చగా ఆక్రమించుకుని,గత సంవత్సరం నవంబర్ నుంచి దాదాపు 2,000 చదరపు గజాల స్థలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల సహకారంతో క్రయవిక్రయాలు జరుగుతున్నాయని అంతేకాకుండా రూముల నిర్మాణంతో దర్జాగా పాగా వేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై గతంలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని డీసీ దృష్టికి తీసుకువచ్చారు.వెంటనే ఎఫ్.టి.ఎల్,బఫర్ జోన్‌లో ఉన్న ఈ అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించి, ప్రజా ప్రయోగకరమైన ఆ ప్రదేశంలో పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా జగద్గిరిగుట్ట పైప్‌లైన్ నుంచి వచ్చే 30 ఫీట్ల నాలాను పునరుద్ధరించి అందమైన ప్రదేశంగా తీర్చిదిద్దాలన్నారు.ఈ వారంలో చర్యలు తీసుకోకపోతే హైడ్రా కమిషనర్‌కు డిప్యూటీ కమిషనర్‌పై ఫిర్యాదు చేస్తామని అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో చింతల్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు రాజా కొట్టే సదానంద,ఆకుల సతీష్,నల్ల జై శంకర్ గౌడ్,మాజీ అధ్యక్షులు పత్తి సతీష్,డివిజన్ అధ్యక్షులు రాజేష్ చారి,జీడిమెట్ల డివిజన్ మాజీ అధ్యక్షులు పులి బలరామ్,జితేందర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖాన ఓపీ పెంచాలి

- ఇక్కడి వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

బస్తీ దవాఖానల్లో ఓపీ పేషెంట్ల సంఖ్యను పెంచేలా, ఇక్కడ అందించే వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం కూకట్‌పల్లి మండలంలోని హౌజింగ్ బోర్డు 4వ ఫేజ్‌లో గల బస్తీ దవాఖానను కలెక్టర్ తనిఖీ చేసి ప్రజలకు వైద్య సేవలందించేందుకు మెడికల్ ఆఫీసర్లు తప్పని సరిగా ఉండాలనీ, ఖాళీలు ఉంటే వెంటనే భర్తీ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. ఈ సందర్భంగా రోజుకు ఎంత మంది ఓపీ పేషెంట్లు వస్తారని అడిగి తెలుసుకున్నారు. ఓపీ సంఖ్యను పెంచేలా బస్తీ దవాఖానలో అందించే వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇక్కడ ఎంత మంది సిబ్బంది ఉన్నారని అడిగి తెలుసుకుని, ఇక్కడ అందించే వైద్య సేవల రికార్డుల రిజిస్టర్లను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ గురించి అడిగి వాటి నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. రోజుకు ఎంత మంది రక్త పరీక్షలకు నమూనాలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించి మందుల నమోదు రిజిష్టర్లను, పేషంట్లకు మందులు అందించిన రిజిష్టర్లను తనిఖీ చేసి నాలుగు నెలలుగా పేషంట్లకు మందులు ఇచ్చిన రికార్డుల నమోదు సరిగా లేదని అసంతప్తి వ్యక్తం చేశారు.

బాలాజీనగర్ బస్తీ దవాఖాన తనిఖీ

కూకట్‌పల్లిలోని బాలాజీనగర్ బస్తీ దవాఖానను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేసి, అక్కడ ఎంత మంది వైద్య సిబ్బంది ఉన్నారు..? అని అడిగి తెలుసుకున్నారు. పేషంట్లకు అందించే సేవలను మెరుగుపర్చి మరింత విస్తృతం చేయాలని వైద్యులకు సూచించారు. హాస్పిటల్‌ను తనిఖీ చేస్తూ ల్యాబ్ రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. ప్రత్యేక విభాగానికి సంబంధించిన వ్యాధితో వచ్చే పేషెంట్లకు ఏ విధంగా ట్రీట్మెంట్ ఇస్తున్నారని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. ఏ విధంగా టెలి మెడిసిన్ అందిస్తున్నారని కంప్యూటర్‌లో పరిశీలించారు. ప్రతి రోజూ ఓపీ పేషంట్ల నమోదును, వారికి అందించే వైద్య సేవల వివరాలను ట్యాబ్‌లో పరిశీలించి, ప్రతిరోజూ తనకు నివేదికలు పంపాలని డీఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీ, కూకట్‌పల్లి తహశీల్దార్ స్వామి, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

కృషి, పట్టుదల, క్రమశిక్షణే విజయానికి కారణం

- 'పది'లో మంచి ఉత్తీర్ణతతో భవిష్యత్ లక్ష్యం ఏర్పర్చుకోవాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కృషి, పట్టుదల, క్రమశిక్షణే మీ విజయానికి కారణమనీ, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి, భవిష్యత్ లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ఇదే స్ఫూర్తితో చదువుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ విద్యార్థులకు బోధించారు. మంగళవారం కూకట్ పల్లి మండలంలోని బృందావన్ కాలనీలో కుత్బుల్లాపూర్ తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, జూనియర్ కాలేజీని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో విజయం సాధించి భవిష్యత్‌లో ఏం చదవాలనే లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ఆ దిశగా ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదో తరగతిలోని ప్రతి విద్యార్థితో ముచ్చటించారు. భవిష్యత్‌లో ఏం చదువుతారనీ, ఏ గ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలనీ, విద్యతోనే భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. భోజనశాలలో టేబుళ్ళు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. రంజాన్ మాసం ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. స్టోర్ రూంలోని వంట సామాగ్రిని పరిశీలించి తడి తగలకుండా నిల్వ చేయాలన్నారు. స్కూల్ కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారనీ, ఇంటర్‌లో ఏ ఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ మార్కులను సాధించే విద్యార్థులకు భవిష్యత్తులో చదువుకునే కోర్సులపై మార్గదర్శకం అందిస్తూ వారికి అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పాఠశాల భవనానికి చెల్లించే అద్దెలో 5శాతం మినహాయించి అవసరమైన చిన్న చిన్న మరమ్మత్తులను చేయించుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం పక్కనే నిర్వహిస్తున్న బాలానగర్ తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, జూనియర్ కాలేజీని కూడా సందర్శించారు. అక్కడ కూడా విద్యార్థులతో మాట్లాడి వారికి మిగిలిన పరీక్షలు కూడా బాగా రాయాలనీ, మంచి మార్కులు సాధించాలని సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈఓ కాంతమ్మ, కూకట్‌పల్లి తహశీల్దార్ స్వామి, కాలేజీ ప్రిన్సిపాల్ మాధవిలత, తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

- సీపీఐ(ఎం) బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకట రామయ్య



నవతెలంగాణ-నిజాంపేట్

దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన వీరుడు భగత్ సింగ్ అని,భగత్ సింగ్ స్ఫూర్తిని కొనసాగిద్దామని సీపీఐ(ఎం) బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకట రామయ్య అన్నారు. భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ప్రగతి నగర్ లోని కాకతీయ హిల్స్ నుంచి నెమలి సర్కిల్ వరకు ప్రగతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం అన్ని కులాలు,మతాల వారు సమానంగా లౌకికవాదంతో జీవించాలని భగత్ సింగ్ కోరుకున్నారని అన్నారు. భగత్ సింగ్ ఆలోచనలు ఆయన భావాలు భిన్నంగా ఉండడంతో ఆయన జయంతి,వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు అవుతున్నా సమాజంలో అసమానతలు మరింత పెరుగుతున్నాయని చెప్పారు. దేశ సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకతమైందన్నారు. యువతకు ఉపాధి పగటి కలగానే మిగిలిందని, దేశంలో నిరుద్యోగత పెరిగిపోవడం బాధాకరమన్నారు. భగత్ సింగ్‌కు ఉరిశిక్ష విధించే తేదీ కంటే ఒకరోజు ముందే ఆయనకు ఉరిశిక్ష అమలు చేయడానికి కారణం అక్కడి స్థానికులు భారీ సంఖ్యలో బ్రిటిషర్లకు వ్యతిరేకంగా ఉద్యమించడమేనన్నారు. లాలా లజపతి రాయిని బ్రిటిష్ సైన్యం తీవ్రంగా హింసించడంతో ఆయన చనిపోవడం, దానికి ప్రతీకారంగా బ్రిటిష్ పార్లమెంట్‌లో భగత్ సింగ్ వారి అనుచరులు బాంబులు వేసి పారిపోకుండా అక్కడే నిలబడ్డారనిగుర్తు చేశారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు ఇచ్చుకుంటూ పోలీసులకు లొంగిపోయారని తెలిపారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పలు రకాల కులం, మతం,ప్రాంతాల పేరుతో దేశ ప్రజలను విభజించి పరిపాలిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమాన్ని ప్రగతి యూత్ అసోసియేషన్ కన్వీనర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కంచె చెదిరి విరిగిన రేలింగ్

- ప్రమాదకరంగా నాలా వంతెన



నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎస్ఎస్‌డీ గ్రామర్ హై స్కూల్ సమీపంలో నాలా పైన ఉన్న రేలింగ్, ఫెన్సింగ్ విరిగిపోయి, ఫెన్సింగ్ పూర్తిగా పక్కనే ఉన్న పైప్ లైన్ పైన పడిపోయి ప్రమాదకరంగా మారింది. నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్ట డం లేదని విమర్శలు వస్తున్నాయి. వంతెన వద్ద నాలా రేలింగ్ విరిగిపోవడంతో ఓపెన్ గా ఉండటంవల్ల ప్రమాదకరంగా ఉందని అటుగా ప్రయాణించే వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా నిత్యం చెత్తను అక్కడ వేయడంతో నాలాలో చెత్త పడిపోయి పేరుకుపోతుంది. నాలా పైన రేలింగ్ విరిగిపోయి సంవత్సరాలు గడుస్తున్నపటికీ మరమ్మతులకు నోచుకో వడం లేదని, కంచె వేయడంతో అది కొన్ని నెలలు మాత్రమే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇదే రోడ్డులో వేల సంఖ్యలో వాహన దారులు ప్రయాణిస్తుంటారని వంతెన ఓపెన్‌గా ఉండటంతో భయపడుతూ వాహనాలు నడుపుతున్నారని, ఏ మాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా కాలువలోకి వెళ్ళే ప్రమాదం ఉంది కాబట్టి, రేలింగ్ పటిష్టంగా నిర్మించి ,కంచె ఏర్పాటు చేసి,ఇక్కడ చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడమే కాంగ్రెస్ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్ నగర్ లో ఆయన తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా మంగళవారం నియోజకవర్గ ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పలు ఆహ్వానాలు,వినతి పత్రాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు.. ఈ కార్యక్రమంలో కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. తన దష్టికి వచ్చిన నియోజకవర్గ ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు..ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



- హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే తన ప్రథమ లక్ష్యమని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని జల వాయు విహార్ కాలనీలో సుమారు రూ.48 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం , కాలనీ వాసులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీలలో ప్రజల నుంచి వచ్చిన వినతి మేరకు, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో డివిజన్ లో అత్యవసరం ఉన్న చోట, నిత్యం సమస్యలతో ఉన్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామన్నారు. ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి వస్తే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. అభివద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు.నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. హైదర్ నగర్ డివిజన్ ను అన్ని రంగాలలో అభివద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్ గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు,గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. మంగళవారం గాజులరామారం డివిజన్ పరిధి మెట్టుకాన్ గూడ రాజీవ్ గాంధీనగర్‌లో గల బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. శ్రీనివాస్,యాదిరెడ్డి,పరుష శ్రీనివాస్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, గోపాల్ యాదవ్, మంజునాథ్,గణేష్, సుందరాజు, జగన్, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ అయిన 126 సెల్ ఫోన్‌లు స్వాధీనం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెల రోజులుగా మిస్సింగ్ అయిన 126 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో 35, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 23,బాచుపల్లి పరిధిలో 18, కూకట్‌పల్లి పరిధిలో 14, సనత్ నగర్ పరిధిలో 17,అల్లాపూర్ పరిధిలో 9,జగద్గిరి గుట్ట పరిధిలో 7, బాలానగర్ పరిధిలో 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం షాపూర్ నగర్ లోని బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కే.సురేష్ కుమార్ వివరాలు వెల్లడిం చారు.ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో 126 మొబైల్ ఫోన్లు మిస్సింగ్ అయినట్టు కేసులు నమోదయ్యాయని వీటి విలువ సుమారు రూ. 28 లక్షలు ఉంటుందని వివరించారు. సెల్ ఫోన్లు బాధితు లకు అప్పగిస్తున్నట్టు తెలిపారు.సైబరాబాద్ అడిషనల్ డీసీపీ పి.సత్యనారాయణ,కూకట్‌పల్లి బాలానగర్ జోన్‌ల ఏసీపీలు.శ్రీనివాసరావు, హనుమంతరావులతోపాటు ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళా ఉద్యోగి మృతి



నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్ బజార్‌లో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం ఓ మహిళ మృతిచెందింది. వివరాల్లోకి వెళితే అల్వాల్‌కు చెందిన త్రివేణి అనే మహిళ హైటెక్ సిటీలో విధుల నిమిత్తం బయలుదేరిన సమయంలో లాల్ బజార్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ఢీకొని మరణించింది. ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. లాల్ బజార్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మూలమలుపు వద్ద బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం మూలంగానే త్రివేణి చెందినట్టు తిరుమలగిరి పోలీసులు తెలిపారు. ఘటనాస్థలికి చేరుకున్న తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. త్రివేణికి భర్త, ఇంటర్మీడియట్ చదువుతున్న కుమారుడు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

షేర్ గల్లిలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-కంటోన్మెంట్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఇజాజ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఓల్డ్ బోయిన్‌పల్లి షేర్ గల్లిలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహా యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మక్కల నర్సింగ్ కర్ర జంగయ్య సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణలో తగ్గుతున్న సంతానసాఫల్య రేటు

- పిల్లలను కనే అంశాన్ని ఆలస్యం చేయొద్దు
- నోవా ఐవీఎఫ్ ఆధ్వర్యంలో సంతాన సాఫల్య సదస్సు





నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణలో సంతానోత్పత్తి, సంతాన సాఫల్య రేటు గణనీయంగా పడిపోతోంది. జీవనశైలిలో మార్పులు, ఆలస్యంగా గర్భం దాల్చడం, పురుషుల్లో వంధ్యత్వం, జీవితంలో పెరుగుతున్న ఒత్తిడి లాంటి అంశాలు స్త్రీ పురుషుల్లో సంతానరాహిత్య రేటు పెరగడానికి కారణం అవుతున్నాయి. ఈ సమస్యలపై చర్చించేందుకు, అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ)లో ఆధునిక పరిణామాల గురించి తెలుసుకునేందుకు నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ, ద ఆబ్స్టెట్రిక్ అండ్ గైనకలాజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నగరంలోని తాజ్ కృష్ణ హోటల్‌లో మంగళవారం సంతాన సాఫల్య సదస్సు నిర్వహించారు. నగరవ్యాప్తంగా ఉన్న గైనకాలజిస్టులు, ఫెర్టిలిటీ నిపుణులు సుమారు 500 మందికి పైగా హాజరై, సమస్య లోతుల గురించి చర్చించారు.

మారుతున్న తీరు తెన్నులు

సంతానరాహిత్య కేసుల్లో తీరు తెన్నులు ఇటీవల మారుతున్నాయని బంజారాహిల్స్ నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీకి చెందిన సంతానసాఫల్య నిపుణురాలు డాక్టర్ హిమదీప్తి తెలిపారు. "ఒక దశాబ్దం క్రితం చాలా వరకు పీసీఓడీ, ఎండోమెట్రియోసిస్ ఇన్ఫెక్షన్, అండాల సంఖ్య తగినంతగా లేకపోవడం కారణాలుగా ఉండేవి. కానీ ఇప్పుడు చాలా మంది గర్భధారణను ఆలస్యం చేస్తున్నారు. మహిళలు 35-40 ఏండ్లు దాటాక గర్భధారణ ప్లాన్ చేసుకుంటున్నారు. 35 ఏండ్లు దాటాక అండం నాణ్యత, అండాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోతాయి. అయితే, ఇప్పుడు చాలా మంది ఎగ్ ఫ్రీజింగ్‌పై అవగాహన పెంచుకుంటున్నారు. మాకు ప్రతియేటా 50-100 విచారణలు దీనికోసం వస్తున్నాయి. కొన్నేండ్ల క్రితం ఈ సంఖ్య చాలా నామమాత్రంగా ఉండేది. ఇప్పుడు పెళ్లికాని యువతులు కూడా ఎగ్ ఫ్రీజింగ్ గురించి తెలుసుకోవడానికి ముందుకొస్తున్నారు" అని తెలిపారు.

పురుషుల్లో పెరుగుతున్న వంధ్యత్వం

కూకట్‌పల్లి నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీకి చెందిన డాక్టర్ సరోజ కొప్పల మాట్లాడుతూ "పురుషుల్లో వంధ్యత్వం పెరుగుతున్నా దాన్ని చాలా సందర్భాల్లో గుర్తించడం లేదు. వీర్యానికి సంబంధించిన అంశాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఊబకాయం, ధూమపానం, మద్యపానం, ఇతర జీవనశైలి కారణాల వల్ల ఇలా జరుగుతోంది. నయం చేయగలిగే కారకాలను గుర్తిస్తే పురుషులకు పిల్లల విషయంలో ఇబ్బంది ఉండదు. వాళ్లలో వంధ్యత్వం ఇక నయం చేయలేనిదిగా మారినప్పుడు ఇక అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) అవసరం అవుతుంది" అని తెలిపారు. 40 ఏండ్లు దాటిన తర్వాత పురుషుల్లో వీర్యం నాణ్యత అంతగా ఉండదనీ, అది పిల్లల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుందని ఆమె సూచించారు. వీర్యంలో అసాధారణతలు ఉన్నాయంటే ఏవో వ్యాధులు ఉన్నట్టు కూడా గుర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐజీవో కోశాధికారి డాక్టర్ శాంతకుమారి, ఓజీఎస్‌హెచ్ (ప్రసూతి, గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్) కార్యదర్శి డాక్టర్ మంజులారావు, నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ హైదరాబాద్‌లోని ఇతర ముఖ్య సంతానోత్పత్తి నిపుణులు బంజారాహిల్స్‌కు చెందిన డాక్టర్ దుర్గా వైట్ల, ఎల్బీనగర్‌కు చెందిన డాక్టర్ దివ్యారెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదు దారుడే సూత్రధారి..



- 30 గంటలలో కేసును ఛేదించిన బోయిన్‌పల్లి పోలీసులు

నవతెలంగాణ-కంటోన్మెంట్

పోలీస్ దుస్తులు ధరించిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర తనిఖీ చేస్తున్నారు. ఓ సంస్థకు చెందిన ఆఫీస్ బాయ్ అరుణ్ ఆదివారం తన బ్యాగులో తీసుకువెలుతున్న ఐదు లక్షల రూపాయల నగదు దోపిడీ కేసును బోయిన్‌పల్లి పోలీసులు ఛేదించారు. మంగళవారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, డీఐ సర్దార్ నాయక్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దోపిడీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. పోలీసులమని తనిఖీల పేరుతో తన వద్ద రూ.5లక్షలు ఇద్దరు వ్యక్తులు దోచుకెళ్లారని నిందితుడు అరుణ్ కుమార్ బెహరా ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. ఫిర్యాదు అందుకున్న సీఐ, డీఐ వెంటనే అప్రమత్తమై తమ సిబ్బందితో విచారణ ప్రారంభించారు. దోపిడీ జరిగిన ప్రాంతంలో అదేవిధంగా ఫిర్యాదారుడి కదలికలను పూర్తిస్థాయిలో గమనించగా ఫిర్యాదు దారుడే అసలు సూత్రదారి అని, ఈ దోపిడీకి అతనికి కార్యాలయంలో పనిచేసే అకౌంటెంట్ సమరేంద్ర దాస్ పూర్తి సహకారం డబ్బు కాజేశారని తమ సిబ్బంది విచారణలో తేలిందని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు ఐదు లక్షల రూపాయలు రికవరీ చేసి వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుచనున్నట్టు వెల్లడించారు. కాగా గతంలోను బోయిన్‌పల్లికి చెందిన సత్తు శ్రీనివాస్ అనే వ్యక్తి కూడా తన ఇంట్లో మూడు తులాల బంగారం, రూ.3 లక్షల, ఒక స్మార్ట్ వాచ్ దొంగతనం జరిగిందని తప్పుడు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో అసలు విషయం బయటపడడంతో అతను జైలు పాలైయ్యాడు. ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, డీఐ సర్దార్ నాయక్‌లు ఈ దోపిడీ కేసును 30 గంటలలో ఛేదించిన సిబ్బంది మురళి, రాజేష్, మనోహర్, శ్రీనివాస్, తుల్జారాంలను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

కాంగ్రెస్ నాయకుల ప్రతిజ్ఞ



నవతెలంగాణ-బంజారాహిల్స్

మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటుచేసిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీ.విజయ రెడ్డి, ఎం.పీలు, ఎమ్మెల్యేలు, కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మెన్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

దరఖాస్తు చేసుకునే వారి సమస్యలు పరిష్కరించాలి

- బీసీ నేత జాజుల లింగంగౌడ్



నవతెలంగాణ-ఓయూ

గతంలో 2017-2018లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకున్నవారు. ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తే ఆల్రెడీ అప్లైడ్ అని చూపుతుందని దీనిని సవరించి వారి సమస్య బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి విజ్ఞప్తి చేసిన బీసీ నేత లింగంగౌడ్ పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, యువజన విభాగం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుత గతంలో దరఖాస్తుదారులు నమోదు చేసిన వివరాలను అధికారులు తొలగించకపోవడం వల్ల ఆల్రెడీ అప్లైడ్ అనే సమస్య వస్తుందని దీనివల్ల నిరుద్యోగ యువత ఆందోళన చెందుతున్నారని కొత్త దరఖాస్తులు స్వీకరించని పక్షంలో లబ్ధిదారులు గతంలో చేసిన దరఖాస్తులనైనా పరిగణలోకి తీసుకోవాలని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

అన్నానగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

సీతాఫల్ మండి కార్పొరేటర్ డా. సామల హేమ అన్నా నగర్‌లో పర్యటించారు. అన్నా నగర్‌లోని నాలాను పరిశీలించి నాలాలోని పూడికను తీస్తామన్నారు. నాలాలో చెత్త వేయకూడదని స్థానికులకు సూచించారు. నాలాలో చెత్త వేయడం ద్వారా వర్షాలు కురుస్తే మళ్లీ రివర్స్‌లో మళ్లీ ఇండ్లలోకి వస్తాయని తెలిపారు. నాలాలో చెత్త వేసే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు అధికారులు, తాను ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నామని ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ సువర్ణ, ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మి, శ్రీకాంత్ సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

బీజేపీ నాయకులు మంగళవారం మూడో వార్డులోని బలంరాయి, కారనా, మడ్‌ఫోర్ట్ పలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 600 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. అధికార ప్రతినిధి బీఎన్ శ్రీనివాస్ పర్యవేక్షణ జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్య దర్శి భాగ్యమ్మ, వార్డ్ అధ్యక్షుడు అరుణ్ ఇంకా నాయకులు మధు, హరి, వినోదా అనురాధ, విజయలక్ష్మి, రేఖ, సబితా, వనిత, స్వాతి, నందిని, మహేశ్వరి, కామిని, సంగీతా, ఓంప్రకాష్, ప్రవీణ్, నీరజ్, పవన్, చంద్ర శేఖర్, షణ్ముఖ్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ లైటింగ్ మెరుగైన నిర్వహణ యాప్‌పై శిక్షణ కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలోని అన్ని స్ట్రీట్ లైట్ల నిర్వహణను సమర్థవంతంగా చేసేందుకు స్ట్రీట్ లైట్ నిర్వహణ యాప్ కీలకమైనదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని డివిజన్ల విద్యుత్ ఇంజినీర్లు, డివిజన్ ఎలక్ట్రీషియన్లు, టీ.జీ ఆన్ లైన్ ఏజెన్సీ ద్వారా స్ట్రీట్ లైటింగ్ నిర్వహణ వ్యవస్థపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. స్ట్రీట్ లైట్ నిర్వహణ సిస్టమ్ యాప్ ద్వారా విద్యుత్ మీటర్లు, సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ప్యానల్స్, లైట్లు, పోల్స్ వంటి అన్ని ఆస్తుల వివరాలను నమోదు చేసి వాటి పనితీరును ట్రాక్ చేయడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా వీధి దీపాలు పని చేయకపోతే ఆట్టి సమస్యను తక్షణమే గుర్తించి వెంటనే పరిష్కరించవచ్చని తెలిపారు. ప్రత్యేకించి లైట్ల మరమ్మతులను వేగంగా చేయడం ద్వారా నగర వాసులకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ఇంజినీర్లు, ఎలక్ట్రీషియన్లు ఈ యాప్ వినియోగంపై పూర్తి అవగాహన చేసుకొని నగరంలోని అన్ని ప్రాంతాల్లోని స్ట్రీట్ లైట్ల పరిస్థితిని సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. టీ.జీ. ఆన్ లైన్ ఏజెన్సీ ప్రతినిధులు యాప్ వాడకం విధానాన్ని ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించారు. స్ట్రీట్ లైట్ల ఆడిట్, డేటా ఎంట్రీ, మరమ్మతుల నిర్వహణ తదితర అంశాలపై విపులంగా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, జీహెచ్ఎంసీ విద్యుత్ విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు, డిప్యూటీ ఇంజినీర్‌లు, అసిస్టెంట్ ఇంజినీర్‌లు, డివిజన్ ఎలక్ట్రీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు వస్తే రాజు యాదవ్‌కు టికెట్ ఇవ్వండి

- కేబీఆర్ పార్క్ ప్రధాన కూడలి వద్ద వెలిసిన ఫ్లెక్సీలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ రాజు యాదవ్ ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీనీ గెలిపించడమే లక్ష్యంగా పని చేశారు. గత ఎన్నికల్లో దాసోజు శ్రవణ్‌కు మద్దతునిచ్చి రెండవ స్థానంలో నిలిచిన 2019-24 ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని ఖైరతాబాద్ గడ్డపైన గెలిపించాలని దృఢ సంకల్పంతో పనిచేసిన బీసీ నాయకుడు ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా పార్టీని వదలకుండా ప్రతి కార్యకర్తతో మమేకమై ప్రజల కష్టాలనూ తీర్చడానికి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పనిచేసిన రాజు యాదవ్‌కు టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ పెద్దలకూ, రాహుల్ గాంధీకి, సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కూ విజ్ఞప్తి చేస్తూ, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పట్ల హైదరాబాద్ నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల్లో చర్చలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

కొన్ని గంటల్లోనే వెలిసిన ఫ్లెక్సీ చించివేత..



కొన్ని గంటల్లోనే కుట్రతో ఫ్లెక్సీలను చించివేశారని రాజు యాదవ్ తరపు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఆరోపించారు.

సంగీత విద్వాంసుడు ఉషాకాంత్ ఇకలేరు

- నేడు జూబ్లీ హిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు, గీత రచయిత ఉషాకాంత్, మంగళవారం మధ్యాహ్నం పరమపదించారు. సాంస్కృతిక రంగంలో ఆయన స్థానం ఎంతో విశిష్టమైనది. బహుముఖ ప్రజ్ఞాశాలనీ సంగీతంలోని అనేక విభాగాల్లో తన ప్రతిభను చాటుకున్నారు.ఆయన అంత్యక్రియలు నేటి ఉదయం జూబ్లీ హిల్స్‌లోని మహాప్రస్థానంలో జరగనున్నాయి. ఉషాకాంత్ అద్భుతమైన కచేరీలలో సంగీత బ్యాలెట్లు శ్రీ దత్త గాథ, కల్యాణ రామం, గీత గోవిందం, ఆండాళ్ కళ్యాణం, సప్త చల సంకీర్తనలు ఉన్నాయి. టీటీడీ ప్రాజెక్టు పలికేది భాగవత మాత కలదు. చిలక పలుకులు (తెలుగు నర్సరీ రైమ్స్) ఎన్నో ప్రశంసలు పొందిన మ్యూజికల్ ఆల్బమ్ ఇది. ఆయన ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు. వాటిలో ఘంటసాల అవార్డు (2003), శివ గంగ (మ్యూజికల్ బ్యాలెట్), చలో-ఢిల్లీ (పిల్లల చిత్రం) కోసం జాతీయ అవార్డులు అందుకున్నారు. ఆయన కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ (అపోలో హాస్పిటల్స్‌లో సీనియర్ కన్సల్టెంట్) గాయకుడు సంగీతకర్త కూడా కోడలు డాక్టర్ సుశీల, వైద్యురాలు, నృత్యకారిణి, అల్లుడు సుందర్ లక్ష్మణ్, మహతి మ్యూజిక్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్, కూతురు రాధికా లక్ష్మణ్, గాయని, మనవరాలు రోహిణి, ఐటీ కన్సల్టెంట్, నర్తకి, గాయని, మనవడు శ్రీనిగమ్, వైద్యుడు, గాయకుడిగా ఉన్నారు.

తెలంగాణ మతసామరస్యానికి ప్రతీక



- కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపేట్

పవిత్ర రంజాన్ మాసంలో మతసామరస్యాన్ని ప్రతిబింబిస్తూ సనత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అశోక్ కాలనీలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సనత్‌నగర్ ఇంచార్జి డా. కోట నీలిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సర్వమత సమ్మేళనానికి నిలయమని, మత సామరస్యానికి రాష్ట్రం ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏ మత పండుగ అయినా తెలంగాణ ప్రజలు మతభేదాలను మరిచి, సామూహికంగా జరుపుకోవడం గొప్ప ఆనవాయితీ అని అన్నారు. మంచి విలువలు ఎక్కడ ఉన్నా స్వీకరించాలి అనే సందేశాన్ని ప్రతి మతం అందిస్తుందని పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన ముస్లిం సోదర, సోదరీమణులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు భారీగా పాల్గొన్నారు.

ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఈడీపీ



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం (ఎంబీఏ), ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విభాగం ఈ క్లాస్ రూంలో ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను నిర్వహించారు. 15 రోజుల పాటుగా ఈ అంశంపై కంపెనీ సెక్రెటరీస్ (సీఎస్), కోర్సు చేస్తున్న వారికి 10 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించినున్నట్టు విభాగం హెడ్ ప్రొ. వై.జహంగీర్ పేర్కొన్నారు. అంతకుముందు ఈ కార్యక్రమన్ని ప్రముఖ ఇండ్రస్టీలిస్ట్ వినోద్ బేగ్ ప్రారంభించారు. పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మెన్ భీమా, కార్తిక్, 40 మంది సీఎస్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి విద్యార్థి నేతలు వినతి



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో ఉద్యమాలను నిషేధిస్తూ ఓయూ యంత్రాంగం ఇచ్చిన సర్క్యులర్ రద్దు కొరకు కృషి చేయాలని కోరుతూ.. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ నేతలు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి ఎన్.సుమంత్‌లు మాట్లాడుతూ.. ఓయూలో రాజ్యాంగ విరుద్ధంగా ఇచ్చిన సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న అంశాలు సాకుగా చూపి మొత్తం విద్యార్థుల హక్కులను కాలరాసే విధంగా ఓయూ అడ్మినిస్ట్రేషన్ అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. విశ్వ విద్యాలయాలు భావ సంఘర్షణ కేంద్రాలను, విద్యార్థుల చైతన్యాన్ని నీరుగార్చే చర్యలకు పూనుకోవొద్దన్నారు. విశ్వ విద్యాలయంలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు సహజంగానే పోరాటాలు చేస్తారని తెలిపారు. విద్యార్థుల అన్ని రకాల సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించడంలో లేని అసక్తి , ఉద్యమాలను నిషేధించడంలో ఉండటం ఆవేదన కలిగిస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ అంశంలో జోక్యం చేసుకొని విద్యార్థుల రాజ్యాంగ హక్కులను కాపాడాలని పిలుపునిచ్చారు. విద్యార్థి నేతగా శాసన మండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్న మీరు సర్క్యులర్ రద్దు కొరకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నేతలు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఓయూ ప్రధాన కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

చైన్ మెన్‌లను స్థానచలనం చేయాలి

- ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ
- జీహెచ్ఎంసీ, సీసీపీని కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు



నవతెలంగాణ-కంటోన్మెంట్

జీహెచ్ఎంసీ, సీసీపీ శ్రీనివాస్‌ను దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ మంగళవారం కలిశారు. జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న చైన్‌మెన్‌లను స్థానచలనం చేయాలని, న్యాక్ ఇంజినీర్లను పూర్తిగా తొలగించాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా సికింద్రాబాద్ జోన్ పరిధిలోని సికింద్రాబాద్, బేగంపేట్ సర్కిల్‌లలో గత కొనేండ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న చైన్‌మెన్‌ల వల్ల సర్కిల్‌లు అవినీతిమయమయ్యాయని, ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలే దర్శనమిస్తున్నాయన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొంతమంది చైన్ మెన్‌లు, న్యాక్ ఇంజినీర్లు అవినీతికి పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని వారిపై ఎంక్వైరీ చేసి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని సీసీపీ శ్రీనివాస్ చెప్పినట్టు ముప్పిడి వెల్లడించారు.

బస్తీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్‌లోని సాగర్ సొసైటీలో మంగళవారం కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పర్యటించారు. బస్తీ వాసుల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా వారి కుటుంబ సభ్యులతో కలిసి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రెండు ప్రధాన సమస్యలకూ పరిష్కారం చూపాలని అందులో త్రాగునీరు, కరెంట్ సమస్య గురించి చెప్పారు. త్వరలోనే నూతన మంచి నీరు పైప్ లైన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో పాటు కరెంటు సరఫరా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సంబధిత అధికారులకు ఆదేశించారు. నూతన మంచి నీరు పైప్ లైన్ ఏర్పాట్లు చెయ్యాలని వాటర్ డిపార్ట్‌మెంట్ జీఎం హరీ శంకర్‌కి ఫోన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పైగా' స్థలంలో నిర్మాణాలకి అనుమతి ఇవ్వొద్దు

- ఉద్యమకారుడు బొట్టు ప్రభాకర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఇకముందు నియోజకవర్గంలోని మహేంద్ర హిల్స్ మారేడ్‌పల్లి పైగా స్థలంలో నిర్మాణాలు అనుమతులు మంజూరు చేయరాదని తెలంగాణ ఉద్యమ నాయకుడు బొట్టు ప్రభాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం కంటోన్మెంట్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పైగా కుటుంబీకులతో తనకు అగ్రిమెంట్ ఉందని అలాంటి భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్ట రాదని కోర్టులో తీర్పు వచ్చేలోపే సొసైటీలుగా ఏర్పడి నిర్మాణాలు పూర్తి చేశారని తెలిపారు. ఇప్పుడు తనకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందని ఉన్నారు. మునుముందు ఖాళీగా ఉన్న భూముల్లో ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవోకు, ఎమ్మార్వోకు, కంటోన్మెంట్ సీఓకు కూడా మారేడ్‌పల్లి తుకారం గేట్ పోలీసులకు కూడా విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. హైకోర్టు తీర్పు ప్రకారం తనకి న్యాయం చేయాలని కోరారు.

పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



- తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మెన్, ప్రొ. బాలకృష్ణారెడ్డికి, పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను వివరించారు. అసోసియేషన్ ప్రతినిధులు తెలంగాణలోని విశ్వవిద్యాలయాలు స్వయం ప్రతిపత్తి సంస్థల విషయాన్ని మరిచిపోయాయని, దయచేసి పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డా. సోమేశ్వర్ బోనకుర్తి, ప్రధాన కార్యదర్శి డా. ఆరుట్ల జానకి రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు డా. జూలు నాగేశ్వర్, డా. బానోతు శంకర్, ఉపాధ్యక్షులు డా. యుగేందర్ నాతి, డా. విష్ణు భూపతి, డా. సుందర్, కార్యదర్శి డా. జీవన్, డా. ప్రకాష్, డాక్టర్ చీకట్ల శ్రీనివాస్, డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

-జిల్లా ఉపాధి అధికారి వందన

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రయివేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించుటకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఏ.వందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 26న హైదరాబాద్ మల్లెపల్లి ప్రభుత్వ ఐటీఐలోని జిల్లా ఉపాధి కార్యాలయం నందు వైఎస్ఎఫ్ స్కిల్స్ కంపెనీలలో 100 ఖాళీలకు గాను ఉదయం 10.00 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. 8వ తరగతి నుంచి 10 తరగతి పాస్ లేదా ఫెయిల్, ఐటీఐ, డిగ్రీ విద్యర్హతలు గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరు కావాలని ఆమె తెలిపారు. ఇతర వివరాలకు ఎంప్లాయిమెంట్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎంప్లాయిమెంట్.తెలంగాణ.గౌ.ఇన్ నందు లేదా ఫోన్ నంబర్ 8328428933 సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

చేనేత కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఇందిర

నవతెలంగాణ-సిటీబ్యూరో

చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు వి.ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం ఆగస్టు 7న సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డులను ప్రదానం చేయుటకుగాను అర్హతలు కలిగిన చేనేత కళాకారుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తుందనీ, కళాకారులు డిసెంబర్ 31, 2024 నాటికి 30 ఏండ్ల వయసు నుంచి పదేండ్ల అనుభవం ఉండాలన్నారు. చేనేత డిజైనర్లు 25 ఏండ్ల వయసు నుంచి అయిదేండ్ల అనుభవం ఉండాలనీ, అవార్డు కోసం ఏప్రిల్ 15 లోగా సహాయ సంచాలకులు, చేనేత, జౌళి శాఖ హైదరాబాద్ గారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆమె తెలిపారు.

'ఆశా'ల అక్రమ అరెస్టులను ఖండించండి

- ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు చెల్లించాలి
- పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్
- కుషాయిగూడ నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

కోఠి కమిషనర్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టును ఖండిస్తూ మంగళవారం కుషాయిగూడ నుంచి ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు వరకు కుషాయిగూడ పీహెచ్‌సీ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులకు రూ.24వేల జీతం, రోజుకు రూ.2వేల అలవెన్స్, ఇతర సౌకర్యాలు పెంచారనీ, పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.175 చాలు అని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. రాజ్యాంగ ప్రకారం ధర్నా చేయడానికి ప్రతి కార్మికుడికీ హక్కు ఉందన్నారు. రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం పక్కన పెడుతుందనీ, ఇది ప్రజాస్వామ్యానికి హానికరమనీ, ఇదే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందనీ, ఈ వైఖరిని ప్రభుత్వాలు మార్చుకోకపోతే రాబోయే కాలంలో పుట్టగతులు ఉండదని హెచ్చరించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి మాట్లాడుతూ కోఠి కమిషనర్ ఆఫీస్ వద్ద ర్యాలీగా వెళ్తున్న ఆశాలను అరెస్టు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. సంఘం పెట్టుకోవటానికి హక్కు ఉంది, పోరాటం చేసే హక్కు ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామనీ, దొరల పాలన తొలగించి ప్రజాపాలన అని చెబుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్బంధాలే కొనసాగిస్తుందన్నారు. ఆశా కార్మికులకు ఫిక్స్‌డ్ వేతనం అడగడం నేరమా..? అని ప్రశ్నించారు. కార్మికులుగా గుర్తించాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, యూనిఫామ్, పెన్షన్ ఇవ్వాలన్నారు. పని భారం తగ్గించాలని అడగడం నేరమేనా..? అని ప్రశ్నించారు. పోలీసులు ఆశా వర్కర్‌ను కడుపులో గుద్దడం వేళ్ళను, చేతులు, కాలు, తిప్పడం లాంటి దుర్మార్గమైన చర్యలు మానవ హక్కుల ఉల్లంఘన అని చెప్పారు. ఈ ర్యాలీ అనంతరం జరిగిన సభకు కుషాయిగూడ పీహెచ్‌సీ నాయకురాలు ప్రవీణ అధ్యక్షత వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా..? ఎన్ని అరెస్టులు చేసినా..? చలో కమిషనరేట్‌ను విజయవంతం చేసిన ఆశాలకు ధన్యవాదాలు తెలిపారు. ఆశా వర్కర్లను అరెస్టు చేసి వేసుకున్న దుస్తులు మార్చుకోవడానికి సమయం ఇవ్వకుండా పోలీస్ స్టేషన్‌కి తరలించడం సిగ్గు చేటు అన్నారు. ఈ ర్యాలీలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాస్, జిల్లా కోశాధికారి కె.ఉన్ని కృష్ణన్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు ప్రవీణ, రాద, యాదమ్మ, లత, మమత, తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడలో రసాయన పదార్థాలు పేలిన చోట ఉత్కంఠ

నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ పారిశ్రామికవాడలో మూడు రోజుల క్రితం రసాయన పదార్థాలు పేలిన చెత్త కుప్పను తొలగించేందుకు మంగళవారం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. చెత్తను తీసే క్రమంలో రసాయన పదార్థాలు పేలే అవకాశం ఉన్నందున జాగ్రత్త చర్యలు పాటిస్తూ చెత్తను తీసేందుకు సన్నాహాలు చేశారు. పోలీసు, ఫైర్, బాంబ్స్ స్క్వాడ్, క్లూస్ టీమ్, ఇండస్ట్రియల్ సేఫ్టీ టీం, టీఎస్ఐఐసీ అధికారులు రంగంలో దిగాయి. సంఘటన స్థలాన్ని ఏసీపీ మహేష్, కుషాయిగూడ సీఐ భాస్కర్ రెడ్డి సందర్శించారు.

హైదరాబాద్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దాలి

- ప్రభుత్వ పథకాలు వికలాంగులకు అందేలా నిరంతర పర్యవేక్షణ చేయాలి
- వికలాంగులు, మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేలా చూడాలి
- జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ యోగేష్ దూబే



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించి హైదరాబాద్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ యోగేష్ దూబే అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, వికలాంగుల సంక్షేమ శాఖ, ఉపాధి కల్పన, లీడ్ బ్యాంక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ అధికారులతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జావిద్ అక్తార్‌లతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, వికలాంగులు అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పించాన్నారు. హైదరాబాద్ జిల్లా సంక్షేమ పథకాల అమలులో ముందంజలో ఉందనీ, జిల్లా యంత్రాంగాన్ని అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేస్తూ హైదరాబాద్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించుటలో ఉపాధి కల్పన శాఖ ముఖ్య భూమిక పోషించాలని, ముఖ్యంగా యువతకు శిక్షణ కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ మార్గదర్శకాల ద్వారా జాబ్ మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అదేవిధంగా బ్యాంక్ లు ముద్ర, పీఎం, ఈజీపీ, స్టాండప్ ఇండియా పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి రుణాలు అందించి ఆర్థిక చేయూత కల్పించాలన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల ప్రతిభను అభినందిస్తు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్మిక శాఖ ద్వారా ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు సౌకర్యం కల్పించి లబ్ది చేకూరే విధంగా ప్రత్యేక కృషి చేయాలని ఆయన తెలిపారు. వలస కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. సంరక్షణ దిశగా భరోసా, సఖి కేంద్రాల ద్వారా వారి సమస్యలకు సంబంధించిన కేసులను ప్రత్యేక దృష్టి సారించి అనుబంధ శాఖల అధికారులు పరిష్కరించాలన్నారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులకు అవగాహన కల్పిస్తూ వారి సమస్యలకు ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి పరిష్కారాలు చూపాలని అదేవిదంగా అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య కార్డులు జారీ చేయాలని వారికి సంబంధించిన కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆయన తెలిపారు. చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లో సూచనల బాక్స్ పెట్టాలని సూచించారు. సఖి కేంద్రాలను సందర్శించాలని తెలిపారు. వివిధ శాఖల ద్వారా మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీడబ్ల్యూవో అక్కేశ్వరరావు, ఎల్డీఎం సుబ్రహ్మణ్యం, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆశన్న, డీటీడబ్ల్యూ ఓ.కోటాజీ, డీసీపీ లావణ్య నాయక్, వయోవృద్ధుల శాఖ ఏడీ రాజేందర్, ఉపాధి కల్పన అధికారి ఎ.వందన, కార్మిక శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, డీసీపీవో శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఐఎస్ఎస్'లో కేంబ్రిడ్జి ప్రైమరీ పాఠ్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ స్థాయి విద్యపై పెరుగుతున్న డిమాండ్‌కు స్పందనగా, సికింద్రాబాద్‌లోని అల్వాల్‌లో ఉన్న ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ సికింద్రాబాద్ (ఐఎస్ఎస్), క్రిమ్సన్ స్కూల్స్ నెట్‌వర్క్‌కు చెందిన ఒక భాగంగా, ఈ ఏడాది జూన్ నుంచి మొదటి, రెండో తరగతుల విద్యార్థుల కోసం కేంబ్రిడ్జి ప్రైమరీ పాఠ్యక్రమాన్ని ప్రవేశపెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా 160 కంటే ఎక్కువ దేశాల్లో అమలులో ఉన్న ఈ పాఠ్యక్రమం విశ్లేషణాత్మక ఆలోచన, సజనాత్మకత, సబ్జెక్ట్‌లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అనువైన, నిర్మిత దృక్పథాన్ని అందిస్తుంది. ఈ సందర్భంగా క్రిమ్సన్ స్కూల్స్ సీఈవో హుస్సేన్ దోహద్వాలా మాట్లాడుతూ "అంతర్జాతీయ విద్య అనేది కేవలం విద్యాపరమైన విషయాలకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థి మొత్తం అభివృద్ధిని దృష్టిలో ఉంచాలి. కేంబ్రిడ్జి ప్రైమరీ పాఠ్యక్రమం ప్రాథమిక దశల నుంచి శాస్త్రీయ అభివృద్ధి దిశగా విద్యార్థులను నడిపిస్తుంది. ఇది మేధస్సు, భాష, సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు విషయ నైపుణ్యాన్ని కూడా పెంపొందించగలదు. ఇది నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020లో పేర్కొన్న ప్రాథమిక అక్షరాస్యత, అంకగణితంపై, నైపుణ్యాల ఆధారిత విద్యపై ఉన్న దృష్టిని అనుసరిస్తుంది. ఆటల ఆధారిత ఉపాధి విధానాలను మిళితం చేస్తూ, ఈ పాఠ్యక్రమం విద్యార్థులను ఉన్నత తరగతుల కోసం సిద్ధం చేస్తుంది. స్టెమ్, ప్రదర్శన కళలు, ప్రత్యేక క్రీడల శిక్షణ వంటి అదనపు కార్యక్రమాలతో విద్య అనుభవాన్ని మరింత సమృద్ధిగా చేస్తుంది" అని చెప్పారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మల్లారెడ్డి, వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ -శామీర్‌పేట

శామీర్ పేట్ మండల కేంద్రంలోని జామ మస్జిద్‌లో ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకుర మల్లారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి నమాజ్ చేశారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు ముజీబ్, చాంద్ పాషా, అఫ్జల్ ఖాన్, నాయకులు వంగ వెంకట్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మెన్ ఐలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచారు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ - కూకట్‌పల్లి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ముస్లిం పవిత్ర పండుగకు రంజాన్ తోఫా, హిమాములకు బట్టలను అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మంగళవారం శేలిరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ఎర్రబెల్లి సతీష్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ ముస్లిం మైనారిటీలకు రంజాన్ తోఫా అందివ్వకుండా, కనీసం తాగడానికి నీళ్ల లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ముస్లింల పండగలకు బట్టలను పంపిణీ చేసి ఇమాములకు రూ.10వేలు అందించి వారికి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కనబడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పై దృష్టి సారించాలన్నారు.

లైంగికదాడి నిందితుడిని శిక్షించాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎం.ఎం.టీ.ఎస్ రైలులో ఈ నెల 22న రాత్రి మహిళా బోగీలో ప్రయాణిస్తున్న యువతిపై లైంగికదాడికి యత్నించి ఆమెను గాయపరచిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ. పద్మ,వై.వరలక్ష్మి,సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో రోజు రోజుకూ మహిళలపై దాడులు, లైంగికదాడులు పెరిగిపోతున్నాయన్నారు. తాజా ఘటన మహిళలు ఎంత ప్రమాదంలో ఉన్నారో తెలియచేస్తోందని చెప్పారు. రైళ్లలో సెక్యూరిటీ గార్డులు తగినంత మంది ఉండేలా,సీ సీ కెమెరాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధితురాలికి అవసరమైన పూర్తి వైద్య సౌకర్యాలు ప్రభుత్వం అందించాలని, ఆమెకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, నగర నాయకులు పీ.విమల, షాబాన, సువర్ణ,భవాని,శారద,అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం హైమత్ నగర్‌లో స్థానిక ప్రజలతో కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ కలిసి పర్యటించి లోప్రెషర్‌తో మంచి నీరు సరఫరా రావడంతో వేసవికాలంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుండటం గమనించి వెంటనే సంబంధిత అధికారులకు సిబ్బందికి తెలియజేసి సత్వరమే సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగు సతీష్ గౌడ్, మహేష్ ముదిరాజ్ , బాలరాజు గౌడ్, అజార్, పాషా, సంతోష్ చారి, నిర్మల, మాధవి, జ్యోతి, సరిత, సుశీల చాంద్, వెంకటయ్య, అన్వర్ అజీమ్, సుల్తానా, యనుస్ తదితరులు పాల్గొన్నారు.



ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి

- అక్రమ అరెస్టులను ఖండించండి
- సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేష్
- గోల్కొండ చౌరస్తా వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నిరసన





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం. వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం చేపట్టిన ఛలో కమిషనర్ కార్యాలయం సందర్భంగా ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ.. మంగళవారం ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తా వద్ద సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగిస్తున్నామని అంటున్నారనీ, మహిళలైనా ఆశా వర్కర్లను అర్ధరాత్రి పూట అరెస్టు చేయడమేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు. ఆశా వర్కర్లపైన ప్రభుత్వం నిర్బంధాన్ని వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. కమిషనర్ కార్యాలయం వద్ద ప్రభుత్వం, పోలీసుల నిర్బంధ చర్యల వలన అనేకమంది ఆశా వర్కర్లకు గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలని చూడకుండా ఈడ్చుకెళ్లి పోలీసు వ్యాన్లలో పడేసారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆశా వర్కర్లకు న్యాయం చేస్తామని చెప్పిన హామీ ఏమైందని వెంకటేష్ ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం రూ.18వేలు ఇస్తూ నిర్ణయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు పనికి తగ్గ పారితోషకం పేరుతో వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పారితోషికం రూ.9,750తో ఒక కుటుంబం ఎలా బతుకుతుందని ఆలోచన చేయాలన్నారు. గత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల ఏమైనా సమస్యలు పరిష్కారం చేయకుండా పోలీసులతో అణిచివేయాలని చూస్తే వారి పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఎం. వెంకటేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర ఆఫీస్ బేరర్స్ సి.మల్లేష్, జి. రాములు, ఆర్.అశోక్, నగర నాయకులు పి.మల్లేష్, కె.రమావేణి, ఆశా నాయకులు రమ, సారా బాబు, సంధ్య, శివ లీల, నవనీత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు..

తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ డా.బండా ప్రకాష్ ముదిరాజ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలో విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న ముదిరాజ్ కులస్తుల ప్రయోజనాలే లక్ష్యంగా ఒక ప్రణాళికతో ముందడుగు వేద్దామని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ డా.బండా ప్రకాష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదర్‌గూడలోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో లాల్ దర్వాజా ప్రాంత ముదిరాజ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండా ప్రకాష్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకుని అన్ని రంగాల్లో ముదిరాజ్‌లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. త్వరలో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి లాల్ దర్వాజా ప్రాంతంలోని ముదిరాజ్ ల సమస్యలపై చర్చిచేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో లాల్ దర్వాజా ప్రాంతా ముదిరాజ్ నాయకులు విజయ్ కుమార్, జగదీష్, సుధా కర్, ధర్మవీర్, సదా, అనిల్ కుమార్, సురేందర్, సతీష్, కైలాష్, నవీన్, పోసాని అశ్విన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

హమాలీ కార్మికులకు సమగ్ర భద్రతతో కూడిన సం క్షేమ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్, తెలంగాణ ప్రగతి శీల హమాలీ, మిల్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్‌ల విలీనసభ విద్యా నగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగింది. ఈ సభకు ఎం. శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అవసరమైన సమస్త వస్తువులను ఎగుమతి, దిగుమతులు చేస్తున్న హమాలీ కార్మికుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. హమాలీ కార్మికులందరికీ లేబర్ కార్డులు ఇవ్వాలని, 55 సంవత్సరాలు నిండిన ప్రతి హమాలీ కార్మికుడికి రూ.5వేల పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యం కింద రూ.10 లక్షలు చెల్లించాలని పని స్థలాల్లో క్షతగాత్రులైన కార్మికులకు పూర్తి వైద్య సౌకర్యం యాజమాన్యమే కల్పించి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ విలీన సభలో ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, అనురాధ, హమాలీ యూ నియన్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కొక్కు సారంగపాణి, శివారపు శ్రీధర్, రాష్ట్ర నాయ కులు ఇంద్ర సేనారెడ్డి ముందుగా ఐఎఫ్టియు జెండాను హమాలీ ఫెడరే షన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. శివకుమార్ ఆవిష్కరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా కొక్కు సారంగపాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శివకుమార్, ఉపాధ్యక్షులుగా బి. వెంకటనారాయణ, బి. రమేష్, కె. సైదులు, రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా శివారపు శ్రీధర్, సహాయ కార్యదర్శులుగా డి. శ్రీశైలం, రేగు శ్రీశైలం, పోలు లింగయ్య, కోశాధికారిగా ఎం. మోహన్‌తో పాటు మరో 16 మంది కార్య వర్గ సభ్యులను ఏకగ్రీవంగా సభ ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికైన నూతన కమిటీని ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ ఏఐసీసీ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగ్గా కలిసి శాలువాతో సత్కరించిన పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, ఖైరతాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం హామీ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఈ అసెంబ్లీ సమావేశాలనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్, అసెంబ్లీ ఆవరణలో మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వీ.ఎస్.బోస్, ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేసి, గత నెలలో జరిగిన చర్చల్లో ఏప్రిల్ నెలలో ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం, ఇంధన చార్జీల పెంపునకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచడం, రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, కొత్త ఆటో పర్మిట్ల మంజూరు, రాష్ట్ర ప్రభుత్వమే రవాణా యాప్ ఏర్పాటు, స్కూల్ వ్యాన్లు, ఓలా, రాపిడో, ఉబర్ ద్విచక్ర వాహనాలు, ఇతర జిల్లాల ఆటోలను నిషేధించడం వంటి ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బి.వెంకటేశం విజ్ఞప్తి చేశారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నయాపూల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ కే.శారద



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కుష్టు వ్యాధి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నయాపూల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ కే.శారద అన్నారు. మంగళవారం నయాపూల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. లెప్రసీ సర్వే కొనసాగుతుందని తెలిపారు. లెప్రసీ వ్యాధి మైక్రో బాక్టీరియాలేప్రీ అనే సూక్ష్మక్రిముల ద్వారా సంక్రమించే వ్యాధి అన్నారు. వ్యాధి గ్రస్తులకు శరీరం పాలిపోయి రాగి రంగు మచ్చలు, స్పర్శ లేకపోవడం, పాదాలు, చేతివేళ్ల తిమ్మిర్లు వంటి లక్షణాలుంటాయన్నారు. బహుళ ఔషధ చికిత్స ద్వారా వ్యాధిని అరికట్టవచ్చన్నారు. ఎండలు రోజు రోజుకు ఎక్కువగా అవుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి బుధ, శనివారాల్లో చిన్న పిల్లలకు టీకాలు అందిస్తున్నామని తమ ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్ష లను ఉచితంగా చేస్తున్నామన్నారు. బీపీ. షుగర్, థైరాయిడ్ లాంటి వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని తమ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 50వేల జనాభా ఉందన్నారు. గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సుష్మ, ఏఎన్ఎంలు సంగీత, పార్వతి సువర్ణ, ఫార్మసిస్ట్ సుజాత, డీఈఓ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

దంతాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి డెంటల్ డాక్టర్ ఉషశ్రీ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

దంతాల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి డెంటల్ డాక్టర్ ఉషశ్రీ అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో ఆమె మాట్లాడుతూ.. వేసవికాలంలో కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్ తీసుకోవడం వల్ల దంతాలు పుచ్చుపళ్ళుగా మారుతాయని తెలిపారు. కార్బోహైడ్రేట్ డ్రింక్స్ తీసుకోవడం వల్ల షుగర్ లెవెల్స్ పెరుగుతాయని దీంతో దంతాలు సమస్య ఏర్పడుతుందన్నారు. దంత సమస్యలతో ఇబ్బందులు పడే రోగులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంటి నొప్పి, చిగుళ్ల నొప్పి అనేవి కూడా ఎక్కువగా బాధిస్తూ ఉంటాయన్నారు. దంతాల నొప్పి, చిగుళ్ల నొప్పి సమస్యలకు వీలైనంత వరకు వంటింటి చిట్కాలే ఉపశమనాన్ని ఇస్తాయని తెలిపారు. ఒకవేళ మరీ భరించలేనంత నొప్పి కలిగితే తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. చిగుళ్ల వాపు, వంటి సమస్య జటిలమైనప్పుడు వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. నాంపల్లి ఏరియా ఆసత్రిలో దంతాల సమస్యలకు ఆధునిక వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ క్రాంతి కిరణ్, డెంటల్ డాక్టర్ రేవంత్ వ్యాస్, తదితరులున్నారు.

ఆర్.కృష్ణయ్య బీసీ నాయకుడా..బీజేపీ నాయకుడా?

- ఐక్య బీసీ సంఘాల నేతలు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఆర్.కృష్ణయ్య బీసీ నాయకుడా.. బీజేపీ నాయకుడా అని ఐక్య బీసీ సంఘాల నేతలు ఆరోపించారు. గత నాలుగు దశాబ్దాలుగా బీసీ నేతగా చెప్పుకుంటూ బీసీ ఉద్యమాలు చేస్తున్నానని చెప్పుకుంటూ, అగ్రకుల ప్రభుత్వా లతో కొట్లాడకుండా బీసీ ఉద్యమాలను తాకట్టుపెట్టి, నేటి వరకు పార్టీల పంచన చేరుతూ పదవులు పొందిన ఘనత బీజేపీ రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యకే దక్కిందని, అందుకే ఆయన త్యాగ కృష్ణయ్య కాదని ఆయన రాజీ కృష్ణయ్య అని ఐక్య బీసీ సంఘాల నేతలు ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తదితరులు మాట్లాడుతూ దొంగే దొంగ దొంగ అరిచినట్లు బీసీ ఉద్యమాలను అను నిత్యం తాకట్టుపెట్టిన వారే బీసీల కోసం నిజాయితీగా పని చేసున్న వారిని దొంగలుగా చిత్రీకరించాలని చూస్తున్నారని, ఇప్పటి వరకు టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ ఇప్పుడు బీజేపీ నాలుగు పార్టీలు మారి నాలుగు పదవుల లబ్ధి పొందిన కృష్ణయ్య ఇప్పుడు బీసీ వాదానికి నేనే పేటెంట్ అంటూ నీతులు వల్లించడం సిగ్గుచేటన్నారు. నిజాయితీగా గత మూడు దశాబ్దాలుగా ఎత్తిన జెండా దించకుండా, బీసీ వాదంతోటే నికార్సిగా పోరాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్‌పై ఆర్.కృష్ణయ్య తన అనుచరులను ఉసిగొలిపి అసభ్య పదజాలంతో వ్యక్తి గతంగా దూషిస్తూ రాళ్లతో కొట్టి చంపుతామని మాఫియాలతో చంపిస్తాం అంటూ బహిరంగంగా మాట్లాడుతున్నారని, దీంతో గత్యంతరం లేక బీసీ సమాజానికి ఆర్.కృష్ణయ్య చేస్తున్న ద్రోహాన్ని తప్పనిసరిగా బయట పెట్టాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు రావులకోల్ నరేష్ ప్రజాపతి, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా.నరసింహ నాయక్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మాదేశి రాజేందర్, నాయకులు నాగరాజు గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు 'డబుల్' ఇండ్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటీ



నవతెలంగాణ-ముషీరాబాద్

రజకులకు డబుల్ బెడ్ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటి అధ్యక్ష కార్యదర్శులు చారకొండ వెంకటస్వామి, మరియాల గోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తా నగర కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చారకొండ వెంకటస్వామి మరియల గోపాల్ హాజరై మాట్లడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కామరెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చినటువంటి హామీలు అమలు చేయాలని, చేతివృత్తి దారులకు రూ. 20వేల కోట్లు కేటాయించి ఉచిత విద్యుత్తు పథకంలో భాగంగా బిల్లులు పేరుకుపోయాయని ఆ బిల్లులు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. రజకులు రక్షణ చట్టం చేయాలని హైదరాబాద్ నగరంలో ఉన్నటువంటి రజకులకు డబుల్ బెడ్ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని రజకులకు మోపెడు వాహనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లొంక్య సోమయ్య,పి భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శిలు రాపర్తి ప్రభాకర్, కేశవ రాజు యాదగిరి,అల్వాల బాబు, జిల్లా సోషల్ మీడియా సి హెచ్. నాగేష్ జిల్లా కమిటీ సభ్యులు పి.రాజు, ఆర్.తిరుపతి, కే. మంగయ్య, కేశవులు, ఈ లక్ష్మయ్య, తదిరులు పాల్గొన్నారు.

ఎంపీల వేతనాల పెంపుదలను ప్రజలు హర్షించరు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎంపీల వేతనాల పెంపుదలను ప్రజలు హర్షించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు వారి జీతాల పెంపుదలను కోరితే ప్రభుత్వాలు కాలయాపన చేసి తర్వాత కమీషన్ లేక కమిటీల పేరుతో మరింత కాలయాపన చేస్తూ వేతనాలు నిర్ణయిస్తారని, కానీ ఎంపీల వేతనాల పెంపుదలకు ఏలాంటి కమిటీ, కమీషన్ లేకుండానే వారి జీతాలు అమాంతం కొండంత పెంచేసుకున్నారన్నారన్నారు. కార్మికులు, ఉద్యోగస్తులు వారికి పెరిగిన జీతాలను వెనుక తేదీ నుండి అమలు చేయమంటే డబ్బులు లేవని, లేక గత బడ్జెట్‌లో ఏలాంటి కేటాయింపులు జీతాల కొరకు చేయలేదని మాటలతో మభ్యపెడతారని, కానీ దేశ ప్రజలకు తెలిసినంత వరకు ఎంపీల జీతభత్యాలు పెంపుదలకు 2023-24, 2024-25 బడ్జెట్‌లలో కేటాయింపులు చేసినట్లు గా ఏలాంటి దాఖలాలు లేవన్నారు. అయినా ఎంపీలు వారి పెరిగిన జీత భత్యాలు 2023 ఏప్రిల్ నుంచి పొందడానికి తీర్మానం ఏకగ్రీవంగా చేసుకున్నట్లు తెలుస్తుందన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి విడతల వారీగా శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ లో పర్యటించి స్థానిక బస్తీవాసులతో డివిజన్ లో ఉన్న పెండింగ్ పనులు నూతనంగా చేపట్టివ్వాల్సిన పనులు విద్యుత్ సమస్య, లో ప్రెషర్ వాటర్ సమస్యపై అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులతో పాటు స్థానిక బస్తీ ప్రజలు కూడా సహకరించాలని అదేవిధంగా నూతనంగా నిర్మించనున్న ఆలయాన్ని కూడా తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రామారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ ఆరెకటిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కాచిగూడ ఆరెకటిక సంఘానికి ఎన్నికలను నిర్వహించాలని ట్రస్ట్ నాయకులకు వినతి పత్రం అందజేశారు. 33 సంవత్సరాలుగా ఎన్నికలు జరగని కాచిగూడ ఆరెక టిక సంఘానికి ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామని తెలంగాణ ఆరెకటిక ట్రస్ట్ స్పష్టత ఇచ్చింది. కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కాచిగూడ ఆరెకటిక సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ ఆరెకటిక ట్రస్ట్ చైర్మెన్ నర్సింగ్ రావు, వైస్ చైర్మెన్ నేతికర రవి, శ్రీనివాస్‌లకు కాచిగూడ ఆరెకటిక సంఘానికి ఎన్ని కలు నిర్వహించాలని కాచిగూడ ఆరెకటిక సంఘం నాయకులకు జీ. సంజయ్ రాజ్, పవన్‌రాజ్, జి.అశోక్, డి.ఉదయ్ కుమార్ జి.గోవిందరాజులు ట్రస్ట్ నాయకులకు వినతి పత్రం అందజేశారు. త్వరలోనే కాచిగూడ ఆరెకటిక సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

సబర్మతి నగర్ బస్తీలో నూతన పైప్‌లైన్ పనుల పరిశీలన

- కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతి నగర్ బస్తీలో ఇటీవల ప్రారంభమైన నూతన మంచినీటి పైప్‌లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ బీజేపీ నేతలు, బస్తీవాసులతో కలిసి పర్యవేక్షించారు. పనులను త్వరగతిన పూర్తి చేయాలని రానున్న రంజాన్, ఉగాది పండుగల లోపే బస్తీవాసులకు మంచినీటి సరఫరా అందించే విధంగా చూడాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్ నాయకులు డి. కుమార్, ఆనంద్ రావు,సాయి కుమార్, నీరజ్, బస్తీ వాసులు నర్సింగ్ రావు,లక్ష్మణ్, ధనరాజ్,చందు, తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు నాలా పూడికతీత పనులు చేపట్టాలి

- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోరక్ నాథ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఎప్పటికప్పుడు నాలా పూడికతీత పనులు చేపట్టాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోరక్‌నాథ్ అన్నారు. మం గళవారం ముషీరాబాద్ డివిజన్ 44 బస్ స్టాప్ గంగపుత్ర కాలనీ సమీపంలో కచ్చా మోరీ నిండి మురుగునీరు పొంగి పొల్లడంతో గత మూడు రోజుల నుంచి వాహనాదారులకు, స్కూల్‌కి వెళ్లే పిల్లలకి ఇబ్బందికరంగా మారడంతో ఈ సమస్యను వెంటనే జీహెచ్ఎంసీ అధికారి ఏరియా ఇన్‌స్పెక్టర్ దాసుకి స్థానిక బీఆర్ఎస్ నాయకుడు పూస గోరఖ్నాథ్ చెప్పడంతో సమస్యను పరిష్కరించడం జరిగింది. నాలా పూడికతీత పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని అధికారులను కోరారు.

జై భీం జై బాపు జై సవిధాన్..



నవతెలంగాణ-ధూల్‌పేట్

గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో జై భీం జై బాపు జై సవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గోషామహల్ ఏ బ్లాక్ అధ్యక్షులు శ్యామ్ సింగ్, సేవాదళ్ గోషామహల్ అధ్యక్షులు మనోజ్ సింగ్, గోషామహల్ డివిజన్ అధ్యక్షులు బబ్లూ సింగ్, గన్‌ఫౌండ్రీ డివిజన్ అధ్యక్షులు పి చంద్ర మోహన్ యాదవ్, ఏ బ్లాక్ జనరల్ సెక్రటరీ సి కిషన్ లాల్, జీహెచ్ఎంసీ ఎస్సి సెల్ కె రాధా కృష్ణ, ముంద్రాయి శ్రీనివాస్, రంజీత్ సింగ్, ఠాకూర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..



నవతెలంగాణ-ధూల్ పేట్

పాతబస్తీ చార్మినార్ ముసాబౌళిలో ఏఐసీసీ కార్యదర్శి ముజాబుల్ షరీఫ్ నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి, సలహాదారుడు షబ్బీర్ అలీ, చైర్మెన్ గోపి శెట్టి నిరంజన్, మెట్టు సాయి, సీనియర్ నాయకులుతో వైఎస్ఆర్‌సీపీ చార్మినార్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తిరుపతి శ్రీనివాస్ తదితరులు..

బాధ్యతల్లోనే కాదు.. ఆటల్లోనూ రాణిస్తాం



'ఒకటే గమనం ఒకటే గమ్యం.. గెలుపు పొందె వరకూ అలుపు లేదు మనకు.. బ్రతుకు అంటే గెలుపూ గెలుపు కొరకే బ్రతుకు.... అంటూ సాగే ఈ పాటకు ప్రతిరూపమే ఈ రోజు మనం మాట్లాడుకునేది. పట్టుదలతో ఏ పనిచేసినా అందులో రాణించొచ్చుననే సందేశం ఈ పాటలోని స్ఫూర్తి. మహిళా అధికారులైన మద్దా బేబి సరోజని, సహదేవ సత్యవతిలకు ఇది అచ్చంగా సరిపోతుంది. ఎలాంటి క్రీడానుభవం లేని వీరిద్దరూ తామే సొంతంగా, కోచ్‌లు లేకుండా ప్రాక్టీస్‌చేసి ఆలిండియా స్థాయిలో పోటీల్లో పాల్గొని జయకేతనం ఎగరేశారు. ఓ వైపు కీలకమైన బాధ్యతల్లో విధులు నిర్వహిస్తూ మరోవైపు క్రీడారంగంలో రాణిస్తూ మంచి పేరు ప్రఖ్యాతులు గడిస్తున్నారు. ఐదు పదుల వయసులోనూ క్రీడల్లో దూసుకుపోతూ నేటి యువతరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్న వారి పరిచయం నేటి మానవిలో...

ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో మద్దా బేబి సరోజని మైనార్టీస్ విభాగంలో అసిస్టెంట్ సెక్రటరీగానూ, సహదేవ సత్యవతి జనరల్ అడ్మినిస్ట్రేషన్(జిఎడి) విభాగంలో సెక్షన్ ఆఫీసర్లుగా కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనెల 16 నుంచి 20 వరకూ న్యూఢిల్లీలోని త్యాగరాజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆలిండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో వీరిద్దరి జంట మహిళల డబుల్స్ వెటరన్ విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్లో మహారాష్ట్ర జట్టును మట్టి కరిపించింది. వ్యక్తిగత విభాగంలో మద్దా బేబి సరోజని రెండు కాంస్య పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయం తరపున పతకాలు సాధించిన ఘనత వీరికే దక్కింది.

గతంలోనూ విజయాలు

2018లో సెప్టెంబర్ 24 నుంచి 29వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ టెన్నిస్ టోర్నమెంట్‌లోనూ వీరిద్దరూ పాల్గొని మధ్యప్రదేశ్ క్రీడాకారులపై 3–0 తేడాతో గెలిచి బంగారు పతకాలు సాధించారు. 2018 హర్యానా పంచకూట్‌లో, 2020 పూణేలో నిర్వహించిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో బంగారు, వెండి పతకాలు సాధించారు. ఎం.బేబీ సరోజని వ్యక్తిగత విభాగంలో 2018లో బ్రాంజ్‌మెడల్ సాధించారు. ఇప్పటి వరకూ ఎపి సచివాలయం తరపున టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొని బంగారు, వెండి కాంస్య పతకాలు సాధించిన ఘనత వీరికే దక్కింది. ఇప్పటివరకూ వ్యక్తిగతంగా బేబీ సరోజని మొత్తం 8 పతకాలను కైవసం చేసుకున్నారు. 2018లో కాంస్యం 1, బంగారం 1, 2019లో డబుల్స్‌లో బంగారం, వ్యక్తిగతంగా బంగారం, 2020, 2021, 2022లో డబుల్స్‌లో సిల్వర్, 2024లో డబుల్స్‌లో కాంస్య పతకాన్ని అందుకున్నారు. పట్టుదలతో ఎలాంటి కోచింగ్ లేకుండా, వారంతట వారే మెళకువలు నేర్చుకుని ఇతరుల ఆటలను గమనిస్తూ ప్రావీణ్యాన్ని సాధించారు వీరు. మనదేశంలోనే కాకుండా బ్రెజిల్, చైనా, స్వీడన్ దేశాల్లో జరిగిన వెటరన్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనటమే కాకుండా అత్యంత మెరుగైన ప్రతిభ కనబర్చి బహుమతులు సైతం గెలుచుకున్నారు.

కుటుంబాల ప్రోత్సాహం

పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన మద్దా వెంకటేశ్వరరావు, మేరీ విజయకుమారిల దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారిలో మూడోసంతానం బేబీ సరోజని. ప్రాథమిక విద్యను కైకరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్తిచేశారు. ఇంటర్, డిగ్రీ ఏలూరులోని సెయింట్ థెరిస్సా, సెయింట్ ఆన్స్ కళాశాలల్లో పూర్తిచేశారు. సరోజిని మొదట్లో ఇంటర్మీడియట్ బోర్డులో పనిచేశారు. ఆ తర్వాత గ్రూప్ 2 ద్వారా హైదరాబాద్ సెక్రటేరియట్‌లో ఉద్యోగాన్ని సాధించారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని వెలగపూడి సచివాలయ అధికారిగా వచ్చారు. భర్త ధర్మారావు స్కూల్ ఎడ్యుకేషన్‌లో డిప్యూటీ సెక్రటరీగా పనిచేసి 2024లో జులైలో ఉద్యోగ విరమణ పొందారు. భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో బేబీ సరోజని వెటరన్ క్రీడాకారిణిగా రాణిస్తున్నారు. ఆమె పతకాలు సాధించినప్పుడల్లా తల్లిదండ్రులు, సోదరులు కుమార్‌శేఖర్, రాజారత్నం, సోదరి స్వర్ణలత ఎంతో సంతోషపడేవారు. ఏలూరులో ఓ మధ్యతరగతి కుటుంబంలో సహదేవ సుధాకరరావు, భారతి దంపతులకు మొదటి సంతానంగా సత్యవతి పుట్టారు. డిగ్రీ తర్వాత పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న రాయుడు శివశంకరవరప్రసాద్‌తో వివాహమైంది. ఆయన ప్రోత్సాహంతో ఎపిపిఎస్‌సి గ్రూప్ 2బి పరీక్ష రాసి 1996లో అప్పటి ఎపి సెక్రటేరియట్‌లో టైపిస్ట్ కమ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతల్లో చేరారు. అదే బ్యాచ్‌లో బేబీ సరోజని కూడా ఉద్యోగంలో చేరారు.







అప్పటి నుంచి ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. ఇరు కుటుంబాలు ఎంతో అన్యోన్యంగా ఉంటాయి. 2002లో ఎఎస్‌ఒ (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)గా ఉద్యోగోన్నతి వచ్చిన తర్వాత వీరు ఒక రోజు సరదాగా ప్రారంభించిన టేబుల్ టెన్నిస్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు.

స్నేహమేరా జీవితం..

ఇంటర్ నుంచి డిగ్రీ వరకూ వీరిద్దరూ ఒకే కళాశాలలో చదువుకున్నారు. అయినా ఉద్యోగాలు వచ్చిన తర్వాతనే మంచి స్నేహితులయ్యారు. 2005 నుంచి సరదాగా టేబుల్ టెన్నిస్ ప్రాక్టీస్ చేశారు. అప్పటి నుంచి రోజూ ఆడుతూనే ఉన్నారు. ఈ ఆటలో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించారు. వెటరన్ టేబుల్ టెన్నిస్ క్రీడలు ఎక్కడ జరిగినా అక్కడికి వెళ్లి పోటీల్లో పాల్గొనేవారు. కుటుంబాల నుండి ప్రోత్సాహం ఉండడంతో ఏ మాత్రం ఇబ్బంది పడకుండా తీరిక సమయాల్లో టిటిని, పోటీలు పెట్టినప్పుడు వాటిలో పాల్గొంటున్నారు. తద్వారా ఆత్మ విశ్వాసం పెరిగింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో కూడా పాల్గొని ద్వారా బంగారు, వెండి పతకాలను సైతం కైవసం చేసుకుంటున్నారు.

ఉద్యోగానికి న్యాయం చేస్తూనే...

మంత్రి వర్గ సమావేశాలు ఉన్నా, ఇతరత్రా శాఖల వారీగా సమావేశాలు ఉంటే వీరిద్దరూ అర్ధరాత్రి 1 గంట వరకు ఉండి పనిచేయాల్సి వస్తుంది. ఇలాంటి సందర్భాల్లోనూ పని చేసేందుకు వెనకడుగు వేయరు. బాధ్యతగా తమ విధులు నిర్వహిస్తారు. ఆయా సమావేశాలకు అవసరమైన సమాచారం, ఇతర రిపోర్టులు చక్కగా తయారుచేసి అందజేస్తుంటారు. ఏ పని అప్పగించినా చక చకా చేసేస్తారు. ఉద్యోగ బాధ్యతల్లో కీలకంగా ఉంటూ క్రీడల్లో రాణిస్తున్న వీరిద్దరిని పలువురు ప్రశంసిస్తున్నారు.

సిఎం, సిఎస్ అభినందనలు

జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ పేరుప్రఖ్యాతులు నిలపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, సిఎస్ దేవానంద్ తదితరులు వీరిద్దరినీ అభినందించారు. నైపుణ్యమైన క్రీడాకారుల నుంచి పోటీని తట్టుకుని విజయకేతనం ఎగరేయటం మంచి శుభపరిణామమని వారు పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి క్రీడల్లో ప్రవేశం ఉండి, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన వారితో పోరాడి గెలుపొందటం అంత ఆషామాషీ విషయం కాదని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

- యడవల్లి శ్రీనివాసరావు

ఇంట్లోనే సులభంగా

చర్మానికి అందాల్సిన పోషణ అందకపోతే ఏ వయసు వారికైనా సరే చర్మం జిడ్డుగా, నిర్జీవంగా, పొడిబారిపోవడం ఖాయం. ఫలితమే మొటిమలు, అలర్జీ వంటి సమస్యలు. ఈ సమస్యల నుంచి బయటపడాలంటే స్క్రబ్బింగ్ చక్కటి మార్గమని చెబుతారు సౌందర్య నిపుణులు. అయితే వీటి కోసం ఖరీదైన ఉత్పత్తులతో పనిలేదు.. కేవలం మన వంటింట్లో ఉండే కొన్ని పదార్థాలు చాలు. చర్మానికి స్క్రబ్‌లా పనిచేసి చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను



తొలగిస్తాయి. కొన్ని మచ్చలను మాయం చేస్తాయి. తేమను, మెరుపును అంద చేస్తాయి. అటువంటి సహజసిద్ధమైన కొన్ని స్క్రబ్స్ గురించి తెలుసుకుందాం...

మన ఇంట్లో సులభంగా దొరికే పంచదార, నిమ్మరసం, తేనెల మిశ్రమంతో దీనిని తయారుచేసుకోవచ్చు. ఇందులో పంచదార మెడపైనున్న మృతకణాలను తొలగిస్తుంది. నిమ్మరసం మచ్చలకు, అలర్జీలకు చెక్ పెడుతుంది. ఇక తేనె సహజతేమను అందిస్తుంది.

గ్రీన్‌టీ , పంచదార, ఆలివ్ ఆయిల్‌తో చేసే స్క్రబ్స్ చర్మానికి సహజసిద్ధమైన మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. అలాగే గ్రీన్‌టీ మొటిమలకు చెక్ పెడుతుంది.

ఓట్స్ పొడి, పంచదార, ఆలివ్ నూనె కూడా మంచి కాంబినేషన్. ఓట్స్ స్క్రబ్‌లా పనిచేయడంతో పాటు చర్మంపై పేరుకున్న జిడ్డును తొలగిస్తుంది.. అలాగే అలర్జీలకు చెక్ పెడుతుంది.

కాఫీ, చక్కెర కలిపి చేసే బాడీ స్క్రబ్ చర్మాన్ని ఎంతో మెరిపిస్తుంది. దీనికి రెండు టేబుల్ స్పూన్ల ఎక్స్ ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్, మూడు విటమిన్ ఇ కాప్సూల్స్ కలిపి గరుగ్గా ఉండే పేస్టులా చేసి శరీరానికి మసాజ్ చేస్తే అది శరీరాన్ని సున్నితంగా మార్చే బాడీ స్క్రబ్‌గా పని చేస్తుంది. ■



బయటపడిన
మరో ఇంజినీర్ మృతదేహం

నవతెలంగాణ – మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాద ఘటన తీరని వ్యధగా మారింది. ప్రమాదం జరిగి నెల రోజులు దాటగా.. మంగళవారం మరో ఇంజినీర్ మృతదేహం లభ్యమైంది. కాగా, ఇప్పటి వరకు బయటపడిన రెండు మృతదేహాలూ ఇంజినీర్లవే. మరో ఆరుగురి కార్మికుల ఆచూకీ దొరకలేదు. సైట్ ఇంజినీర్ గురుప్రీత్ మృతదేహాన్ని ఈనెల 9న వెలికితీశారు. మరో కార్మికుడి డెడ్‌బాడీని రెస్క్యూ టీం మంగళవారం వెలికి తీసింది. మార్చి 22న జరిగిన ప్రమాదం తర్వాత రెస్క్యూ టీం తమ ప్రాణాలకు తెగించి సహాయక చర్యలు చేపడుతున్నా.. సొరంగంలో వాతావరణం అనుకూలించడం లేదు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ చివరి 50 మీటర్ల పరిధిలో అత్యంత భయానక పరిస్థితులు నెలకొన్నాయి. టీబీఎం మిషన్ ముందు ఇరుక్కున్న కార్మికులను వెలికి తీయడానికి ఉబికి వస్తున్న నీటి ఊట, మట్టితోపాటు మిషన్ నుంచి విడిపోయిన ఇనుప పరికరాలు ఆటంకంగా మారాయి. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన సమీక్షలో సహాయక చర్యల్లో మరింత వేగం పెంచాలని సీఎం సూచించగా ఆ మరుసటి రోజే మరో డెడ్‌బాడీ దొరకడం విశేషం. అయితే, ప్రమాదకర పరిస్థితులు, మళ్లీ ప్రాణ నష్టం జరగకూడదనే రోబోలను సొరంగంలోకి పంపారు. చివరి 50 మీటర్లలో రోబోలు పనిచేయడానికి సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. అక్కడకు కార్మికులు వెళ్లరాదంటూ కంచె ఏర్పాటు చేశారు. దీంతో సొరంగంలో ఇరుక్కున్న మిగతా కార్మికుల ఆచూకీ ఇప్పట్లో తేలే అవకాశాలు లేవని తెలుస్తోంది.

మంగళవారం బయటపడిన మృతదేహం జయప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీలో ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉన్నావ్ జిల్లా బంగార్మౌ గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ (తండ్రి అర్జున్ ప్రసాద్)దిగా గుర్తించినట్టు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ప్రభుత్వం తరపున ఆయన కుటుంబసభ్యులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్టు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తామన్నారు. మనోజ్‌కుమార్‌కు భార్య స్వర్ణలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కార్మికుల ఆచూకీ కనుగొనాలి :
వర్థం పర్వతాలు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

సొరంగం పనుల్లో ఎన్ని అవాంతరాలు ఎదురైనా సహాయక చర్యలు ఆపొద్దు. అత్యంత ఆధునిక సౌకర్యాలున్న ఈ సమయంలో రెస్క్యూ ఆపరేషన్ ఇంత ఆలస్యం కావడం దురదృష్టకరం. కార్మికుల ఆచూకీ కోసం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించాలి.

గాజాలో కొనసాగుతున్న మారణ హోమం

గాజా : వరుసగా 8వ రోజు కూడా గాజాపై ఇజ్రాయిల్ బలగాలు బాంబు దాడులకు తెగబడుతున్నాయి. మంగళవారం నాటి దాడుల్లో 27మంది మరణించగా, వీరిలో ఏడుగురు చిన్నారులు వున్నారు. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ మారణహోమంలో ప్రస్తుత కాలం చిన్నారులకు ప్రాణసంకటంగా మారింది. గత వారం రోజుల్లో జరిపిన దాడుల్లో 270మందికి పైగా చిన్నారులు మరణించారని సేవ్ ది చిల్డ్రన్ సంస్థ వెల్లడించింది. ఉత్తర గాజాలోని సరిహద్దు ప్రాంత పట్టణాల్లో నివసిస్తున్న వేలాదిమంది పాలస్తీనియన్లందరినీ కూడా అక్కడ నుంచి ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశించింది. ఆ ప్రాంతం నుండే పాలస్తీనా రాకెట్లు ప్రయోగిస్తున్నారని విమర్శించింది. మరోవైపు ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణమైన ఊచకోతలను హమాస్ తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఇజ్రాయిల్‌కు పగ్గాలు వేయాల్సిందిగా అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. వరుసగా మూడో రోజూ పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీకి చెందిన 9మంది గల్లంతయ్యారు. రఫా నగరంలో సహాయ కార్యకలాపాలకు వెళ్ళినవీరు వెనక్కి తిరిగి రాలేదు. సెటిలర్లపై దాడులు జరిగిన నేపథ్యంలో ఇజ్రాయిల్ ఆర్మీ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఆస్కార్ అవార్డు గ్రహీత నిర్మాత, కో డైరెక్టర్ అయిన హమ్‌దాన్ బల్లాల్‌ను ఇజ్రాయిల్ అదుపులోకి తీసుకుంది. సుశియా గ్రామంలో యూదు సెటిలర్లు ఆయనపై దాడి చేశారు. వెంటనే సైనికులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నో అదర్ ల్యాండ్ పేరుతో ఆయన తీసిన డాక్యుమెంటరీ అస్కార్ పురస్కారాన్ని గెలుచుకుంది. ఆయన అరెస్టు వార్తపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అయితే బల్లాల్‌ను ఆయనతో పాటు అదుపులోకి తీసుకున్న మరో ఇద్దరు పాలస్తీనియన్లను వుంచిన కిర్యాత్ అర్బా సెటిల్‌మెంట్ ఏరియాలో పోలీసు స్టేషన్ నుంచి వారు బయటకు వస్తూ కనిపించారని మీడియా వార్తలు తెలిపాయి. బల్లాల్ ముఖంపై గాయాలున్నాయని, ఆయన దుస్తులపై రక్తం మరకలు వున్నాయని ఎపి వార్తా సంస్థ వెల్లడించింది.

బందీలను అప్పగించకపోతే హమాస్ భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ హెచ్చరించారు. ఇదే పరిస్థితి ఇలాగే కొనసాగితే, మొత్తంగా గాజా ప్రాంతాన్ని హస్తగతం చేసుకుంటామని, హమాస్‌ను పూర్తిగా ఓడించేవరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. ముందుకుగా కిడ్నాప్‌కు గురైన వారందరూ ఇళ్ళకు చేరాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు.

మళ్లీ పారిన రక్తపుటేరు

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ కార్యదర్శి సుధీర్ అలియాస్ సుధాకర్, అలియాస్ మురళి (వరంగల్ జిల్లా) ఉన్నారు. మరో ఇద్దరు స్పెషల్ జోనల్ కమిటీ దళ సభ్యులు అతరా పాండ్రు, బారసా మన్నుగా గుర్తించినట్టు ఎస్పీ ధ్రువీకరించారు. ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి భద్రతా బలగాలు పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. ఐఎన్‌ఎస్‌ఎఎస్ రైఫిల్, 303 రైఫిల్, 12 బోర్ రైఫిల్, మందుగుండు సామగ్రితోపాటు భారీగా మావోయిస్టులు ఉపయోగించే పలు దైనందిక సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని, ఇంకా మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టినట్టు పోలీసులు తెలిపారు. కాగా, 2025లో ఇప్పటివరకు భద్రతా దళాలు మొత్తం 100 మంది హార్డ్‌కోర్ మావోయిస్టులను అంతమొందించాయని, ఇది మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో సాధించిన పెద్ద విజయం అని ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రాంతం మొత్తాన్ని భద్రతా బలగాల కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నామని, సోదాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ ఏడాది మూడు నెలల్లో ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా సుమారు 130 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందినట్టు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు.

మావోయిస్టుల భవితవ్యం ప్రశ్నార్థకం

- దండకారణ్యంలోకి దూసుకుపోతున్న భద్రతా బలగాలు
- భయం గుప్పెట్లో అన్నలు

రోజురోజుకీ భద్రత బలగాలు దండకారణ్యాన్ని హస్తగతం చేసుకుంటూ దూసుకుపోతున్నారు. దండకారణ్యంలో జరుగుతున్న మారణహోమాన్ని చూస్తూ మావోయిస్టులు భయాందోళన చెందుతున్నట్టు తెలుస్తోంది. దానికి ప్రత్యక్ష నిదర్శనం బీజాపూర్ జిల్లా అండ్రీ అడవుల్లో ఎన్‌కౌంటర్ సమయంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గోండి భాష లేఖగా పలువురు విశ్లేషిస్తున్నారు. మార్చి 2026 నాటికి రాష్ట్రం నుంచి నక్సలిజాన్ని అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో మావోయిస్టుల్లో భయం మొదలైందని స్పష్టంగా కనిపిస్తోంది. కాగా బీజాపూర్ ఎన్‌కౌంటర్ స్థలం నుంచి మావోయిస్టులు ఓ లేఖను స్వాధీనం చేసుకున్నారు. ఈ లేఖను మహిళా మావోయిస్టుల కమాండర్ మంకీకి మావోయిస్టుల నాయకుడు మోటు రాశారు. గోండి భాషలో రాసిన రెండు పేజీల లేఖలో.. నక్సల్స్ ప్రభావిత అంతర్గత ప్రాంతాల్లో నిరంతరం పెరుగుతున్న ఒత్తిడి గురించి ప్రస్తావించారు. మావోయిస్టుల రహస్య స్థావరాలపై దళం నిరంతరం చర్యలు తీసుకుంటోందని, భవితవ్యం ప్రశ్నార్థకంగా మారినట్టు లేఖలో పేర్కొన్నారు. మావోయిస్టులు ఎక్కడైనా సురక్షితంగా ఉండటం కష్టమని వివరించారు. ఇటీవల ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశమయిన ఆండ్రీతో పాటు బోడ్కా, గంపూర్, దొడితుమ్నార్, తోడ్కా అడవులు కూడా అంత సురక్షితం కాదని ఆ లేఖలో ప్రకటించారు. గతేడాది కాలంగా మావోయిస్టులు భయాందోళనకు గురవుతున్నారని లేఖలో రాశారు.



ఆ చెత్త మాకొద్దు

అలహాబాద్ : ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను ప్రయాగరాజ్‌లోని అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించడంపై స్థానిక బార్ అసోసియేషన్ మండిపడింది. ప్రతిపాదిత బదిలీని వ్యతిరేకిస్తూ మంగళవారం నిరవధిక సమ్మెను ప్రారంభించింది. న్యాయవాదులు హైకోర్టు మూడవ నెంబరు గేటు వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ విలేకరులతో మాట్లాడుతూ తమ నిరసన ఏ కోర్టుకు లేదా ఏ జడ్జికి వ్యతిరేకం కాదని చెప్పారు. న్యాయ వ్యవస్థకు ద్రోహం చేసిన వారికి వ్యతిరేకంగానే తాము ఆందోళన చేస్తున్నామని అన్నారు. సుప్రీంకోర్టు నిరంకుశత్వాన్ని నిలువరించాలని కోరారు. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయడాన్ని అనుమతించవద్దని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'మా పోరాటం అవినీతికి పాల్పడిన వారి పైనే. పారదర్శకత లోపించిన వ్యవస్థ పైనే. బదిలీ ఆదేశాన్ని పున్నపరిశీలించి ఉపసంహరించుకోవాలన్నదే మా డిమాండ్' అని అనిల్ తివారీ స్పష్టం చేశారు. జస్టిస్ వర్మ బదిలీని వ్యతిరేకిస్తున్నట్లు బార్ అసోసియేషన్ సోమవారం నాడే పునరుద్ఘాటించింది. దీనిని ఆపకుంటే మంగళవారం నుండి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించింది. 'ప్రారంభం నుండి ఈ వ్యవహారాన్ని మసిపూసి మారేడుకాయ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రోజు దేశవ్యాప్తంగా న్యాయవాదులు పోరాటం చేస్తున్నారు. పరిష్కారం సాధించే వరకూ విధులకు హాజరు కాబోము. ఏం జరిగినా సరే' అని తివారీ చెప్పారు. జస్టిస్ వర్మను బదిలీ చేయాలని గతంలో చేసిన సిఫార్సును సుప్రీంకోర్టు ధ్రువీకరించిన విషయం తెలిసిందే. కేంద్రానికి పంపిన బదిలీ సిఫారసును సుప్రీంకోర్టు వెబ్‌సైటులో అప్‌లోడ్ చేశారు.

సామ్‌సంగ్ రూ.5,150 కోట్ల పన్ను ఎగవేత..?

(మొదటిపేజీ తరువాయి)

నోటీసులు జారీ చేసింది. కీలకమైన టెలికాం పరికరాల దిగుమతులపై సుంకాలను ఎగవేసిన ఆరోపణలపై పన్నులు, జరిమానా కలిపి చెల్లించాలని ఐటీ శాఖ నోటీసుల్లో స్పష్టం చేసింది. గతేడాది కంపెనీ సాధించిన రూ.8,180 కోట్ల) నికర లాభాల్లో ఇది సగానికి పైగా ఉండటం విశేషం. కంపెనీ టెలికాం పరికరాలను దిగుమతి చేసుకునే క్రమంలో 2023 ఏడాది మొబైల్ టవర్‌లలో ఉపయోగించే కీలకమైన ట్రాన్స్‌మిషన్ పరికరాలపై 10–20 శాతం సుంకాలను చెల్లించలేదని ఐటీ అధికారులు గుర్తించారు. ఈ పరికరాలను ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో కోసం దిగుమతి చేసి విక్రయించింది. సామ్‌సంగ్ భారతీయ చట్టాలను ఉల్లంఘించిందని, ఉద్దేశపూర్వకంగా క్లియరెన్స్ కోసం కస్టమ్స్ అథారిటీకి తప్పుడు పత్రాలను సమర్పించిందని అని కస్టమ్స్ కమిషనర్ సోనాల్ బజాజ్ నోటీసుల్లో తెలిపారు. లాభాలను పెంచుకోవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ఉల్లంఘనలపై పన్ను బకాయిలు, 100 శాతం పెనాల్టీతో కలిపి సామ్‌సంగ్ 520 మిలియన్లు చెల్లించాలని కస్టమ్స్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా ఏడుగురు సామ్‌సంగ్ ఇండియా ఎగ్జిక్యూటివ్‌లకు 81 మిలియన్ డాలర్ల జరిమానా కూడా విధించింది. దీంతో సామ్‌సంగ్ మొత్తంగా 601 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి వస్తుంది. ఇది ఇటీవలి కాలంలో అతిపెద్ద పన్ను డిమాండ్లలో ఒకటి కావడం గమనార్హం. ఈవిషయంపై 2023 లోనే సామ్‌సంగ్‌ను భారత్ హెచ్చరించింది. 2021 నుంచే విచారణ జరుపుతోంది. కాగా.. తాము బాధ్యతాయుతంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని సామ్‌సంగ్ పేర్కొంది. దేశంలోని చట్టాలకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని..

అప్పుల పరిమితిని పెంచిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

రుణాలు జీడీపీలో 61.4 శాతంగా ఉన్నాయి. 2021–2022లో ఇది జీడీపీలో 58.8 శాతానికి చేరుకుంది. సవరించిన గణాంకాల ప్రకారం, జీడీపీతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వ రుణశాతం 2022–2023లో 57.9 శాతం, 2023–2024లో 58.1 శాతం, 2024–2025లో 57.1 శాతంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నేరుగా తీసుకున్న రుణాలతో పాటు, 2024–2025లో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) మొత్తం రూ.2,84,521 కోట్లు అప్పుగా తీసుకుంది. బడ్జెట్ వెలుపల రుణాలు తీసుకోవడంతో ఎన్‌హెచ్‌ఎఐ అప్పులను కేంద్ర ప్రభుత్వ అప్పులుగా పరిగణించరు. 2016–2017 నుంచి 2022–2023 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం అదనపు బడ్జెట్ వనరులతో రూ.1,37,868.60 కోట్లు సేకరించిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

రాష్ట్ర ప్రభుత్వాలు అవసరాలకు, సంక్షేమ పథకాలకు రుణాలు తీసుకోవడాన్ని నియంత్రించ డానికి కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష చర్యలు విధిస్తోందని, అదే కేంద్ర ప్రభుత్వం మాత్రం పరిమితులను ఉల్లంఘిస్తోందని, ఈ అంశంపై ప్రభుత్వ ద్వంద్వ ప్రమాణాలకు ఇది నిదర్శనమని జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అధికంగా రుణాలు తీసుకోవడం దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని కూడా ఆయన హెచ్చరించారు.

బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు రూ.4.55 లక్షల కోట్లు

జాన్ బ్రిట్టాస్ అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా, దేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల్లో స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) రూ.4,55,278 కోట్లు దాటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. రూ.25 కోట్లకు పైగా రుణాలు తీసుకుని ఉద్దేశపూర్వకంగా తిరిగి చెల్లించని వారు దాదాపు 942 మంది ఉన్నారని కేంద్రం తెలియజేసింది. బ్యాంకుల్లో మొత్తం డిపాజిట్లు, మొత్తం రుణాల మధ్య అంతరం గణనీయంగా పెరిగింది. 2024 డిసెంబర్ 31 నాటికి మొత్తం పెట్టుబడి రూ.2,30,13,313 కోట్లు. ఇంతలో, మొత్తం రుణాలు, అడ్వాన్సులు 1,88,47,831 కోట్లు. 2019–2020 నుంచి 2024 డిసెంబర్ 31 వరకు ఉన్న గణాంకాలను పరిశీలిస్తే, రుణాలను మంజూరు చేయడంలో, రద్దు చేయడం లో బ్యాంకుల వైపు నుంచి ఉదాసీనత స్పష్టంగా కనిపిస్తుందని కేంద్ర ప్రభుత్వం ఎంపీకి ఇచ్చిన సమాధానంలో బహిరంగంగా అంగీకరించింది.



అయ్యర్ అదరహో

- టైటాన్స్‌పై పంజాబ్ కింగ్స్ గెలుపు
- ఛేదనలో సాయి, బట్లర్ పోరాటం వృథా
- పంజాబ్ 243/5, గుజరాత్ 232/5

అహ్మదాబాద్‌లో అయ్యర్ (97 నాటౌట్) అదరగొట్టాడు. 9 సిక్సర్లు, ఐదు ఫోర్లతో గుజరాత్ టైటాన్స్ బౌలర్లను ఉతికారేశాడు. ప్రియాన్ష్ ఆర్య (47), శశాంక్ సింగ్ (44 నాటౌట్) ఊచకోత ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. భారీ ఛేదనలో సాయి సుదర్శన్ (74), బట్లర్ (54), రూథర్‌ఫర్డ్ (46) పోరాడినా టైటాన్స్ 11 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.

నవతెలంగాణ-అహ్మదాబాద్

పరుగుల వరద పారిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ పైచేయి సాధించింది. మంగళవారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ 11 పరుగుల తేడాతో గెలుపొందింది. 244 పరుగుల ఛేదనలో ఓపెనర్ సాయి సుదర్శన్ (74, 41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), జోశ్ బట్లర్ (54, 33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), రూథర్‌ఫర్డ్ (46, 28 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిసినా టైటాన్స్ 232 పరుగులే చేసింది. ఓ దశలో టైటాన్స్ గెలుపు దిశగా సాగుతుండగా.. పేసర్ విజయ్‌కుమార్ వైశాక్ 12 బంతుల్లో 10 పరుగులే ఇచ్చి మ్యాచ్ గతిని మార్చాడు. అంతకుముందు, శ్రేయస్ అయ్యర్ (97 నాటౌట్, 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లు), ప్రియాన్ష్ ఆర్య (47, 23 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (44 నాటౌట్, 16 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో దంచికొట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 243 పరుగుల భారీ స్కోరు చేసింది.

దంచికొట్టారు :

టాస్ నెగ్గిన గుజరాత్ టైటాన్స్ సొంతగడ్డపై తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ప్రభుసిమ్రన్ సింగ్ (5) నిరాశపరిచినా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (97 నాటౌట్)తో కలిసి మరో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (47) ఎదురుదాడి చేశాడు. రెండు సిక్సర్లు, ఏడు ఫోర్లతో మెరిసిన ప్రియాన్ష్ పవర్‌ప్లేలో పరుగులు రాబించాడు. ఆరు ఓవర్లలో 73/1తో నిలిచిన పంజాబ్ మిడిల్ ఓవర్లలోనే అసలైన విశ్వరూపం చూపించింది.

శ్రేయస్ అయ్యర్ షో :

అజ్మతుల్లా ఓమర్‌జాయ్ (16), గ్లెన్ మాక్స్‌వెల్ (0) విఫలమైనా..ఓ ఎండ్‌లో నిలబడిన అయ్యర్ 27 బంతుల్లోనే మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో అర్థ సెంచరీ సాధించాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ శశాంక్ సింగ్ (44 నాటౌట్) సైతం జతకలవటంతో పంజాబ్ కింగ్స్ స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. 9.1 ఓవర్లలో 100 పరుగులు చేసిన పంజాబ్ కింగ్స్.. 200 పరుగుల మార్క్‌ను 17.4 ఓవర్లలోనే దాటేసింది. శ్రేయస్ అయ్యర్ మరో రెండు ఫోర్లు, ఐదు సిక్సర్లతో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. శశాంక్ సింగ్ సైతం ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో విరుచుపడ్డాడు. మహ్మద్ సిరాజ్ వేసిన ఆఖరు ఓవర్లో శశాంక్ సింగ్ 23 పరుగులు పిండుకున్నాడు. ఆఖరు ఓవర్లో స్ట్రయిక్ రాకపోవటంతో అయ్యర్ సెంచరీ చేజార్చుకున్నాడు.

గాఫ్‌కు చుక్కెదురు

- ప్రీ క్వార్టర్స్‌లో మూడో సీడ్ ఓటమి
- మియామి ఓపెన్ 2025



మియామి (యుఎస్‌ఏ) : అమెరికా స్టార్, మూడో సీడ్ కొకొ గాఫ్ మియామి ఓపెన్ నుంచి నిష్క్రమించింది. మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో కొకొ గాఫ్ వరుస సెట్లలో పరాజయం చవిచూసింది. 4-6, 4-6తో మగ్దా లినెట్ (పోలాండ్) చేతిలో మట్టికరిచింది. మూడు ఏస్‌లు, రెండు బ్రేక్ పాయింట్లు సాధించినా.. ఏ సెట్‌లో గాఫ్ మ్యాజిక్ చూపించలేదు. మగ్దా నాలుగు బ్రేక్ పాయింట్లతో అదరగొట్టింది. పాయింట్ల పరంగా 70-60తో గాఫ్‌పై పైచేయి సాధించింది. రెండో సీడ్, టైటిల్ ఫేవరేట్ ఇగా స్వైటెక్ (పోలాండ్) 7-6(7-5), 6-3తో వరుస సెట్లలో ఎలినా స్విటోనా (ఉక్రెయిన్)పై గెలుపొంది క్వార్టర్స్‌కు చేరుకుంది. ఆరు బ్రేక్ పాయింట్లు సాధించిన స్వైటెక్.. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో సొంతం చేసుకుంది. నాల్గో సీడ్ జెస్సికా పెగులా 6-2, 6-3తో మార్టాపై అలవోక విజయం సాధించింది. ఐదు బ్రేక్ పాయింట్లతో అదరగొట్టిన పెగులా.. అలవోకగా క్వార్టర్స్ బెర్త్ కైవసం చేసుకుంది. బ్రిటన్ అమ్మాయి ఎమ్మా రాడుకాను 6-1, 6-3తో ఆమందపై విజయంతో క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, కాస్పర్ రూడ్‌లు ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. థామ్సన్‌పై 7-5, 6-4తో జ్వెరెవ్..6-4, 7-6(7-4)తో తాబిలోపై రూడ్ గెలుపొందారు. పురుషుల డబుల్స్ విభాగంలో భారత స్టార్ యూకీ బాంబ్రి జోడీ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. పోర్చుగల్ భాగస్వామి నునో బోర్గోస్‌తో కలిసి బాంబ్రి 7-6(7-4), 6-2తో ఆడం, జెమీ ముర్రేలపై గెలుపొందారు.

వైజాగ్‌లో ఆరంభ మ్యాచ్?

ఫైనల్‌కు ముల్లాన్‌పూర్ ఆతిథ్యం
ఐసీసీ 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్



ముంబయి : ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ ఆతిథ్యానికి బీసీసీఐ రంగం సిద్ధం చేస్తోంది. 1978, 1997, 2013 తర్వాత నాల్గో సారి ప్రతిష్టాత్మక ప్రపంచకప్ ఈవెంట్‌కు వేదికగా నిలుస్తున్న భారత్.. ఆతిథ్యానికి ఐదు నగరాలను ఎంచుకుంది. ఇటీవల కోల్‌కతలో జరిగిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్టు సమాచారం. బీసీసీఐ నుంచి అధికారిక సమాచారం లేకపోయినా.. మహిళల ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్‌కు విశాఖపట్నం, టైటిల్ పోరుకు ముల్లాన్‌పూర్‌లను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. తిరువనంతపురం, ఇండోర్, రాయ్‌పూర్‌లు సైతం ఆతిథ్య నగరాల జాబితాలో ఉన్నాయి. 2017 వరల్డ్‌కప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత్.. 2022 ప్రపంచకప్ సెమీఫైనల్ బెర్త్‌ను తృటిలో చేజార్చుకుంది. మహిళల క్రికెట్ దిగ్గజాలు మిథాలీరాజ్, జులన్ గోస్వామి రిటైర్మెంట్ తర్వాత భారత్ పోటీపడుతున్న తొలి వన్డే వరల్డ్‌కప్ ఇదే కావటం గమనార్హం.

సెప్టెంబర్‌లో షురూ! :

ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ తేదీలు ఇంకా ఖరారు కాలేదు. ఆతిథ్య భారత్ సహా ఆరు దేశాలు ప్రపంచకప్‌కు అర్హత సాధించాయి. మరో రెండు జట్లను ఎంపిక చేసేందుకు ఏప్రిల్‌లో పాకిస్థాన్ వేదికగా అర్హత టోర్నీ నిర్వహించనున్నారు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంకలు అర్హత సాధించగా.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, వెస్టిండీస్‌లు చివరి రెండు బెర్త్‌ల కోసం పోటీపడుతున్నాయి. వన్డే వరల్డ్‌కప్ ఆరంభ మ్యాచ్ సెప్టెంబర్ 29న, ఫైనల్ మ్యాచ్ అక్టోబర్ 26న జరిగే అవకాశం ఉంది. ఈ మేరకు బీసీసీఐ ఉన్నతాధికారులు షెడ్యూల్ ఖరారు చేసినట్టు తెలుస్తోంది.



టీడీసీఏ టోర్నీలో డీఆర్ఎస్!

హైదరాబాద్ : అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ, తెలంగాణ రూరల్ జట్లు పోటీపడుతున్న తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అండర్-17 క్రికెట్ టోర్నీలో ప్రయోగాత్మకంగా డీఆర్ఎస్ సమీక్ష విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ మేరకు టీడీసీఏ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. గ్రూప్ దశ రెండో మ్యాచ్‌లోనూ ఏవైసీఏ హవా కొనసాగింది. రూరల్ రైజర్స్‌పై 164 పరుగులతో భారీ విజయం సాధించింది. తొలుత ఏవైసీఏ 49.2 ఓవర్లలో 349/10 పరుగులు చేయగా..రూరల్ రైజర్స్ 37 ఓవర్లలోనే 185 పరుగులకు కుప్పకూలింది. మరో మ్యాచ్‌లో రూరల్ వారియర్స్ తొలుత 39.4 ఓవర్లలో 141/10 పరుగులు చేయగా.. రూరల్ పాంథర్స్ 26.2 ఓవర్లలోనే 142/5తో లక్ష్యాన్ని ఛేదించి 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

అసలు భయమే లేదు

అశుతోష్ ఇన్నింగ్స్‌పై అంబటి రాయుడు



హైదరాబాద్ : నమ్మశక్యం కాని ఇన్నింగ్స్. అసాధారణం. ఈ ఇన్నింగ్స్ ఎంతోకాలం గుర్తుండిపోతుంది. లక్నో సూపర్‌జెయింట్స్‌పై ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర ఆశుతోష్ శర్మ అసమాన ప్రదర్శనకు మంత్రముగ్ధులైన వ్యాఖ్యాతలు చెప్పిన కొన్ని మాటలు ఇవి. 31 బంతుల్లో 66 పరుగులు పిండుకున్న ఆశుతోష్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఉత్కంఠ విజయాన్ని కట్టబెట్టాడు. 'ఆశుతోష్ ఇన్నింగ్స్‌లో అత్యంత ముఖ్యమైన అంశం అతడు ప్రశాంతంగా ఉండి, కొలబద్ధంగా ఆడటం. మంచి షాట్లు ఆడుతూ, ఏమాత్రం భయం లేని ఆట చూపించాడు. గత సీజన్లో ఆశుతోష్ నుంచి ఈ తరహా ఇన్నింగ్స్‌లు చూశాం. అంతటి ఒత్తిడిలో ప్రశాంతంగా ఎటువంటి బంతినైనా బౌండరీ దాటించిన తీరు అమోఘం' అంటూ అంబటి రాయుడు ప్రశంసించాడు. ఛేదనలో ఏడో ఓవర్లో 65/5 ఢిల్లీ క్యాపిటల్స్ కుప్పకూలుతున్న తరుణంలో క్రీజులోకి వచ్చిన ఆశుతోష్‌కు ట్రిస్టన్ స్టబ్స్ (34), విప్‌రాజ్ (39) సహకరించారు. తొలి 20 బంతుల్లో 20 పరుగులే చేసిన ఆశుతోష్.. మరో 46 పరుగులను 11 బంతుల్లోనే పిండుకున్నాడు.

పాలేకర్, అలెక్స్‌కు చోటు

ఐసీసీ ఎలైట్ ప్యానల్ ఆఫ్ అంపైర్స్



దుబాయ్ : ఐసీసీ ఎలైట్ అంపైర్ల ప్యానల్‌లో ఇద్దరు మాజీ క్రికెటర్లకు చోటు లభించింది. అల్లావుద్దీన్ పాలేకర్ (దక్షిణాఫ్రికా), అలెక్స్ వార్ఫ్ (ఇంగ్లాండ్)లను 2025-26కు ఐసీసీ ఎలైట్ అంపైర్ల ప్యానల్‌లో చేరుస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. మైకల్ గాఫ్, జోయెల్ విల్సన్‌లను ఈ ప్యానల్ నుంచి తప్పించింది. గత ఏడాది పనితీరు నివేదిక ఆధారంగా ఐసీసీ ఈ మార్పులు చేసింది. అలెక్స్ వార్ఫ్ ఇంగ్లాండ్ తరఫున 2004-05 సమయంలో 13 వన్డేలు ఆడాడు. ఏడు టెస్టులు, 33 వన్డేలు, 45 టీ20ల్లో ఆన్‌ఫీల్డ్ అంపైర్‌గా పని చేశాడు. పాలేకర్ దక్షిణాఫ్రికా ఫస్ట్ క్లాస్ క్రికెట్ కెరీర్ అనంతరం అంపైరింగ్‌లో అడుగుపెట్టాడు. నాలుగు టెస్టులు, 23 వన్డేలు, 67 టీ20ల్లో సహా 17 మహిళల అంతర్జాతీయ మ్యాచుల్లో ఆన్‌ఫీల్డ్ అంపైర్‌గా పని చేశాడు. మెన్స్ 2024 టీ20 ప్రపంచకప్, 2024 అండర్-19 ప్రపంచకప్‌కు సైతం అంపైర్‌గా వ్యవహరించాడు. ప్రస్తుతం ఎలైట్ అంపైర్ల ప్యానల్‌లో 12 మంది ఉండగా.. భారత్ నుంచి నితిన్ మీనన్ ఒక్కడే ప్రాతినిథ్యం వహిస్తున్నాడు.

సూపర్‌జెయింట్స్‌కు ఊరట

ఫిట్‌నెస్ సాధించిన పేసర్ అవేశ్ ఖాన్



లక్నో : ఢిల్లీ క్యాపిటల్స్‌తో వైజాగ్‌లో జరిగిన మ్యాచ్‌లో చేతుల్లోకి వచ్చిన విజయాన్ని వదిలేసిన లక్నో సూపర్‌జెయింట్స్‌కు కాస్త ఊరట. అనుభవలేమి బౌలింగ్ లైనప్‌తో డెత్ ఓవర్లలో నియంత్రణ కోల్పోయిన సూపర్‌జెయింట్స్ తొలి మ్యాచ్‌లో నిరాశపరిచింది. ఆ జట్టు కీలక పేసర్ అవేశ్ ఖాన్ ఫిట్‌నెస్ సాధించగా.. త్వరలోనే పంత్‌సేనతో చేరనున్నాడు. కుడి కాలు మోకాలి గాయంతో బాధపడుతున్న అవేశ్ ఖాన్‌కు బీసీసీఐ వైద్య బృందం ఈ వారంలోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బెంగళూర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిహాబిలిటేషన్‌లో ఉన్న అవేశ్ ఖాన్‌కు సోమవారమే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. లక్నో సూపర్‌జెయింట్స్ గురువారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఉప్పల్ పోరుకు అవేశ్ ఖాన్ అందుబాటులో ఉండనున్నాడు.

భారత్ 0-0 బంగ్లాదేశ్

ఏఎఫ్‌సి క్వాలిఫయర్ పోరు డ్రా



షిల్లాంగ్ (మేఘాలయ) : ఫుట్‌బాల్ అభిమానుల్లో ఎంతో ఆసక్తి రేపిన భారత్, బంగ్లాదేశ్ ఏఎఫ్‌సి ఆసియా కప్ క్వాలిఫయర్ మ్యాచ్ ఇరు జట్ల అభిమానులను నిరాశపరిచింది. హమ్జా చౌదరి అరంగేట్రంతో బంగ్లాదేశ్.. సునీల్ ఛెత్రి రాకతో భారత అభిమానులు విజయంపై ఆశలు పెట్టుకున్నారు. కానీ 90 నిమిషాల ఆటకు మరో ఐదు నిమిషాల అదనపు సమయం తోడైనా.. ఎవరూ గోల్ కొట్టలేకపోయారు. మైదానంలో బంతితో మాయ చేస్తాడనుకున్న హమ్జా ఏమాత్రం ప్రభావం చూపించలేదు. ప్రత్యర్థితో పోల్చితే కాస్త మెరుగ్గా కనిపించిన టీమ్ ఇండియా సైతం అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదు. భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ డ్రాగా ముగియటంతో గ్రూప్-సిలో ప్రతి జట్టు ఒక్కో పాయింట్‌తో నిలిచింది.

'ప్రేమ వెల్లువ..'తో సందడి షురూ..



శ్రీనిధి శెట్టి, నాని

హీరో నాని మోస్ట్ ఎవైటెడ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'హిట్ : ది థర్డ్ కేస్'. ఇందులో ఆయన హిట్ ఆఫీసర్‌గా ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. టీజర్ నాని క్యారెక్టర్‌ని ఫెరోషియస్ అవతార్‌లో ప్రజెంట్ చేసింది. ఈ చిత్రానికి డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించారు. వాల్ పోస్టర్ సినిమా, నాని యూనిమస్ ప్రొడక్షన్స్ పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ సినిమా మ్యూజికల్ జర్నీ ఫస్ట్ సింగిల్ 'ప్రేమ వెల్లువ..' రిలీజ్ చేయడంతో ప్రారంభమైంది.

నాని, శ్రీనిధి శెట్టిల అందమైన ప్రేమ ప్రయాణాన్ని ప్రజెంట్ చేసే రొమాంటిక్ బల్లాడ్‌ను మిక్కీ జె మేయర్ కంపోజ్ చేశారు. నాని ప్రారంభంలో ఇంటెన్స్, దూకుడు స్వభావం వ్యక్తి. శ్రీనిధి రాకతో సాఫ్ట్‌గా మారుతాడు. సాంగ్ ఆర్కెస్ట్రేషన్ అద్భుతంగా ఉంది. లీడ్ పెయిర్ ఎమోషన్‌ని బ్యూటీఫుల్‌గా చూపించింది. సిద్ శ్రీరామ్ మ్యాజికల్ వోకల్స్ పాటకు మరింత మ్యాజిక్‌ని యాడ్ చేసింది. నూతన మోహన్ వోకల్స్ సాంగ్‌కు కంప్లీట్‌నెస్ తీసుకొచ్చింది. లిరిక్ రైటర్ కృష్ణకాంత్ భావోద్వేగాలను అందంగా, పొయిటిక్‌గా ఎక్స్‌ప్రెస్ చేసే సాహిత్యం రాశారు. లీడ్ పెయిర్ ప్రేమకు సాక్షిగా బీచ్ కనిపించడం అద్భుతంగా ఉంది. తుపాకీ ఆకారంలో బ్రిడ్జ్, వంతెన చివర్లో గులాబీ డిఫరెంట్ వ్యక్తిత్వాలకు మెటాఫర్‌గా నిలిచింది. నాని, శ్రీనిధి శెట్టిల కెమిస్ట్రీ అద్భుతంగా ఉంది. పరిణతి చెంది ప్రేమకథను ప్రజెంట్ చేసింది. మ్యాజికల్ కంపోజిషన్, వోకల్స్, మరపురాని సాహిత్యంతో ఈ పాట చార్ట్‌బస్టర్ సంచలనంగా మారడానికి అవసరమైన అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. మనసుని గెలుచుకుని, చాలా కాలం పాటు నిలిచిపోయే పాట ఇది. ఈ సినిమా మే 1న విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ చిత్రానికి డీవోపీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె మేయర్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్), లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు.

నవచిత్రం


ఏప్రిల్ 4న రీ-రిలీజ్



బాలకృష్ణ

బాలకృష్ణ కథానాయకుడిగా రూపొందిన క్లాసిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ఆదిత్య 369' మళ్లీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉంది. 1991లో విడుదలై, సంచలన విజయాన్ని సాధించిన ఈ సినిమాను 4కే డిజిటలైజేషన్, 5.1 సౌండ్‌తో మరింత అధునాతనంగా మళ్ళీ ప్రేక్షకులకు అందిస్తున్నారు. శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, 'నందమూరి బాలకృష్ణ శ్రీకృష్ణదేవరాయలుగా, కృష్ణ కుమార్‌గా రెండు విభిన్న పాత్రల్లో అద్భుతంగా నటించారు. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాను తెలుగు చలనచిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా తీర్చిదిద్దారు. ఇప్పటి టెక్నికల్ హంగులతో మరింత గొప్ప అనుభూతిని అందించేలా రీ రిలీజ్‌కి సిద్ధమైంది. చక్కని థియేటర్లు లభించడంతో ముందుగా అనుకున్న ఏప్రిల్ 11న కాకుండా ఏప్రిల్ 4వ తేదీనే రీ-రిలీజ్ చేయాలని నిర్ణయించాం. రీ-రిలీజ్‌లోనూ ఈ సినిమా అఖండ విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు.

శివ భక్తుడిగా మారిపోయా..



మంచు విష్ణు

హీరో విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఈ మూవీని ఏప్రిల్ 25న విడుదల చేయబోతున్నారు.

ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' సందడి చేసింది.

ఈ సందర్భంగా విష్ణు మంచు మాట్లాడుతూ, "నేను మామూలుగా ఆంజనేయ స్వామి భక్తుడ్ని. కానీ 'కన్నప్ప'తో ప్రయాణం ప్రారంభం అవ్వడంతో శివ భక్తుడిగా మారిపోయాను. ఈ సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ప్రభాస్ పాత్రను ఎంత ఊహించుకున్నా.. అంతకు మించి అనేలా ఉంటుంది. సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా భారీ ఎత్తున రిలీజ్ కాబోతోంది' అని అన్నారు.

"కన్నప్ప' లాంటి గొప్ప చిత్రంలో ఓ మంచి పాత్రను వేయడం నా అదృష్టం. ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. మా కెరీర్ 'కన్నప్ప'కి ముందు.. 'కన్నప్ప'కి తరువాత అన్నట్టుగా మారుతుంది. విష్ణు నటన చూసి అంతా ఫిదా అవుతారు. మైండ్ బ్లోయింగ్ అనేలా సినిమా ఉంటుంది' అని బ్రహ్మాజీ చెప్పారు.

రఘుబాబు మాట్లాడుతూ, 'ఈ సినిమా అద్భుతంగా వచ్చింది. విష్ణు ఈ చిత్రంతో మరో స్థాయికి వెళ్తారు' అని అన్నారు.

'నేను దర్శకత్వం వహించిన 'మహా భారతం' సీరియల్‌ను అందరూ ప్రేమించారు. 'కన్నప్ప'ని కూడా అదే స్థాయిలో అందరూ ప్రేమిస్తారు.. గౌరవిస్తారు. మోహన్ బాబు, ప్రభాస్, మోహన్ లాల్ వంటి హేమాహేమీలు ఎంతో మంది ఈ చిత్రంలో నటించారు' అని దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ చెప్పారు.

సర్కారు బడుల్లో ఏటా తగ్గుతున్న పిల్లలు

రెండేండ్లలోనే 3.67 లక్షల మంది తగ్గుదల
ప్రస్తుతం 30,137 ప్రభుత్వ స్కూళ్లలో 40 శాతం మంది
11,217 ప్రయివేటు పాఠశాలల్లో 60 శాతం విద్యార్థులు
ఒక్క విద్యార్థి లేని ప్రభుత్వ బడులు 1,938



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతున్నది. రెండేండ్లలోనే 3,67,374 మంది విద్యార్థులు తగ్గడం ఆందోళన కలిగిస్తున్నది. ఇంకోవైపు ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతుండడం గమనార్హం. ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 30,137 ప్రభుత్వ పాఠశాలల్లో 25,13,435 (40.44 శాతం) మంది విద్యార్థులు చదువుతున్నారు. అదే 11,217 ప్రయివేటు స్కూళ్లలో 37,01,814 (59.56 శాతం) మంది విద్యనభ్యసిస్తున్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 9,64,128 మంది చదివితే 2023-24 విద్యాసంవత్సరంలో 8,15,505 మంది చదివారు. అంటే 1,48,623 మంది విద్యార్థులు తగ్గారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఐదో తరగతి వరకు 7,39,433 మంది చదువుతున్నారు. గతేడాది కంటే ఇప్పుడు 76,072 మంది తగ్గారు. 2022-23 నుంచి ప్రస్తుత విద్యాసంవత్సరం వరకు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 2,24,695 మంది విద్యార్థులు తగ్గడం గమనార్హం. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2022-23 విద్యాసంవత్సరంలో 2,80,236 మంది చదివితే 2023-24 విద్యాసంవత్సరంలో 2,33,312 మంది చదివారు. అంటే 46,924 మంది తగ్గారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 2,06,923 మంది చదువుతున్నారు. గతేడాది కంటే ఇప్పుడు 26,389 మంది తగ్గారు. 2022-23 కంటే ప్రస్తుత విద్యాసంవత్సరంలో 73,313 మంది విద్యార్థులు తగ్గడం గమనార్హం. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను గమనిస్తే 2022-23 విద్యాసంవత్సరంలో 16,36,445 మంది చదివారు. 2023-24 విద్యాసంవత్సరంలో 15,87,813 మంది విద్యనభ్యసించారు. అంటే అప్పుడు 48,632 మంది తగ్గారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 15,67,079 మంది చదువుతున్నారు. అంటే గతేడాది కంటే ఇప్పుడు 20,734 మంది తగ్గారు. 2022-23 కంటే ప్రస్తుత విద్యాసంవత్సరంలో 69,366 మంది తగ్గడం గమనార్హం. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 2022-23 విద్యాసంవత్సరంలో 28,80,809 మంది చదివారు. 2023-24 విద్యాసంవత్సరంలో 26,36,630 మంది చదివారు. అంటే 2,44,179 మంది తగ్గారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 25,13,435 మంది చదువుతున్నారు. గతేడాది కంటే ప్రస్తుత విద్యాసంవత్సరంలో 1,23,195 మంది తగ్గారు. 2022-23 కంటే ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఏకంగా 3,67,374 మంది విద్యార్థులు తగ్గడం గమనార్హం. అదేకాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 48.84 శాతం ఉన్న విద్యార్థుల సంఖ్య 40.44 శాతానికి పడిపోయింది. రాష్ట్రంలో ఒక్క విద్యార్థి కూడా ప్రభుత్వ పాఠశాలలు 1,938 ఉన్నాయి. గతేడాది 1,834 ఉండడం గమనార్హం.

సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ తరగతుల్లేవ్

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను నిర్వహించడం లేదు. రాష్ట్రంలో మూడేండ్లు నిండిన పిల్లలను బడుల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రయివేటు పాఠశాలల్లో కిండర్‌గార్టెన్, ప్లే స్కూల్, కిడ్స్ స్కూళ్లు అందుబాటులో ఉన్నాయి. మెజార్టీ ప్రయివేటు పాఠశాలల్లో నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉన్నాయి. అందుకే ఎక్కువ మంది తల్లిదండ్రులు వాటిలో చేర్పించాలని భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు లేకపోవడం వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఇది ఒక కారణమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే మూడేండ్ల వయస్సులో ప్రయివేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులు ఒకటో తరగతిలో తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. అందుకే ప్రభుత్వ బడుల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. ప్రయివేటు పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాలున్నా వాటిని ప్రీప్రైమరీ బడిగా భావించడం లేదు. ఎందుకంటే అక్కడికి చిన్న పిల్లలతోపాటు బాలింతలు, గర్భిణీలు కూడా వస్తారు. అంగన్‌వాడీ టీచర్లకు పిల్లలతోపాటు ఇతర పనులు ఎక్కువగా ఉంటాయి. దీంతో వారు బోధనపై దృష్టిసారించలేకపోతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలనీ, వాటిలో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని విద్యావేత్తలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విద్యార్థుల నమోదు వివరాలు

తరగతి	విద్యార్థులు		
(1 నుంచి 10 వరకు)	ప్రభుత్వ	ప్రయివేటు	మొత్తం
2022-23	28,80809 (48.84 శాతం)	30,17,877 (51.16 శాతం)	58,98,686
2023-24	26,36,630 (43.64 శాతం)	34,05,430 (56.36 శాతం)	60,42,060
2024-25	25,13,435 (40.44 శాతం)	37,01,814 (59.56 శాతం)	62,15,249

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్



భారత జీడీపీ అంచనాలకు కోత

2025-26లో 6.5 శాతమే

ఎస్అండ్‌పీ గ్లోబల్ అంచనా

న్యూఢిల్లీ : భారత జీడీపీ అంచనాలకు ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ కోత పెట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత వృద్ధి రేటు 6.5 శాతానికే పరిమితం కావొచ్చని అంచనా వేసింది. అమెరికా టారీఫ్ విధానాలు వర్ధమాన దేశాలపై ప్రతికూల ప్రభావం చూపనుందని విశ్లేషించింది. ఈ నేపథ్యంలోనే భారత వినిమయ డిమాండ్‌ను దెబ్బతీయనుందని పేర్కొంది. "2026 మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ 6.5 శాతానికి పరిమితం కావొచ్చు. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా ఉంది. వచ్చే వర్షాకాలం సీజన్ సాధారణంగా ఉండొచ్చు. అదే విధంగా కమోడిటీ, చమురు ధరలు సానుకూలంగా నమోదు కావొచ్చు." అని ఎస్అండ్‌పీ పేర్కొంది. "ఆసియా, ఫసిఫిక్ రీజియన్‌లోని సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించొచ్చని అంచనా. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో 75-100 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లను కోత పెట్టొచ్చు. ఆహార ధరలు తగ్గొచ్చు. వచ్చే 2025-26లో రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతంగా ఉండొచ్చు." అని ఎస్అండ్‌పీ తెలిపింది.

ఆర్బీఐ ఇటీవల విధాన సమీక్షలో రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.50 శాతం నుంచి 6.25 శాతానికి కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత జీడీపీ 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఇటీవల నేషనల్ గణంకాల శాఖ (ఎన్ఎస్ఒ) అంచనా వేసింది. ఇది నాలుగేండ్లలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం ఆందోళనకరం. ఇంతక్రితం 2023-24లో జీడీపీ 8.2 శాతం పెరిగింది. 2024-25లో 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్బీఐ ఇటీవల అంచనా వేసింది. వీటితో ఎస్అండ్‌పీ అంచనాలు పోల్చితే ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో గొప్ప ఆశాజనక వృద్ధి రేటు కానరాకపోవడం ఆందోళనకరం.

ద్వితీయార్థంలో అమెరికాలో మాంద్యం..!



వాషింగ్టన్ : ప్రస్తుత ఏడాది ద్వితీయార్థంలో అమెరికాలో ఆర్థిక మాంద్యం ప్రభావాలు పెరగొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. వాణిజ్య టారిఫ్‌ల ఉద్రిక్తతలు, ద్రవ్య సర్దుబాట్ల పర్యవసానాలతో ఇన్వెస్టర్లు, విధాన నిర్ణేతలు సతమతమవుతున్నారని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో యూఎస్ మార్కెట్‌లో రానున్న రోజుల్లో ఒడిదుడుకులు ఎదురవుతాయని మెజారిటీ ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. మాంద్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వ వ్యూహాత్మక ఆర్థిక జోక్యాలు అవసరమని సూచిస్తున్నారు. ఆర్థిక కార్యకలాపాలు మందగించడంతో 2025 మార్చి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి తగ్గొచ్చని హెచ్చరిస్తున్నారు. మార్చి త్రైమాసికంలో త్రైమాసికంలో యూఎస్ జీడీపీ వృద్ధి 1.4 శాతానికి పరిమితమయ్యింది. 2024 చివరి మూడు నెలల్లోని 2.3 శాతం వృద్ధితో పోల్చితే చాలా మందగించింది. వాణిజ్య లోటు పెరగడం, వినియోగదారుల వ్యయం మందగించడం, శీతాకాల కార్యకలాపాలు ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారాయని నిపుణులు పేర్కొంటున్నారు. దిగుమతులు పెరగడం, ఎగుమతులు స్తంభించడంతో వాణిజ్య లోటు రికార్డు స్థాయికి చేరుకుంది. ఒక్క జనవరి 2025లోనే వస్తు, సేవల వాణిజ్య లోటు 131.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. మందగమనం భయాలతో అమెరికా పౌరులు విచక్షణ, అచీతూచి కొనుగోళ్లు చేస్తున్నారు. చాలా కుటుంబాలు అత్యవసరం కాని కొనుగోళ్ల కంటే అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

ఇంధన స్టోరేజీ ఉత్పత్తుల్లోకి ప్యూర్

ప్యూర్‌పవర్ హోమ్ ఆవిష్కరణ



నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రముఖ ద్విచక్ర విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ప్యూర్ కొత్తగా ఇంధన స్టోరేజీ ఉత్పత్తుల్లోకి ప్రవేశించింది. ఇప్పటి వరకు ఇవి రంగంలో ఉన్న ఈ కంపెనీ మంగళవారం హైదరాబాద్‌లో ప్యూర్‌పవర్ ఎనర్జీ స్టోరేజీ ఉత్పత్తులను విడుదల చేసింది. వీటిని నిటి ఆయోగ్ సభ్యుడు, డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వికె సారస్వత్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్యూర్ ఫౌండర్, ఎండీ నిషాంత్ డొంగరి మీడియాతో మాట్లాడుతూ.. తాము కొత్తగా ప్యూర్‌పవర్ హోమ్, ప్యూర్ పవర్ కమర్షియల్ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామని.. త్వరలోనే ప్యూర్‌పవర్ గ్రిడ్ ఉత్పత్తులను విడుదల చేయనున్నామని చెప్పారు.

వీటితో విద్యుత్తును నిల్వ చేసుకుని అవసరానికి తగ్గట్టుగా వాడుకునేందుకు వీలుందన్నారు. ఇవి సాధారణ యూపీఎస్‌లలో మాదిరిగా వీటిల్లో లెడ్ ఆక్సైడ్ బ్యాటరీలు కాకుండా.. అత్యాధునిక లిథియం-అయాన్ బ్యాటరీలను ఉపయోగించామ న్నారు. సౌర విద్యుత్తు లాంటి సంప్రదాయేతర ఇంధన వనరులతో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును కూడా ఎటువంటి అదనపు పరికరాల అవసరం లేకుండా నిల్వ చేసుకోవచ్చన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానెల్స్‌తో వచ్చే విద్యుత్‌ను ఇంటికి వాడుకోవడంతో పాటుగా.. మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వ గ్రిడ్‌కు విక్రయించుకోవచ్చన్నారు. ప్యూర్‌పవర్ హోమ్ ధర రూ.74,999గా ప్రారంభమవుతుందన్నారు. ఇవి 3కెవిఎ, 5కెవిఎ, 15కెవిఎ సామర్థ్యాల్లో లభిస్తాయన్నారు. వచ్చే 18 నెలల్లో 300 మంది డీలర్ల ద్వారా ఈ ఉత్పత్తులను మార్కెట్ చేయనున్నామన్నారు. గ్రిడ్ స్థాయిలో విద్యుత్తును నిల్వ చేసే 'ప్యూర్ పవర్: గ్రిడ్'ను వచ్చే ఏడాది అందుబాటులోకి తేనున్నామన్నారు.

ఆరంభ లాభాలు ఆవిరి..

ముంబయి : వరుసగా ఏడో రోజూ భారత స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. మంగళవారం సెషన్‌లో ఉదయం భారీ లాభాల్లో సాగిన మార్కెట్లు.. తుదకు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 78,741 పాయింట్ల గరిష్టాన్ని తాకగా.. తుదకు 33 పాయింట్ల లాభంతో 78,017 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 10 పాయింట్ల లాభంతో 23,669 వద్ద నమోదయ్యింది. డాలరుతో రూపాయి మారకం విలువ 16 పైసలు కోల్పోయి రూ.85.77గా ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు ఒత్తిడిని చవి చూడటం వల్ల ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి.

వెనిజులాపై ట్రంప్ కన్నెర్ర

- ఆ దేశం నుంచి చమురు, గ్యాస్ కొంటే పాతిక శాతం సుంకం విధిస్తానని బెదిరింపు
- భారత్‌పై ప్రభావం పడుతుందంటున్న నిపుణులు



వాషింగ్టన్ : వెనిజులాపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కన్నెర్ర చేశారు. ఆ దేశం నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే ఏ దేశం పైన అయినా సరే ఇరవై ఐదు శాతం సుంకం విధిస్తానని ప్రకటించారు. అమెరికా శత్రు దేశాలతో పాటు మిత్ర దేశాలపై కూడా ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని ముమ్మరం చేసిన విషయం తెలిసిందే. 'అమెరికా పట్ల వెనిజులా చాలా శతృత్వ ధోరణితో వ్యవహరిస్తోంది. కాబట్టి ఆ దేశం నుండి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేసే ఏ దేశమైనా అమెరికాతో వాణిజ్యం నెరిపితే ఇరవై ఐదు శాతం సుంకం చెల్లించాల్సిందే' అని ట్రూత్ సోషల్ నెట్‌వర్క్‌లో ట్రంప్ స్పష్టం చేశారు. ట్రంప్ హెచ్చరికలు భారత్‌పై ప్రభావం చూపుతాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు.

2023 డిసెంబరులోనూ, 2024 జనవరిలోనూ వెనిజులా నుండి ముడి చమురు కొనుగోలు చేసిన దేశాలలో భారత్‌దే మొదటి స్థానం. ఆ దేశం నుండి భారత్ 22 మిలియన్ బ్యారల్స్ చమురును దిగుమతి చేసుకుంది. మన దేశం కొనుగోలు చేస్తున్న మొత్తం ముడి చమురులో ఇది ఒకటిన్నర శాతం. 2023 డిసెంబరులో భారత్ రోజుకు సుమారు 1,91,600 బ్యారల్స్ చమురును దిగుమతి చేసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రోజుకు 1,27,000 బ్యారల్స్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) 37,000 బ్యారల్స్, హెచ్‌పీసీఎల్-మిట్టల్ ఎనర్జీ 28,000 బ్యారల్స్ దిగుమతి చేసుకున్నాయి. గత సంవత్సరం జనవరిలో భారత్ దిగుమతులు రోజుకు 2,54,000 బ్యారల్స్‌కు పెరిగాయి. వెనిజులా చేసిన మొత్తం ఎగుమతులలో ఇది దాదాపు సగం.

ట్రూత్ సోషల్ వేదికలో ట్రంప్ నూతన టారిఫ్‌ను ప్రకటిస్తూ 'అధ్యక్షుడు డొనాల్డ్ జే ట్రంప్ ఈ రోజు ఓ ప్రకటన చేస్తున్నారు. వెనిజులాపై అమెరికా రెండో దఫా టారిఫ్‌ను విధిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. వెనిజులా ఉద్దేశపూర్వకంగా, మోసపూరితంగా వేలాది మంది నేరస్థులను రహస్యంగా అమెరికాకు పంపుతోంది. వీరిలో చాలా మంది హంతకులు. వారు హింసాత్మక స్వభావం కలిగిన వారు. అమెరికాకు వెనిజులా పంపుతున్న ముఠాలలో ట్రెన్ డీ అరాగువా ఒకటి. అది ఓ విదేశీ ఉగ్రవాద సంస్థ. వారిని వెనిజులాకు తిప్పి పంపే ప్రయత్నంలో ఉన్నాం. అది చాలా పెద్ద పని. పైగా అమెరికా విషయంలో వెనిజులా శత్రుభావంతో వ్యవహరిస్తోంది' అని ఆరోపించారు. కాబట్టి వెనిజులా నుండి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేసే ఏ దేశమైనా అమెరికాతో వాణిజ్యం కొనసాగించాలంటే ఇరవై ఐదు శాతం సుంకాన్ని విధిగా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. డాక్యుమెంటేషన్ ప్రక్రియను పూర్తి చేసి వచ్చే నెల 2వ తేదీ నుండి సుంకాలు విధిస్తామని పునరుద్ఘాటించారు. ఆ రోజు అమెరికాలో విముక్తి దినోత్సవాన్ని జరుపుకుంటామని ట్రంప్ చెప్పుకొచ్చారు.

త్వరలో ఫీజు రెగ్యులేటరీ కమిటీ

- ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళనకరం
- రూ.11,600 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు
- విద్యా శాఖ పద్దులపై మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

త్వరలో ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్య మంత్రి, దామోదర రాజనర్సింహ ముఖ్యమంత్రి తరుపున వెల్లడించారు. మంగళవారం శాసనసభలో విద్యాశాఖ బడ్జెట్ పద్దుపై ఆయన సమాధానమిచ్చారు. విద్య మానవ సమాజ గుణాత్మక పురోగతికి దోహదం చేస్తుందన్నారు. ఏడెనిమిదేండ్లుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందన్నారు. 662 రెసిడెన్షియల్ స్కూళ్లు అద్దెభవనాల్లో నడుస్తున్నాయని చెప్పారు. సుమారు 2 లక్షల మంది విద్యార్థులు అరకొర వసతులతోనే చదువుకుంటున్నారని వివరించారు. తల్లిదండ్రులు భయపడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పంపించే పరిస్థితి ఉండకూడదని చెప్పారు. అందుకే అన్ని పాఠశాలల్లో అవసరమైన దిద్దుబాటు చర్యలు ప్రారంభించామన్నారు. విశాల తరగతి గదులు, ల్యాబ్‌లు, మంచి నీటి వసతి, క్లీన్ వాష్ రూమ్స్ అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను 11,600 కోట్లతో ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఆకునూరి మురళి నేతృత్వంలో ఎడ్యుకేషన్ కమిషన్ వేశామన్నారు. కమిషన్ సూచనల మేరకు విద్యా వ్యవస్థను బాగుచేస్తామని తెలిపారు. మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు, తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడతామన్నారు. 12 యూనివర్సిటీలకు వీసీలను నియమించామని తెలిపారు. ఆయా యూనిర్సిటీల్లో కొత్త కోర్సులను ప్రవేశ పెట్టామన్నారు. విద్యార్థుల్లో స్కిల్స్ పెంచేందుకు, ఎంఎన్‌సీ కంపెనీలు, విదేశీ వర్సిటీలతో ఒప్పందం చేసుకున్నాయని వివరించారు. కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత ఆరువేల పాఠశాలలు మూతపడ్డాయనేది అవాసవమన్నారు. విద్యా ప్రమాణాలు పెంచాలనేదే మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రైట్ టూ ఎడ్యుకేషన్ అనేది మన హక్కు అని పేర్కొన్నారు. గత పదేండ్లలో 8 లక్షల వరకు విద్యార్థులను తగ్గారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 734 రెసిడెన్షియల్ స్కూళ్లు వచ్చాయని తెలిపారు. అలాగే 600 వందల గురుకులాలు అద్దె భవనాల్లో ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వ తీరు వల్ల దాదాపు 2 లక్షల మంది పిల్లలకు సౌకర్యాలు లేవని విమర్శించారు. యూనివర్సిటీల్లో డిటేన్షన్, డ్రాప్ అవుట్స్ మల్టిపుల్ ఎంట్రీస్, మల్టిపుల్ ఎగ్జిట్స్ కామన్ సిలబస్, తదితర అంశాలపై చర్చించేందుకు కమిటీ వేశామన్నారు. ఉర్దూ టీచర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. లైఫ్ రైటింగ్ కోర్సులపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

వివేక్ అన్న..కంగ్రాట్స్ !

- ముందస్తు శుభాకాంక్షలు చెప్పిన మల్లారెడ్డి




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

అసెంబ్లీ లాబీలో మంగళవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి మల్లారెడ్డి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ఎదురు పడ్డారు 'వివేక్ అన్న కంగ్రాట్స్..మంత్రి పదవి వస్తుందని తెలిసింది..అంటూ ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ పలకరించారు. పక్కనే ఉన్న మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరికి కూడా కంగ్రాట్స్ అంటూ అభినందనలు చెప్పారు. వివేక్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ మొత్తానికి సాధించారు, సీఎం, డిప్యూటీ సీఎం కంటే ముందే ఢిల్లీ వెళ్లొచ్చారు అన్నారు. వెంటనే వివేక్ నవ్వుతూ నేను వేరే పని మీద వెళ్లాను అంటూ స్పందిం చారు. రాష్ట్రంలో వివేక్, కోమటిరెడ్డి కుటుంబాల హడావిడి మాత్రమే నడు స్తున్నదని మల్లారెడ్డి తిరిగి వ్యాఖ్యానించారు. కేసీఆర్, మల్లారెడ్డి కుటుం బాలది కూడా నడుస్తున్న దని చిరునవ్వులు చిందిస్తూ వివేక్ చెప్పారు. ఇప్పుడు మాది నడవడం లేదని మల్లారెడ్డి అందుకుగా ప్రతిగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలోని ఎమ్మెల్యేల ఎంట్రీ పాయింట్ దగ్గర పలువురితో చొరవగా మాట్లాడుతూ మల్లారెడ్డి హడావిడి చేశారు.

నూతన పర్యాటక విధానం తెచ్చాం

- ఈ రంగాన్ని పదేండ్లుగా బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది : పర్యాటక శాఖ పద్దుపై మంత్రి జూపల్లి కృష్ణారావు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లపాటు పర్యాటక రంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతన టూరిజం విధానాన్ని రూపొందించిందని వెల్లడించారు. మంగళవారం శాసనసభలో పర్యాటక శాఖ పద్దులపై ఆయన మాట్లాడారు. రానున్న ఐదేండ్లలో పర్యాటక రంగంలో రూ.15వేల కోట్ల పెట్టుబడులను తీసుకొస్తామని వివరించారు. మూడు లక్షల మందికి అదనపు ఉపాధి అవకాశాలను లు కల్పిస్తామని తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించడంలో దేశంలో తొలి ఐదు స్థానాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని నిలబెడతామని వివరించారు. బోటింగ్, హరిత హోటల్స్, వాటర్ స్పోర్ట్స్, రోప్‌వే, వెల్‌నెస్ సెంటర్లు, ఎకో టూరిజం, థీమ్ పార్కులు, సస్పెన్షన్ బ్రిడ్జి, గ్లో గార్డెన్స్, మ్యూజికల్ ఫౌంటెంట్స్, 3డీ ప్రొజెక్షన్ మ్యాపింగ్, సౌండ్ అండ్ లైట్ షో మొదలైన వాటిని ఆయా పర్యాటక కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వం పదేండ్ల కాలంలో రూ. 243 కోట్లు ఖర్చు చేయగా, అందులో ఒక సిద్దిపేటలోనే రూ. 51 కోట్లు ఖర్చు చేసిందని విమర్శించారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా తమ ప్రభుత్వం వివిధ పనుల కోసం రూ.125 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మొత్తం 43 హోటల్స్, 32 రెస్టారెంట్లు ఉన్నాయని గుర్తు చేశారు. వీటిలో 23 హోటల్స్, ఒక రెస్టారెంట్ టూరిజం కార్పొరేషన్ నిర్వహిస్తున్నదనీ, 16 హోటల్స్, 17 రెస్టారెంట్లు ప్రయివేటు భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేందుకు హైదరాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు. బాపు ఘాట్ వద్ద అభివృద్ధికి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించనున్నట్టు వివరించారు. లండన్ ఐ తరహాలో జాయింట్ అబ్జర్వేషన్ వీల్ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందన్నారు. ఫ్యూచర్ సిటీలో గోల్ఫ్ కోర్స్, జాతీయ, అంతర్జాతీయ సమావేశాల నిర్వహణకు 20 వేల మంది సామర్థ్యంతో ముంబాయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ తరహాలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రియో కార్నివాల్ ఫెస్టివల్ తరహాలో హైదరాబాద్ కార్నివాల్ ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నామన్నారు. మద్యం ద్వారా ఆదాయాన్ని పెంచుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. కొన్ని నిబంధనలను అమలు చేయడం ద్వారా కొంత ఆదాయం వస్తున్నదని వివరించారు.

రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- ఈనెల 20న 17,162 మెగావాట్ల గరిష్ట స్థాయి నమోదు
- వివరాలు వెల్లడించిన తెలంగాణ విద్యుత్ శాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని ఆ శాఖ తెలిపింది. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4:39 గంటలకు, తెలంగాణలో విద్యుత్ డిమాండ్ గరిష్ట స్థాయికి (17,162 మెగావాట్లు) చేరుకుంది, ఇది రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో గరిష్ట డిమాండ్ 15,623 మెగావాట్లుగా నమోదైంది అలాగే రోజువారీ విద్యుత్ వినియోగం కూడా 331.161 మిలియన్ యూనిట్లకు చేరింది. గత మూడు యాసంగి సీజన్లలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లో 12 నుంచి 59.36 శాతం పెరిగింది. వేసవిలో పెరిగిన వినియోగం, వ్యవసాయ రంగంలో 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా తదితర కారణాలతో విద్యుత్ వినియోగం పెరిగిందని విద్యుత్ శాఖ వెల్లడించింది. తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్ అంతరాయాలు 24.01 శాతం తగ్గగా, రాష్ట్రము మొత్తం మీద 23.64 శాతానికి తగ్గాయిన పేర్కొంది. సిబ్బంది, అధికారులు నిబద్ధతతో పని చేయడంతోనే ఎలాంటి అంతరాయం లేకుండా రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామని దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మెన్ ముషారఫ్ ఫరూఖి తెలిపారు.

బీఆర్ ఎస్ పాలనలో రెండు దశాబ్దాలు వెనక్కి విద్యా వ్యవస్థ

- 75 శాతం యూనివర్సిటీల పోస్టులు ఖాళీ
- మా ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచింది : కాంగ్రెస్ సభ్యులు మేడిపల్లి సత్యం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో విద్యా వ్యవస్థ రెండు దశాబ్దాలు వెనక్కి పోయిందని కాంగ్రెస్ సభ్యులు మేడిపల్లి సత్యం విమర్శించారు. 82 శాతం ఐదో తరగతి పిల్లలు కనీసం రెండో తరగతి పాఠ్యపుస్తకాలు చదవలేని పరిస్థితిలో ఉన్నారనీ, ఎనిమిదో తరగతి పిల్లలకు గణితంలో బేసిక్స్ కూడా రావట్లేదని పలు సర్వే సంస్థలు ఎత్తిచూపిన విషయాన్ని సభలో ప్రస్తావించారు. మంగళవారం శాసనసభలో విద్యాశాఖ పద్దు చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ...ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పూర్తయిన తర్వాత డ్రాపౌట్స్ సంఖ్య జాతీయ స్థాయిలో 13.2 శాతం ఉండగా తెలంగాణలో అది 22.1 శాతం ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్లుగా చైతన్య, నారాయణ విద్యాసంస్థల కోసం ప్రభుత్వ విద్యావ్యవస్థను బీఆర్ఎస్ సర్కారు గాలికొదిలేసిందని విమర్శించారు. డీఈఓ, ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉండటాన్ని ఎత్తిచూపారు. యూనివర్సిటీ సిబ్బంది నియామకాల్లేవనీ, 75 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఓయూలో సైకాలజీ, సోషియాలజీ, తదితర విభాగాలు మూసేసే దశలో ఉన్నాయని వాపోయారు. తమ ప్రభుత్వం రాగానే విద్యా వ్యవస్థను గాడిలో పెట్టే చర్యలు తీసుకున్నదనీ, అందులో భాగంగానే డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేసిందని తెలిపారు. అదే సమయంలో టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లను కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచుతున్నామని చెప్పారు. టీఆర్ఎస్ నాయకులకు చెందిన అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలను కట్టిస్తున్నామని తెలిపారు. డైట్‌చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతానికిపైగా పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎయిడెడ్ పాఠశాలపై ప్రయివేటు వారి ఆధిపత్యం పెరిగిందనీ, ఆ స్కూళ్ల భవనాలు వారి చేతుల్లోకి వెళ్లిపోతున్న తీరును వివరించారు. రాష్ట్రంలో కోచింగ్ సెంటర్లపై నియంత్రణ తేవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

పోడు భూములకు సాగు సౌకర్యాలు కల్పించాలి : కోరం కనకయ్య

పోడు భూము సాగుచేసుకుంటున్న గిరిజనులకు, ఆదివాసీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ సభ్యులు కోరం కనకయ్య కోరారు. బోర్లు వేసుకునేందుకు ఐటీడీఏ అనుమతులు ఇచ్చినా..అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్న తీరును సభా దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ లైన్లను వేసుకుంటే తొలగిస్తున్నారని వాపోయారు. సొంత ఖర్చుతో విద్యుత్ లైన్లు వేసుకుంటున్న పోడుసాగుదారులను అడ్డుకోవద్దని విన్నవించారు. పోడు సాగుదారులకు వారసత్వ హక్కు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

హిందూ భక్తుల కోసం చార్‌దామ్ యాత్ర పథకం తేవాలి : బీజేపీ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

ముస్లింల కోసం అమలవుతున్న హజ్‌యాత్ర పథకం మాదిరిగానే హిందూ భక్తుల కోసం చార్‌దామ్ యాత్ర పథకం తేవాలని బీజేపీ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నియోజక వర్గం నుంచి ఏటా 500 మందికి చార్‌దామ్ యాత్ర సౌక ర్యం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో దేవాల యాల పరిరక్ష ణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో తెలంగాణలో వందకుపైగా దేవాలయా లపై దాడులు జరిగాయని తెలిపారు. ఆ ఆలయాలను పునఃప్రతిష్ఠించే బాధ్యతను రాష్ట్ర సర్కారే తీసుకోవాలని విన్నవించారు. కుంటాల వాటర్స్ పాల్స్ దగ్గర కనీస సౌకర్యాలు కల్పిస్తే అక్కడకు వెళ్లే టూరిస్టుల సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన టూరిజం పాలసీని సమర్థిస్తున్నట్టు ప్రకటించారు.

సాయుధ బలగాలకు ఎస్బీఐ ఉద్యోగుల భారీ విరాళం

నవతెలంగాణ- హైదరాబాద్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) హైదరాబాద్ సర్కిల్ ఉద్యోగులు రూ.37.16 లక్షలను సాయుధ బలగాల ఫ్లాగ్ డే ఫండ్‌కు అందజేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ మొత్తం విలువ చేసే చెక్కును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు తమ ఉద్యోగుల తరపున ఎస్బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ అందజేశారు. ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్‌కు జిష్ణుదేవ్ వర్మ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఎస్బీఐ ఉద్యోగుల తరహాలోనే ఇతర పౌరులు విరాళలను అందించాలని జిష్ణుదేవ్ పేర్కొన్నారు. సాయుధ బలగా లు, అందులోని మాజీలకు, భర్తలను కోల్పోయిన వితంతువుల కుంటుంటాల సంక్షేమం కోసం ఎస్బీఐ చేస్తున్న సాయం గొప్పదని ప్రశంసించారు.

చట్టంలోని లొసుగులను ఎత్తిచూపే 'దుపట్ట కిల్లర్'

హైదరాబాద్ : 'ది దుపట్ట కిల్లర్' డాక్యుమెంటరీ న్యాయ వ్యవస్థలోని లొసుగులను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో ఎత్తి చూపుతుందని డాక్యుబే తెలిపింది. గోవాకు చెందిన సీరియల్ కిల్లర్ మహానంద్ నాయక్ పతనమైన కథ లోతులను వివరిస్తుందని పేర్కొంది. ఈ డాక్యుమెంటరీ డాక్యుబేలో స్ట్రీమింగ్ అవుతోందని తెలిపింది. "16 మంది మహిళలను హత్య చేసిన ఆరోపణలను ఎదుర్కొని రెండు నేరాల్లో మాత్రమే శిక్ష పడిన మహానంద్ నాయక్ కథ ఇది. ఇప్పటికీ అతడికి విడుదలయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ డాక్యుమెంటరీ న్యాయ వ్యవస్థలోని లొసుగులను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో ఎత్తి చూపుతుంది. అలాగే బాధితుల కథలు, సంవత్సరాలుగా చట్టాన్ని తప్పించుకుని తిరుగుతున్న హంతకుడి భయానక మనస్తత్వాన్ని చూపిస్తుంది. జగ్గర్నాట్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో, సమర్ ఖాన్ నిర్మాణంలో పాట్రిక్ గ్రాహమ్ దర్శకత్వం వహించిన ది దుపట్టా కిల్లర్ గతంలో ఎప్పుడూ చూడని లోతైన విశ్లేషణను అందిస్తుంది." అని డాక్యుబే పేర్కొంది.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

ట్రాయ్ వర్క్‌షాప్

నవ తెలంగాణ - హైదరాబాద్

సైబర్ సెక్యూరిటి, టెలి కమ్యూనికేషన్స్ నిబంధనలు, వినియోగదారుల హక్కులు తదితర అంశాలపై టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చత్తీస్‌ఘడ్, ఒడిస్సాలో కార్యకలాపాలు కలిగిన ప్రముఖ టెలికం కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో ఎయిర్‌టెల్, బిఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్ ఐడియా కంపెనీల ప్రతినిధులు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ప్రతినిధులు తమ రిపోర్టులను ప్రదర్శించారు. ట్రాయ్ రీజినల్ ఆఫీసు అడ్వైజర్ బి ప్రవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బ్రాడ్‌కాస్టింగ్ వినియోగదారులకు అభివృద్ధి చెందుతున్న టెలికం ఈకోసిస్టమ్‌పై గ్రామీణ వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. వినియోగదారుల హక్కులు, నిబంధనలపై వివరించాలన్నారు. సిడాక్ ప్రాజెక్టు మేనేజర్ ఎం జగదీష్ బాబు మాట్లాడుతూ.. సైబర్ మోసాలు, భద్రతపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డిఓటి ఎపి ఎల్ఎస్ఎ సెక్యూరిటీ డైరెక్టర్ అర్వింద్ కుమార్ మాట్లాడుతూ.. సైబర్ మోసాల కట్టడిపై ఆయన చర్చించారు.

ఆస్తి పన్నుపై 'ఓటీఎస్' : జీవో విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఆస్తి పన్నుకు సంబంధించి 'వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్)'కు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) తరహాలో ఆస్తి పన్నుపై వడ్డీలో 90 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 31 నాటికి ఆస్తిపన్ను బకాయిలపై 10 శాతం వడ్డీ చెల్లించిన వారికి ఓటీఎస్ వర్తిస్తుందని జీవోలో పేర్కొంది.

అప్పటి వరకూ..

- జమ్మూకాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతమే : ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదాను పార్లమెంట్ పునరుద్ధరించే వరకూ వరకూ ఈ ప్రాంతం కేంద్రపాలితప్రాంతంగానే కొనసాగుతుందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంగళవారం తెలిపారు. ఒక బిల్లులో 'కేంద్రపాలిత ప్రాంతం' అనే పదాన్ని ఉపయోగించడంపై ప్రతిపక్ష ఎమ్మెల్యేలు విమర్శలు, వాకౌట్ చేయడాన్ని ముఖ్యమంత్రి ఖండించారు. 'మనం ఇక్కడ 'కేంద్రపాలిత ప్రాంతం' అని ప్రస్తావించినంత మాత్రాన ఏమీ మారదు. దురదృష్టవశాత్తు, భారత పార్లమెంట్ మన రాష్ట్ర హోదాను పునరుద్ధరించే వరకూ మనం కేంద్రపాలిత ప్రాంతంగానే ఉంటాం. కాబట్టి దీనిని రాజకీయం చేయవద్దు' అని ముఖ్యమంత్రి చెప్పారు. వాకౌట్ చేయడం వలన ప్రయోజనం ఉండదని అన్నారు. 'జమ్మూకాశ్మీర్ ప్రజలకు మనం రాష్ట్రహోదా తిరిగివ్వాలి. మేం దాన్ని పునరుద్ధరిస్తాం. మీకు నచ్చినా నచ్చకపోయినా మనది కేంద్రపాలిత ప్రాంతం. ఈ ప్రభుత్వం కేంద్రపాలిత ప్రాంతంగానే పాలన సాగిస్తుంది' అని తెలిపారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం తమ ప్రభుత్వం తీవ్రంగా పోరాడుతుందని పునరుద్ఘాటించారు. నిజానికి ఇక్కడున్న సభ్యులంతా కేంద్రపాలిత ప్రాంతం కిందే ప్రమాణస్వీకారం చేశారని, దాని కిందే ఎన్నికల్లో పోటీ చేశారని ఒమర్ అబ్దుల్లా గుర్తు చేశారు.

ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో జమూకాశ్మీర్ వస్తువు సేవల పన్ను (జీఎస్టీ) చట్టం 2017కు సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. ఇందులో కేంద్రపాలిత ప్రాంతం అనే పదాన్ని ఉపయోగించడాన్ని పీపుల్స్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యే సజాద్ గని లోన్ విమర్శించారు. సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ బిల్లును ఆమోదించడం అంటే కేంద్ర పాలిత ప్రాంత హోదాను అసెంబ్లీ ఆమోదించడమేనని ఆరోపించారు. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ సభ్యులు వాహిద్ పారా కూడా కేంద్ర పాలిత ప్రాంతం అనే పదం ఉపయోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

త్రైపాక్షిక నావికా విన్యాసాలతో పరిస్థితులు మరింత ఉద్రిక్తం

- కేసీఎన్ఏ వ్యాఖ్యలు

సియోల్ : అమెరికా, దక్షిణ కొరియా, జపాన్‌లు ఇటీవల నిర్వహించిన త్రైపాక్షిక నావికా విన్యాసాలు ఈ ప్రాంతంలో ఇప్పటికే తీవ్రంగా వున్న రాజకీయ, మిలటరీ పరిస్థితులను మరింత ఉధృతం చేశాయని అధికార కొరియన్ వార్తా సంస్థ కేసీఎన్ఏ వ్యాఖ్యానించింది. మార్చి 10 నుండి 20 వరకు అమెరికా, దక్షిణ కొరియాలు ఫ్రీడమ్ షీల్డ్ మిలటరీ విన్యాసాలను నిర్వహించాయి. అదే సమయంలో మార్చి 17 నుంచి 20 వరకు అమెరికా, జపాన్, దక్షిణ కొరియాలు జేజు దీవిలో సముద్ర జలాల్లో నావికా విన్యాసాలు నిర్వహించాయి. మూడు దేశాలకు చెందిన యుద్ధ నౌకలు ఇందులో పాల్గొన్నాయి. అణు శక్తితో నడిచే అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ కార్ల్ విన్సన్ కూడా పాల్గొంది. ఈ ప్రాంతంలోని సార్వభౌమ దేశాల సాధారణ సముద్ర రవాణాను కూడా బలవంతంగా అడ్డుకోవాలన్నది వారి నీచపు ఆలోచనగా వుందని ఈ విన్యాసాలతో వెల్లడవుతోందని కేసీఎన్ఏ తన వ్యాఖ్యానంలో పేర్కొంది. ఉత్తర కొరియా పట్ల ప్రస్తుత అమెరికా ప్రభుత్వం ఘర్షణాయుత వైఖరిని అవలంబిస్తోందని పేర్కొంది. తమ జాతీయ భద్రతను పరిరక్షించుకోవడానికి, ప్రాంతీయ శాంతి కోసం ఉత్తర కొరియా తన ప్రయత్నాలను మరింత పెంచుతుందని పేర్కొంది. ఉత్తర కొరియా భద్రతా వలయంలో అమెరికా సిద్ధాంతాలు పనిచేయవని వ్యాఖ్యానించింది. శత్రు దేశాల నుంచి ఎలాంటి కవ్వింపు చర్యలు ఎదురైనా వాటికి తగిన ప్రతిస్పందన తమ వైపు నుంచి వుంటుందని స్పష్టం చేసింది.

ఒకవైపు రైతు ఆత్మహత్యలు... మరోవైపు అందాల పోటీలా?

- మాజీ మంత్రి కేటీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, మరోవైపు అందాల పోటీలు నిర్వహిస్తారా? అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వేసవి సమయంలో నీటి ఎద్దడి నివారణపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంగళవారం శాసనసభలో పర్యాటక శాఖ పద్దుల చర్చలో ఆయన మాట్లాడారు. ఫార్ములా ఈ కార్ రేస్ ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రూ.46 కోట్ల ఖర్చు చేస్తే రాద్ధాంతం చేసి రేస్ నిర్వహణ జరగకుండా చేశారని విమర్శించారు. ఇప్పుడు రూ.54 కోట్లతో మిస్ వరల్డ్ పోటీలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ పోటీల ద్వారా ఆదాయం ఎలా వస్తుందో, కొలువులు ఎలా వస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు. మిస్ యూనివర్స్, మిస్ యూనివర్స్ అవుట్ డేటెడ్ అయ్యాయని తెలిపారు. అమరవీరుల జ్యోతిని పర్యాటక ప్రాంతంగా వినియోగించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ హయంలో రామప్పకు యూనిస్కో గుర్తింపు వచ్చిందన్నారు. ఆ దిశగా కేంద్రానికి లేఖ రాసి అది సాధించామన్నారు. రంగనాయక సాగర్, పోచంపాడు, మల్లన్న సాగర్ కాళేశ్వరంలో భాగంగా నిర్మించామన్నారు. అవి ఇప్పుడు పర్యాటక కేంద్రాలుగా మారాయన్నారు. తాము ఓఆర్ఆర్ టీవోటీ పద్ధతిలో 33 సంవత్సారాలకు లీజ్‌కు ఇస్తే ప్రశ్నించిన మంత్రులు...ఇప్పుడు పర్యాటక శాఖకు చెందిన భూములను 99ఏండ్లు లీజుకు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు.

త్వరలో 12వేల కిలోమీటర్ల రహదారులు : మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

రాష్ట్రంలో 12వేల కిలోమీటర్ల రాష్ట్ర రహదారులకు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 17,200 కిలోమీటర్ల రహదారులకు ప్లాన్ చేసినట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శాసనసభలో రోడ్లు, భవనాల శాఖ పద్దులపై ఆయన మాట్లాడారు. రహదారులను జిల్లా యూనిట్‌గా తీసుకుంటామన్నారు. మూడేండ్లలో ట్రిబుల్ ఆర్ పూర్తిని చేస్తామన్నారు. కొన్ని జిల్లాల్లో నాక్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.బీఆర్ఎస్ హయాంలో పూర్తికాని పనులను తాము వేగంగా పూర్తి చేశామని వివరించారు.

గణనీయంగా తగ్గిన మిర్చి ధర !



గత మార్చితో పోల్చితే క్వింటాల్‌కు రూ.5,923 తగ్గుదల

రైతుల్లో తీవ్ర అసంతృప్తి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో మిర్చి ధర క్వింటాల్‌కు రూ.500 ధర తగ్గడంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మంగళవారం ఎనుమాముల మార్కెట్‌ను 'నవతెలంగాణ' సందర్శించింది. సోమవారం మిర్చి ధరతో పోల్చితే మంగళవారం రూ.500 ధర తగ్గింది. గతేడాది మార్చి, ఈ ఏడాది మార్చితో పోలిస్తే మిర్చి ధర క్వింటాల్‌కు రూ.5,923 ధర తగ్గడం గమనార్హం.

ఎనుమాముల మార్కెట్‌కు మంగళవారం 37,100 బస్తాల మిర్చి వచ్చింది. సుమారుగా 13,480 క్వింటాళ్ల మిర్చి రాగా, గరిష్ట ధర రూ.12,700, కనిష్ట ధర రూ.11,000 ఉంది. సగటున మిర్చి క్వింటాల్‌కు రూ.11,500 ధర పలికింది. సోమవారం మార్కెట్‌లో మిర్చి ధర రూ.1,3000-రూ.10,000 ధర ఉంది. మోడల్ ధర రూ.12,000గా మార్కెటింగ్ అధికారులు నిర్ధారించారు. మంగళవారం మోడల్ ధర రూ.11,500గా మార్కెటింగ్ అధికారులు నిర్ధారించారు.

ఖాళీ అవుతున్న కోల్డ్ స్టోరేజీలు

వరంగల్‌లో 30 కోల్డ్ స్టోరేజీలున్నాయి. ఇవన్నీ 33 లక్షల సంచుల సామర్థ్యం కలిగినవి. ఇందులో ప్రస్తుతం 14 లక్షల సంచుల మిర్చి ఉంది. మరో 2 లక్షల సంచులు చింతపండు, ధనియాలు, పసుపు తదితర ఉత్పత్తులున్నాయి. గతేడాది కోల్డ్ స్టోరేజీలు మొత్తం పెద్ద మొత్తంలో మిర్చి నిల్వలున్నాయి. ఈ మార్కెటింగ్ సీజన్‌లో డిసెంబర్, జనవరి మాసాల్లో కోల్డ్ స్టోరేజీల్లోని మిర్చిని మార్కెట్‌లో పెద్ద మొత్తంలో విక్రయించినట్టు మార్కెటింగ్ అధికారుల నివేదికను బట్టి అర్థమవుతోంది.

ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉంది



రానున్న రోజుల్లో మిర్చి ధరలు మరింత తగ్గే అవకాశాలున్నాయి. గతేడాది కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునేలా ప్రోత్సహించాం. ధరలు పడిపోతే రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకోవడం శ్రేయస్కరం. ఈసారి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే అవకాశముంది. రైతులకు ధరల విషయంలో సంతృప్తి లేని పక్షంలో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకొని ధరలు ఆశాజనకంగా ఉన్నప్పుడు విక్రయించుకొని లాభం పొందొచ్చు.

- గుగులోతు రెడ్డి, కార్యదర్శి, ఎనుమాముల మార్కెట్

'నాకే వినబుద్ధికావట్లేదు' స్పీకర్ అనడం బాధాకరం

ఆ వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోండి

రికార్డుల నుంచి తొలగించండి : స్పీకర్‌ను కోరిన బీఆర్ఎస్ సభ్యులు సునీతా లక్ష్మారెడ్డి

నేను మిమ్మల్ని ఉద్దేశించి అనలేదు..

సభ్యుల రన్నింగ్ కామెంట్‌ను తప్పుబడుతూ అన్నా

మీరు అలా అనుకోవడం సరిగాదు..

ఆ మాటల్ని ఉపసంహరించుకోవడానికి నాకేం అభ్యంతరం లేదు

రికార్డుల నుంచి తొలగిస్తాం : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన మాటలు వినబుద్ధి కావట్లేదని సభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారనీ, అలా అనటం తనకు బాధ కలిగించిందని బీఆర్ఎస్ సభ్యులు సునీతా లక్ష్మారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ మాటల్ని ఉపసంహరించుకోవాలనీ, రికార్డుల నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. తాను ఆ సభ్యురాలిని ఉద్దేశించి మాట్లాడలేదనీ, రన్నింగ్ కామెంట్ చేస్తున్న సభ్యుల్ని ఉద్దేశించి అన్నానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. అయినా, ఆ మాటలు ఆమెను బాధ కలిగించాయనుకుంటే ఉప సంహరించుకుంటున్నాననీ, రికార్డుల నుంచి తొలగిస్తామని ప్రకటించారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగానే సునీతా లక్ష్మారెడ్డి లేచి బాధతో మాట్లాడారు. "సభ్యుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంది. నిన్న రాత్రి సభలో మీరు నన్ను ఉద్దేశించి అన్న మాటలు చాలా బాధాకరం. స్త్రీ, శిశు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై మాట్లాడుతానని ముందే సమయం అడిగాను. అవకాశం కోసం ఉదయం నుంచి వేచియున్నా. రాత్రి 8 గంటల సమయంలో మాట్లాడే అవకాశమిచ్చి రెండు నిమిషాల్లో పూర్తి చేయాలన్నారు. నేను మాట్లాడుతుంటే.. "నాకే వినబుద్ధి అవ్వడం లేదు. మీరు ఎలా వింటున్నారు" అని మీరు అన్నారు. సభలో నిరసనల మధ్య తనకు సరిగా వినపడలేదు. వాకౌట్ చేసి బయటకు వెళ్లిన తర్వాత మా సభ్యులు నా దృష్టికి తీసుకొచ్చారు. నేనెప్పుడూ ఒకరితో మాటపడలేదు, ఎక్కడున్నా క్రమశిక్షణతో ఉన్నాను. నేనేం తప్పు మాట్లాడానో చెప్పండి. నా నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల గురించి మాట్లాడానే తప్ప మరో విషయం కాదు. ఒక మహిళగా, మాజీ మంత్రిగా, సీనియర్ సభ్యురాలిగా ఎక్కడ కూడా అన్‌పార్లమెంటరీ భాష వాడలేదు. జీరో అవర్‌లో ఒకటే సబ్జెక్ట్ మాట్లాడాలనీ, అసభ్య పదజాలం మనం ఉపయోగించకూడదని కొత్తగా వచ్చిన మా సభ్యులకు పదేపదే చెబుతున్నాను. ఒకరికి చెప్పగలిగే స్థాయిలో ఉన్న నాపై మీరు అలా మాట్లాడటం బాధ కలిగించింది. ఆ వ్యాఖ్యలు మంచిగనిపిస్తే రికార్డుల్లో కొనసాగించండి. లేదంటే ఉప సంహరించుకోవాలి. సభాపతిగా మా హక్కులు కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌ది. అధికార పక్షానికి నచ్చకపోతే బాగాలేదని చెప్పాలి. గతంలో కూడా మహిళలను ఉద్దేశించి ముఖ్యమంత్రి అభ్యంతరకరంగా మాట్లాడారు. అయినప్పటికీ నిలుచుని మౌనంగా నిరసన తెలిపాం. ఇలాంటివి మరోసారి జరగకూడదు. ఇది సభా సంప్రదాయాలకు మంచిది కాదు' అని సునీతా లక్ష్మారెడ్డి సూచించారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. 'మహిళలంటే తనకు ఎనలేని గౌరవం. నాకూ 8 మంది అక్కాచెల్లెళ్లు ఉన్నారు. మిమ్మల్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదు. తాను ఈ సీటు మీద ఉండి అలా అన్నానని మీరు అనుకోవడం చాలా పొరపాటు. మీరు మాట్లాడేటప్పుడు ఇరువైపుల నుంచీ రన్నింగ్ కామెంట్ చేస్తున్నారు. దీంతో వారు మాట్లాడేది నాకే వినబుద్ధి అవుతలేదు. మీకు వినబడుతున్నదా? అని అన్నాను. మిమ్మల్ని ఉద్దేశించి అలా అనలేదు. మీ మనసు కష్టపడితే ఆ వ్యాఖ్యలను విత్‌డ్రా చేసుకుంటున్నాను. రికార్డుల నుంచి తొలగిస్తాం' అని చెప్పడంతో కథ ప్రశాంతంగా ముగిసింది. బీఆర్ఎస్ సభ్యులు దీనిపై ఏదో మాట్లాడబోతుండగా..'దీన్ని వదిలేయండి..పద్దులపై చర్చలో పాల్గొనండి' అని స్పీకర్ సూచించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- దేవాదాయ శాఖ పద్దులపై కొండా సురేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేవాలయాలకు వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. మంగళవారం శాసనసభలో దేవాదాయ, అటవీ శాఖల పద్దులపై ఆమె మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఎన్నో పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని చెప్పారు. సమ్మక్క, సారాలమ్మ జాతర, బోనాల పండుగను ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. తెలంగాణ కుంభమేళాగా ప్రాచుర్యం పొందిన సమ్మక్క-సారాలమ్మ జాతరను ప్రభుత్వం ఈసారి ప్రభుత్వం ఎంతో వైభవోపేతంగా నిర్వహించిందని చెప్పారు. ప్రతి రెండేండ్లకొసారి నిర్వహించే ఈ జాతరను ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి 24వరకు విజయవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించామన్నారు. ఈ ఏడాది బోనాల నిర్వహణ నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చైర్మెన్‌గా రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కార్తీక మాసంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరివేసేలా 'సామూహిక కార్తీకమాస దీపోత్సవ వేడుకలు' వైభవోపేతంగా నిర్వహించామన్నారు. కార్తీక మాస దీపోత్సవ వేడుకలకు హాజరయ్యే మహిళా భక్తులకు ఉచితంగా పసుపు కుంకుమ అందించామన్నారు. ఆర్టీసీ సహకారంతో ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించామని గుర్తు చేశారు. బాసర, ఆలంపూర్ జోగులాంబ దేవాలయాల్లో మహాహారతి, నదీ హారతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

పండుగలు, జాతర్ల సందర్భాల్లో దేవాలయాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పన నిమిత్తం దేవాలయాల్లో 126 ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 408 దేవాలయాలకు ట్రస్ట్ బోర్డులను ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్టు చెప్పారు. కబ్జాకు గురైన దేవాలయాల భూములను వెనక్కి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ వివరాలను ఇవ్వాలంటూ మంత్రి సభ్యులను కోరారు. వేములవాడ దేవస్థానం అభివృద్ధికి రూ. 127.65 కోట్లు కేటాయించినట్టు తెలపారు.

పచ్చదనాన్ని పెంచుతాం

ప్రపంచ వ్యాప్తంగా అడవులు ధ్వంసమవుతున్న నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అటవీ సంరక్షణ, పచ్చదనం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రజా ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో అటవీ శాఖకు రూ.1,023 కోట్ల బడ్జెట్ కేటాయించిందని గుర్తు చేశారు. అటవీ శాఖ విస్తీర్ణాన్ని 23 శాతం నుంచి 33 శాతానికి పెంచుతామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో హడావుడి చేసి నిధులు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నుంచి నాలుగు గ్రామాల తరలింపు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వ్‌తో కలిపే 1442.26 చదరపు కి.మీల అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

ఉపాధి వేతనాలపై నిలదీత

లోక్‌సభలో ప్రతిపక్షాల ఆగ్రహం

ఆర్థిక బిల్లు ఆమోదం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉపాధి హామీ వేతనాల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. లోక్‌సభలో మంగళవారం కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ అదూర్ ప్రకాశ్ తమ రాష్ట్రంలో ఉపాధి కార్మికుల సంఖ్య తగ్గుదలపై ప్రస్తావించారు. చెల్లింపుల ఆలస్యం, తక్కువ వేతనాలు ఇందుకు కారణమని అన్నారు. "కేరళలోని కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు అందలేదు. ఈ చట్టం కింద రూ. 811 కోట్లు రావాల్సి ఉంది. గ్రామీణాభివృద్ధిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఉపాధి వేతనాలను ద్రవ్యోల్బణంతో అనుసంధానించి, పనిదినాలను 150కి పెంచాలని సిఫారసు చేసింది. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని ఆలస్యం లేకుండా విడుదల చేస్తుందా?" అని ఆయన ప్రశ్నించారు. కాగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిధులను నిలిపివేశారనే వాదనలను తోసిపుచ్చారు. ఈ సంవత్సరం కేరళకు ఇప్పటికే దాదాపు రూ. 3,000 కోట్లు అందాయని అన్నారు. "గత సంవత్సరం కేరళకు రూ. 3,500 కోట్లు వచ్చాయి. చెల్లింపుల విడుదల నిరంతర ప్రక్రియ. పెండింగ్‌లో ఉన్నవన్నీ రాబోయే కొన్ని వారాల్లోనే క్లియర్ చేయబడతాయి" అని ఆయన అన్నారు. ఈ విషయంపై డీఎంకే ఎంపీ కనిమొళి కూడా ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు గత ఐదు నెలలుగా ఉపాధి హామీ చెల్లింపులలో రూ.4,034 కోట్ల కోసం ఎదురు చూస్తోందని అన్నారు. "ఈ పథకం డిమాండ్ ఆధారితమైనది. చెల్లింపులు 15 రోజులకు పైగా ఆలస్యం అయితే, వాటిని కార్మికులకు వడ్డీతో సహా చెల్లించాలి.

ప్రధానమంత్రికి తమిళనాడు ముఖ్యమంత్రి లేఖ రాశారు. బకాయిలు క్లియర్ చేయబడతాయని హామీ ఇచ్చిన మంత్రిని మేము కలిశాం. కానీ ఇంకా విడుదల కాలేదు" అని ఆమె అన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ "తమిళనాడు అయినా, పశ్చిమ బెంగాల్ అయినా, మోడీ ప్రభుత్వం ఏ రాష్ట్రం పట్లా ఎప్పుడూ వివక్ష చూపలేదు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి బకాయిలు, మెటీరియల్ ఖర్చులు కూడా త్వరలో విడుదల చేస్తాం" అని అన్నారు. దీంతో ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలతో హెూరెత్తించారు. స్పీకర్ ఓం బిర్లా వారిని తమ సీట్లకు వెళ్లాలని కోరారు. కానీ ప్రతిపక్ష ఎంపీలు తమ ఆందోళన కొనసాగించారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.

లోక్‌సభలో ఆర్థిక బిల్లు ఆమోదం

లోక్‌సభ మంగళవారం ఆర్థిక బిల్లు 2025ను ఆమోదం పొంది. ఇందులో 35 ప్రభుత్వ సవరణలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఆన్‌లైన్ ప్రకటనలపై 6 శాతం డిజిటల్ పన్నును తొలగించింది. ఈ బిల్లు రాజ్యసభకు వెళుంది. రాజ్యసభ బిల్లును ఆమోదించిన తరువాత 2025-26 బడ్జెట్ ప్రక్రియ పూర్తవుతుంది. కేంద్ర బడ్జెట్ 2025-26 మొత్తం వ్యయం రూ. 50.65 లక్షల కోట్లుగా అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే 7.4 శాతం ఎక్కువగా ఉంది.

కృష్ణాజలాలు పంచాల్సిందే

ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాదనలు

కావేరి తీర్పును ఉదహరించిన న్యాయవాది

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణాజలాల్లో తెలంగాణ వాటాను వెంటనే పంచాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఆయా ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకుండా కేంద్ర జలసంఘం తాత్సారం చేస్తున్నదని నిరసన వ్యక్తం చేసింది. ఇప్పటికే ఉన్న, కొనసాగుతున్న ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో రాజీపడబోమని స్పష్టం చేసింది. మంగళవారం ఢిల్లీలో కేడబ్ల్యూడీటీ-2 చైర్మెన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్, జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎల్.తలపత్ర ఎదుట తుది వాదనలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు సత్వరమే కృష్ణాజలాల పంపిణీని చేపట్టాలని ఆయన కోరారు. కృష్ణాబేసిన్‌లో అనేక పరిమితులు ఉన్నాయంటూ పలువిషయాలు ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు. 2018లో కావేరి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు వివరించారు. నీటిపారుదల ప్రయోజనాలను రైతులకు కల్పించేందుకు ప్రయత్నించాలనీ, ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యం ఉండాలని వైద్యనాథన్ తన వాదనల సందర్భంగా ట్రిబ్యునల్‌కు చెప్పారు. నీటి వనరుల లభ్యత, నదీ పరీవాహక ప్రాంతంలోని అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్రాల మధ్య నీటి పంపకాలను చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాజెక్టులకు వెంటనే నీటి కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఎలా కొనసాగిస్తారని ట్రిబ్యునల్ వైద్యనాథన్‌ను ప్రశ్నించగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నదన్నారు. డీపీఆర్‌లను 2006లోనే కృష్ణా జలాల వివాదం ట్రిబ్యునల్-2కు సమర్పించినట్టు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి నివేదికను ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘానికి పంపామనీ, ఇంకా అనుమతులు రావడం లేదన్నారు. వెనుకబడిన ప్రాంతమైన మహబూబ్‌నగర్‌లో నీటిపారుదల సౌకర్యాలు చాలా తక్కువ ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా న్యాయవాది ట్రిబ్యునల్ దృష్టికి తెచ్చారు. కేడబ్ల్యూడీటీ-1కి నివేదిక సమర్పించినప్పటికీ 150 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు దుస్థితిని వివరించారు. బుధవారం కూడా వాదనలు కొనసాగనున్నాయి.

ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంజాన్ పండుగ పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందునిచ్చింది. తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్, కాంగ్రెస్ నేత ఫిరోజ్‌ఖాన్, పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు దూరంగా ఉన్నారు.

త్వరలో టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్ ఉద్యోగ నియామక సర్టిఫికెట్ల వెరిఫికేషన్

చిన్నారెడ్డికి ధన్యవాదాలు తెలిపిన అభ్యర్థులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2018 బ్యాచ్ టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్ ఉద్యోగ నియామక సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే ప్రారంభించనున్నట్టు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వెల్లడించారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్‌లో మంగళవారం భారీగా వచ్చిన 2018 బ్యాచ్ స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు చిన్నారెడ్డిని కలిసి నియామక ప్రక్రియ గురించి సహాయం కోరారు. వెంటనే స్పందించిన చిన్నారెడ్డి పోలీస్ రిక్రూట్‌మెంట్ చైర్మెన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలోనే నియామక ప్రక్రియ మొదలు పెట్టనున్నట్టు చైర్మెన్ వెల్లడించారని చిన్నారెడ్డి తెలిపారు. దీంతో అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తూ చిన్నారెడ్డికి బొకే ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజావాణికి 368 దరఖాస్తులు

దరఖాస్తులు స్వీకరించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి, దివ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి 368 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 76, విద్యుత్ శాఖకు సంబంధించి 30, రెవెన్యూ శాఖకు సంబంధించి 70, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం 110 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 54 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించారు. ఫిర్యాదు దారుల నుంచి సావదానంగా సమస్యలను విన్నారు.

గుడ్డు ధర రూ.6కు పెంపు

ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులు అందిస్తున్న గుడ్డు ధరను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఈవి నరసింహారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న గుడ్డు ధరను రూ.ఐదు నుంచి రూ.ఆరుకు పెంచుతున్నట్టు తెలిపారు. పెరిగిన ధర ఈనెల 13 నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలు పెరిగిన ధరలను అమలు చేయాలని ఆదేశించారు.

క్రికెట్ బెట్టింగ్‌కు యువకుడి బలి

రైలు పట్టాలపై ఆత్మహత్య

బెట్టింగ్‌లో రూ.లక్ష పోవడంతో మనస్తాపం

మేడ్చల్ మండలం గౌడవెల్లిలో ఘటన



నవతెలంగాణ- మేడ్చల్

క్రికెట్ బెట్టింగ్ భూతం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఈ యాప్‌లో లక్ష రూపాయలు పోగొట్టుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లాకు చెందిన రమణ-కనకమ్మ దంపతులు 25 ఏండ్ల కిందట ఉపాధి నిమిత్తం మేడ్చల్ జిల్లాలోని గుండ్లపోచంపల్లికి వచ్చారు. వారి ఏకైక కుమారుడు సోమేష్(29) దేవరయాంజల్ ప్రాంతంలోని ఓ ప్రయివేటు పరిశ్రమలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసేవాడు. ఐదేండ్ల కిందట తన సోదరి వివాహం కోసం తెచ్చిన కొంత డబ్బును బెట్టింగ్‌లో పోగొట్టాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకున్నాడు. అప్పటి నుంచి బెట్టింగ్‌ల జోలికి వెళ్లలేదు. తాజాగా మళ్లీ సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో లక్ష రూపాయలు ఓ బెట్టింగ్ యాప్‌లో పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని మంగళవారం ఉదయం ఫోన్‌లో తన బాల్య మిత్రుడికి చెప్పి బాధపడ్డాడు. తాను ఆత్మహత్య చేసుకుంటానని, బెట్టింగ్‌లో పెట్టిన డబ్బులు కంపెనీకి సంబంధించినవని చెప్పాడు. డబ్బులు సర్ది ఏ ఇబ్బందీ లేకుండా చూద్దామని మిత్రుడు నచ్చజెప్పినా వినకుండా సోమేష్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ఏడు నిమిషాల ముందు తన మిత్రుడికి వాట్సాప్ ద్వారా లోకేషన్ పంపించాడు. వెంటనే స్నేహితులు అక్కడికి చేరుకునే సరికే ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ బెట్టింగ్ యాప్‌లపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు తీసుకోవాలని సోమేష్ తల్లిదండ్రులతోపాటు మిత్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి విషాదం మరే కుటుంబంలోనూ జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.